www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
విజయవాడ సిటీ
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 122

చైనాలో రోబోల ఆటల పోటీలు

ఇనుములో క్రీడోత్సాహం పుట్టెనే



ప్రపంచంలోనే తొలిసారి నిర్వహణ 10

శనివారం | 16-8-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం, తిథి: అష్టమి రా.9.35 తదుపరి నవమి, నక్షత్రం: భరణి ఉ.6.06 తదుపరి కృత్తిక తె. 4.38 వరకు, వర్జ్యం: సా.5.22-6.52, దుర్ముహూర్తం: ఉ.6.01-7.42, అమృతఘడియలు: రా.2.23-3.53, రాహుకాలం: ఉ. 9.00-10.30, సూర్యోదయం: 6.01, సూర్యాస్తమయం: 6.36

దీపావళికి బొనాంజా



పండుగకు గొప్ప కానుక అందిస్తా.. సంస్కరణలతో ధరాభారం తగ్గిస్తా: ప్రధాని

- ఇక 5%, 18%.. రెండు శ్లాబుల్లోనే పన్ను?
- దాదాపు వస్తుసేవలన్నీ వీటిలోనే సర్దుబాటు
- నిత్యావసరాల ధరలు బాగా తగ్గే అవకాశం
- ఆరోగ్య, టెర్మ్ బీమా ప్రీమియం దిగొచ్చే వీలు
- విలాసవంతమైన, హానికర ఉత్పత్తులపై మాత్రం 40% ప్రత్యేక పన్ను రేటు
- చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రయోజనం
- స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో మోదీ
- వచ్చే నెలలో జరిగే జీఎస్టీ కౌన్సిల్ భేటీలో సంస్కరణలపై తుది నిర్ణయం



న్యూఢిల్లీ, ఆగస్టు 15: దేశంలో దీపావళికి 'జీఎస్టీ' పండగ రానుంది. పేదలు, మధ్య తరగతి, చిన్న పరిశ్రమలకు పన్నుల నుంచి ఉపశమనం కలిగించేలా.. ఇప్పుడున్న నాలుగు జీఎస్టీ శ్లాబులను రెండింటికి తగ్గించేందుకు రంగం సిద్ధమైంది. జీఎస్టీలో కేవలం 5శాతం, 18శాతం పన్నురేట్లే కొనసాగనున్నాయి. 12శాతం, 28శాతం పన్ను రేట్లను తొలగించి, వాటి పరిధిలో ఉన్న వస్తుసేవలను.. 5, 18శాతం శ్లాబ్‌లలో సర్దుబాటు చేయనున్నారు. దీనికి సంబంధించి ప్రధాని మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రకటన చేశారు. "దీపావళికి గొప్ప బహుమతి ఇవ్వబోతున్నా.. జీఎస్టీతో సంస్కరణలు తెచ్చి గత ఎనిమిదేళ్లలో పన్నుల విధానాన్ని సులభతరం చేశాం. ఇప్పుడు దీనిని సమీక్షించాల్సిన సమయం వచ్చింది. దీనిపై రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపాం. జీఎస్టీలో భారీ సంస్కరణలను

మిగతా 2వ పేజీలో...

దేశ రక్షణకు సుదర్శన చక్రం

- దుర్భేద్యమైన డ్రోమ్ లాంటి ఆయుధ వ్యవస్థ
- 2047 కల్లా పెరగనున్న అణు ఇంధన సామర్థ్యం
- ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌కు ఇప్పటికీ నిద్రలేదు
- అణుబాంబు బ్లాక్‌మెయిల్‌కు భారత్ భయపడదు
- సముద్ర మథనంతో సహజ వనరుల్ని తవ్వి తీస్తాం
- మావోయిస్టులను తుడిచిపెట్టే పనిలో ఉన్నాం
- కాలం చెల్లిన చట్టాలను బుట్టదాఖలు చేశాం
- 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు
- స్వాతంత్ర్య దినోత్సవంలో ప్రధాని నరేంద్రమోదీ



బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. చిత్రంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల తదితరులు





బస్సులో ఓ మహిళకు ఉచిత టికెట్ అందజేస్తున్న సీఎం చంద్రబాబు

స్త్రీ శక్తికి జై

సూపర్ సిక్స్ సూపర్ హిట్!

సంక్షేమ రాజ్యానికి కొత్త అర్థమిచ్చాం

మా సంక్షేమానికి సాటి లేదు.. అభివృద్ధికి అడ్డులేదు: సీఎం

- 64 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు
- రూ.10 వేల కోట్లతో తల్లికి వందనం
- అన్నదాతల ఖాతాల్లో 3,173 కోట్లు జమ
- 2,684 కోట్లతో 2 కోట్ల రాయితీ సిలిండర్లు
- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం
- ఈ నెలాఖరుకు 16,347 టీచర్ పోస్టుల భర్తీ
- ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేశాం
- ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలకు 10 వేలు
- అర్చకుల వేతనాలు రూ.15 వేలకు పెంచాం
- నాయీ బ్రాహ్మణులకు రూ.25 వేలు చేశాం
- గీత కార్మికులకు 10% మద్యం షాపులు, బార్లు
- మత్స్యకారులకు రూ.259 కోట్ల సాయం
- చేనేతకు అండగా ఉచిత కరెంటు
- ఇమామ్‌లకు రూ.10 వేలు.. మౌజన్లకు 5 వేలు
- ఎస్సీ వర్గాలకు నష్టం లేకుండా వర్గీకరణ

113 ప్రాజెక్టులు.. 5.94 లక్షల కోట్ల పెట్టుబడులు
వీటితో 5.56 లక్షల ఉద్యోగాలొస్తాయ్
స్వాతంత్ర్య వేడుకల్లో సీఎం చంద్రబాబు వెల్లడి



బెజవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో ముఖ్యమంత్రి చంద్రబాబు జెండా వందనం

అమరావతి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సంక్షేమం-అభివృద్ధి-సుపరిపాలనతో సాగిన ఏడాది పాలన ఎంతో సంతృప్తినిచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దేశంలో మరే రాష్ట్రంలోనూ అమలు కాని స్థాయిలో రెట్టింపు సంక్షేమం ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. ప్రధాన ఎన్నికల హామీలుగా ఉన్న సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశామని ప్రకటించారు. శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రజలకు, ప్రపంచంలోని తెలుగువారందరికీ

మిగతా 11వ పేజీలో...



మహిళలతో కలిసి బస్సులో ప్రయాణిస్తున్న చంద్రబాబు, పవన్, లోకేశ్, మాధవ్

మహిళల ఉచిత ప్రయాణానికి రైట్ రైట్

- ఫ్రీ బస్సుల్లో ఎక్కడికైనా ప్రయాణించండి
- మహిళల చేతికి త్వరలోనే స్టీరింగ్ ఇస్తా
- లేడీ కండక్టర్లను నియమించిందీ నేనే
- ఇకపై కొనేవన్నీ విద్యుత్ బస్సులే
- మహిళలు సులభంగా నడపవచ్చు: బాబు
- ఉచిత బస్సు సాధ్యమేనా అని అప్పట్లో అడిగా
- సీఎం నిబద్ధతకు ఈ పథకం నిదర్శనం: పవన్

'ఉచిత బస్సు'పై వైసీపీ విషం

ఫ్రీ బస్సు పరిధిలోకి రాని ఏసీలపై యాగీ

కండక్టర్లతో తగువు.. ఆ వీడియోలతో రాద్ధాంతం 12



10

మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా

శ్వేతా మీనన్

'అమ్మ' చరిత్రలో మహిళకు తొలి అవకాశం



థియేటర్‌కు ముసుగులో హీరో

వార్2, కూలీ సినిమాల వీక్షణ

ఎవరా నటుడు? - వివరాలు సినిమాలో..

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇంట్లో

రూ.కోటి నగదు.. 6.7 కిలోల బంగారం 2



మేఘ విస్ఫోటం జరిగిన ప్రాంతంలో శుక్రవారం కొనసాగుతున్న సహాయక చర్యలు

శిథిలాల కింద 500 మంది!

- నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా అంచనా
- మేఘ విస్ఫోటం సమయంలో చశోతీ గ్రామంలో వెయ్యి మంది!
- మృతుల సంఖ్య 60కి పెరిగిందన్న సీఎం ఒమర్ అబ్దుల్లా

జమ్మూకశ్మీర్ కిష్త్వార్ జిల్లాలో మేఘ విస్ఫోటం జరిగిన చశోతీ గ్రామం మరుభూమిని తలపిస్తోంది. వరదల్లో మృతుల సంఖ్య 60కి పెరిగింది. ఇంకా 500 మంది శిథిలాల కిందే చిక్కుకొని ఉంటారని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా అంచనా వేశారు. 10

పాక్‌లో భారీ వర్షాలు.. 214 మంది మృతి

నీలం లోయలో చిక్కుకున్న 600 మంది పర్యాటకులు

తండ్రి అప్పు తీర్చలేదని కుమార్తె కిడ్నాప్

- సీసీ ఫుటేజీతో స్వల్ప వ్యవధిలోనే ఛేదించిన ఒంగోలు పోలీసులు
- తల్లిదండ్రుల చెంతకు బాలిక.. అదుపులో తిరుపతి వ్యాపారి




బాలికను బైక్‌పై ఎక్కించుకొని వెళ్తున్న కిడ్నాపర్ సీసీ ఫుటేజీ 10

డిస్కమ్‌లలో 2,511 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- జేఎల్ఎం 1,711, ఏఈఈ పోస్టులు 800
- విద్యుత్తు సంస్థల్లో మొత్తం ఖాళీలు 7,142
- 2018 తర్వాత భర్తీకి నోచుకోని వైనం
- అవసరమైన మేర ఖాళీల భర్తీకి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం 3

తుంగభద్ర డ్యాంకు మరో ముప్పు



3

- మొరాయిస్తున్న 7 క్రస్ట్ గేట్లు
- వరద ఉధృతికి కింది భాగంలో వంపు
- పైకి, కిందకి కదలని వైనం
- ప్రస్తుతం 3 నుంచి 4 అడుగుల ఎత్తులో గేట్లు



ఖాకీనే వణికించే కిలేడీ!

రాష్ట్ర సచివాలయంలోనూ హల్‌చల్

- అత్యున్నత అధికారుల పేర్లతో పైరవీలు
- వైసీపీ హయాంలో మొదలైన ఆమె 'దిశ'
- కూటమి వచ్చాక ఆరునెలలు సైలెన్స్
- ఇప్పుడు మళ్లీ రెచ్చిపోతున్న లేడీ డాన్
- మూడు జిల్లాల పోలీసులకు హడల్

ఆమె ఉన్నతస్థాయి అధికారిణి కాదు! కనీసం ప్రభుత్వ ఉద్యోగిని కూడా కాదు! కానీ... సచివాలయంలోకి ఎప్పుడు పడితే అప్పుడు వెళ్తుంది. నేరుగా సీనియర్ ఐఏఎస్ చాంబర్‌లలోనే కూర్చుంటుంది. హడావుడి చేస్తుంది. హల్‌చల్ సృష్టిస్తుంది. వైసీపీ అధికారంలో ఉండగా ఆమె హవా నడిచింది. కూటమి వచ్చాక కొన్నాళ్లు సైలెంట్‌గా ఉండి... మళ్లీ తన ప్రతాపం చూపిస్తోంది. ఇంతకీ ఎవరామె? ఏమా కథ?

ఆంధ్రజ్యోతి పరిశీలన

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆమె ఒక లేడీ డాన్! ఆర్థిక లావాదేవీల్లో తల దూర్చడం, యూత్ గ్యాంగ్‌ను ఏర్పాటు చేసుకుని సెటిల్మెంట్లు చేయడం, ఉన్నతాధికారుల పేర్లు చెబుతూ పైరవీలు చేయడం.. అలా అలా ఒక హైప్రొఫైల్ 'లేడీ'గా మారింది. ఏకంగా రాష్ట్ర సచివాలయంలోనే కూర్చుని హల్‌చల్ చేసే స్థాయికి ఎదిగింది. నెల్లూరు జిల్లాలో పేద కుటుంబంలో జన్మించిన ఆమె ఇప్పుడు రాష్ట్రంలోనే అతి పెద్ద అధికారులతో పని చేయిస్తా అంటూ ఫోన్లు చేసి బేరాలు పెడుతోంది. నెల్లూరు జిల్లాలో ఆ మహిళ పేరు తెలియని రాజకీయ నాయకులు, పోలీసు అధికారులు, క్రిమినల్స్ అరుదు. తప్పుడు పనులు వద్దని వారించిన భర్త రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. ఆ కేసు లోతుగా దర్యాప్తు చేసేందుకు ప్రయత్నించిన పోలీసు అధికారి బదిలీ అయ్యారు. గతంలో ఒక ఎస్పీతో కలిసి ఆమె గోవా ట్రిప్పు వెళ్లింది. అత్యంత సాధారణ కుటుంబంలో జన్మించిన ఆ మహిళ దశ వైసీపీ ప్రభుత్వంలో 'దిశ'తో ఎక్కడికో మారిపోయింది. నెల్లూరులో తనకు తాను మార్కెటింగ్ చేసుకుని, పోలీసు పరిచయాలు పెంచుకుని ఎదిగేందుకు ఎన్ని దారులుంటాయో అన్నీ ఎంచుకుంది. ఎమ్మెల్యేగా పోటీ చేసే స్థాయికి ఎదిగింది. గత ప్రభుత్వంలో తాడేపల్లికి

మిగతా 3వ పేజీలో...



పుతిన్‌కు స్వాగతం పలుకుతున్న ట్రంప్

అపనమ్మకాల మధ్య అధ్యక్షుల భేటీ!

- అలాస్కాలో పుతిన్‌కు ట్రంప్ రెడ్ కార్పెట్ స్వాగతం
- ఎల్మెండార్ఫ్ ఎయిర్‌బేస్‌లో సమావేశం



అమెరికా అధ్యక్షుడి అధికారిక వాహనం 'ది బీస్ట్'లో కలిసి వెళ్తున్న ట్రంప్, పుతిన్

న్యూయార్క్, ఆగస్టు 15: పరస్పర అపనమ్మకాలు, నిఘా మధ్య అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య భేటీ కొనసాగింది. భారత కాలమానం ప్రకారం శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు ట్రంప్ ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో అలాస్కాలోని ఎల్మెండార్ఫ్ ఎయిర్‌బేస్‌కు చేరుకున్నారు. పుతిన్ రాక కోసం విమానంలోనే వేచి ఉన్నారు. అరగంట తర్వాత పుతిన్ విమానం ల్యాండ్ అయింది. కాసేపటికి ఇద్దరూ ఒకే సమయంలో విమానాల్లోంచి బయటికి వచ్చారు. పుతిన్‌కు ట్రంప్ రెడ్ కార్పెట్‌పై స్వాగతం పలికారు. ఇద్దరూ నవ్వుతూ మాట్లాడుకుంటూ, కరచాలనం చేసుకున్నారు. ఇరువైపులా రెండు చొప్పున నాలుగు అత్యాధునిక ఎఫ్-22 రాప్టర్ యుద్ధ విమానాలను నిలిపి, మధ్యలో ఏర్పాటు చేసిన వేదికపైకి చేరుకుని ఫొటోలు దిగారు. తర్వాత ట్రంప్ కోరిక మేరకు ఇద్దరూ కలసి అమెరికా అధ్యక్షుడి అధికారిక వాహనం 'ది బీస్ట్'లో చర్చ వేదిక వద్దకు బయల్దేరారు. భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో చర్చలు ప్రారంభించారు.

ఇరువైపులా ముగ్గురు చొప్పున

నిజానికి ట్రంప్, పుతిన్ ఇద్దరే చర్చిస్తారని తొలుత ప్రకటించినా చివరి నిమిషంలో మార్పులు జరిగాయి. ట్రంప్ వెంట అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ప్రత్యేక రాయబారి స్టీవెన్ విట్కాఫ్... పుతిన్ వెంట రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్, విదేశాంగ విధానం సలహాదారు యూరి ఉషకోవ్ ఈ చర్చల్లో పాల్గొన్నారు. పుతిన్ రాకకు ముందే రష్యా భద్రతా సిబ్బంది ఎల్మెండార్ఫ్ ఎయిర్‌బేస్‌కు చేరుకుని ఏర్పాట్లను పరిశీలించారు. అది ఎయిర్‌బేస్ కావడంతో రష్యా సిబ్బంది గూఢచర్యమేదీ చేయకుండా అమెరికా భద్రతా సిబ్బంది నిఘా పెట్టారు. "పరస్పరం పూర్తి అపనమ్మకాల మధ్య భేటీ జరుగుతోంది. అందుకే నిఘా తప్పడం లేదు.." అని అమెరికా భద్రతా అధికారి ఒకరు పేర్కొనడం గమనార్హం.

నేనే లేకుంటే భారత్-పాక్ మధ్య అణు యుద్ధం జరిగేది: ట్రంప్

భారత్-పాకిస్థాన్ మధ్య వివాదాన్ని పరిష్కరించానని.. తానే లేకుంటే అణు యుద్ధమే జరిగేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి వ్యాఖ్యలు చేశారు. పుతిన్‌తో భేటీకి ముందు వైట్‌హౌస్‌లో ఆయన మాట్లాడారు.

రష్యా నుంచి పెరిగిన చమురు కొనుగోళ్లు

న్యూఢిల్లీ: రష్యా నుంచి ముడిచమురును కొంటున్నందుకు భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల కొరడా ఝుళిపించినా మన దేశం మాత్రం వెనక్కి తగ్గేలా కనిపించడం లేదు. రష్యా చమురు కొనుగోళ్లను ఎప్పటిలాగే కొనసాగిస్తోంది. పైగా రష్యా ఆయిల్‌ను భారత్ కొనడం ఈ నెలలో కాస్త ఎక్కువైంది. ఆగస్టులో రష్యా చమురు కొనుగోళ్లు రోజుకు 20 లక్షల బ్యారెళ్లకు పెరిగాయి.

దీపావళికి జీఎస్టీ బొనాంజ!

(మొదటి పేజీ తరువాయి)

ప్రవేశపెట్టనున్నాం. ఇది దీపావళి బహుమతి. అత్యవసర సర్వీసులపై పన్నులు దిగివస్తాయి. సాధారణ ప్రజలు వినియోగించే నిత్యావసరాల ధరలు తగ్గుతాయి. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ప్రయోజనం పొందుతాయి. మన ఆర్థిక వ్యవస్థకు మంచి ఊపు వస్తుంది.." అని మోదీ పేర్కొన్నారు. అనంతరం కేంద్ర ఆర్థిక శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. ఏయే పన్ను రేట్లు ఉంటాయన్నది నేరుగా పేర్కొనకుండా.. సాధారణ, మెరిట్ శ్లాబులు, కొన్నిరకాల వస్తువులపై ప్రత్యేక పన్నురేట్లను ప్రతిపాదించామని తెలిపింది. జీఎస్టీలో నిర్మాణాత్మక మార్పులు, పన్నురేట్ల హేతుబద్ధీకరణ, పన్నులు-రీఫండ్స్ విధానాలను సులభతరం చేయడమనే మూడు పిల్లర్లతో కూడిన సంస్కరణలు చేపట్టాలని కోరామని వెల్లడించింది.



జీఎస్టీ కౌన్సిల్‌లో తుది నిర్ణయం..

జీఎస్టీని సరళతరం చేయడంలో భాగంగా ప్రస్తుతమున్న 12శాతం, 28శాతం శ్లాబులను తొలగించి.. వాటి పరిధిలోని వస్తుసేవలను మిగతా శ్లాబుల్లో సర్దుబాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఇటీవలే జీఎస్టీ కౌన్సిల్‌కు ప్రతిపాదించింది. రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన జీఎస్టీ కౌన్సిల్ వచ్చే నెలలో దీనిపై తుది నిర్ణయం తీసుకునే అవకాశముంది.ప్రస్తుతం జీఎస్టీలో పన్ను మినహాయింపు పొందిన వస్తుసేవలు కాకుండా.. 5%, 12%, 18%, 28శాతం పన్ను రేట్లు ఉన్నాయి. ఇకపై 5శాతం, 18శాతం పన్నురేట్లను మాత్రమే కొనసాగిస్తూ.. మిగతా శ్లాబుల్లోని వస్తుసేవలను ఈ పన్ను రేట్లలోనే సర్దుబాటు చేయనున్నట్టు ఆర్థికశాఖ వర్గాలు తెలిపాయి. విలాసవంతమైన వస్తుసేవలతోపాటు సమాజంపై చెడు ప్రభావాలు కలిగించే (సిన్ గూడ్స్) పొగాకు ఉత్పత్తులు సహా ఏడింటిపై 40శాతం ప్రత్యేక పన్నురేటు విధించనున్నట్టు వెల్లడించాయి. జీఎస్టీ చట్టం ప్రకారం గరిష్టంగా 40శాతం పన్ను విధించవచ్చని వివరించాయి. జీఎస్టీ శ్లాబ్‌ల కుదింపు నేపథ్యంలో.. 12 శాతం పన్నురేటులో ఉన్న వస్తుసేవల్లో 99శాతం మేర 5శాతం పన్ను పరిధిలోకి... 28శాతం పన్నురేటులో ఉన్న వస్తుసేవల్లో 90శాతం మేర 18శాతం పన్ను పరిధిలోకి వస్తాయని అంచనా. పొగాకు ఉత్పత్తులపై ప్రస్తుతం పన్నులు, సర్‌చార్జీలు వంటివన్నీ కలిపి 88శాతం పన్ను వసూలు చేస్తున్నారని.. ఇలాంటి 'సిన్ గూడ్స్' ధరలు తగ్గకుండా ప్రత్యేక పన్నులు, చార్జీలు ఉంటాయని ఆర్థిక శాఖ వర్గాలు తెలిపాయి. అయితే ఏయే ఉత్పత్తులు, సేవలను.. ఏ శ్లాబుల్లోకి మార్చేదీ పూర్తి స్పష్టత రావాల్సి ఉందని వివరించాయి.



ప్రస్తుతం జీఎస్టీ రాబడిలో 65శాతానికిపైగా 18శాతం పన్నురేటు ఉన్న వస్తుసేవల నుంచే సమకూరుతోంది. 28శాతం శ్లాబ్ నుంచి 11శాతం ఆదాయం, 5శాతం శ్లాబ్ నుంచి ఏడు శాతం ఆదాయం, 12శాతం శ్లాబ్ నుంచి ఐదుశాతం ఆదాయం వస్తోంది.

పన్నులు తగ్గినా.. వినియోగానికి ఊపు!

జీఎస్టీ శ్లాబుల కుదింపుతో ప్రజలు రోజువారీ వినియోగించే వస్తుసేవల ధరలు తగ్గుతాయని.. ప్రస్తుతానికి జీఎస్టీ ఆదాయం తగ్గుతుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. కానీ ధరలు తగ్గడంతో ప్రజల వినియోగం పెరుగుతుందని, దానితో జీఎస్టీ ఆదాయం మళ్లీ పెరుగుతుందని అంటున్నారు. జీఎస్టీ శ్లాబుల్లో మార్పులతో వ్యవసాయం, ఆరోగ్యం, బీమా, చేతి వృత్తులు, వస్త్ర పరిశ్రమ, ఎరువులు, పునరుత్పాదక ఇంధనం, వాహన రంగాలకు ప్రయోజనం ఉంటుందని పేర్కొంటున్నారు. ట్రంప్ సుంకాలు, అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితుల్లో దేశీయంగా వినియోగాన్ని పెంచడానికి సరైన సమయంలో జీఎస్టీ సంస్కరణల నిర్ణయం తీసుకున్నారని పన్ను సేవల సంస్థ ఈవై ఇండియా ప్రతినిధి సౌరభ్ అగర్వాల్ పేర్కొన్నారు.

ఇవి పెరగొచ్చు!

జీఎస్టీ పన్ను రేట్ల హేతుబద్ధీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘానికి, జీఎస్టీ కౌన్సిల్‌కు గతంలో పలు ప్రతిపాదనలు వచ్చాయి. ఖరీదైన రెడీమేడ్ దుస్తులు, వాచీలు, బూట్లు, కూల్ డ్రింకులు, ఖరీదైన కార్లు వంటివాటిపై పన్నులు పెంచాలనే చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో జీఎస్టీ శ్లాబుల మార్పుల్లో భాగంగా వీటిని ప్రత్యేక పన్ను రేటు పరిధిలోకి తీసుకువచ్చే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. ఇక వజ్రాలు, ఇతర రత్నాలపై పన్నులు కూడా తగ్గే అవకాశం లేదని చెబుతున్నారు.

దీపావళి తర్వాత ధరలు తగ్గేవి ఇవే?

- ప్రస్తుతం 12శాతం శ్లాబ్‌లో ఉన్న నిత్యావసరాల్లో చాలా వరకు 5శాతం శ్లాబ్‌లోకి మార్చే అవకాశం ఉంది. దానితో వాటి ధరలు తగ్గుతాయి. ఇందులో ప్యాకేజ్ చేసిన పాలు, బటర్, పనీర్, నెయ్యి, పళ్లరసాలు, బాదాం ఇతర డ్రైఫ్రూట్స్, పచ్చళ్లు, జామ్, సబ్బులు, టూత్‌పేస్టులు, హెయిర్ ఆయిల్, గొడుగులు, ప్రాసెస్ చేసిన ఆహారం, కుట్టు మిషన్లు, సాధారణ వాటర్ ఫిల్టర్లు (ఎలక్ట్రిక్ కానివి), అల్యూమినియం, స్టీలు పాత్రలు, కుక్కర్లు, ఇస్త్రీపెట్టెలు, గీజర్లు, చిన్న వాక్యూమ్ క్లీనర్లు, రూ.1000 కన్నా ఖరీదైన రెడీమేడ్ వస్త్రాలు, రూ.1000 ధరలోపు పాదరక్షలు, రబ్బర్ బ్యాండ్‌లు, హ్యాండ్ బ్యాగులు, వైద్య పరీక్షల కిట్లు, సైకిళ్లు, వ్యవసాయ యంత్రాల ధరలు తగ్గే అవకాశం ఉంది.
- ప్రస్తుతం మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, బిజినెస్ క్లాస్ విమాన టికెట్లు, మధ్యస్థాయి లాడ్జీలు, హోటళ్లలో గదుల అద్దె వంటివి కూడా 12శాతం పన్నురేటులో ఉన్నాయి. వీటిని 5శాతం శ్లాబ్‌లోకి తెస్తే ధరలు బాగా తగ్గుతాయి. అదే 18శాతం శ్లాబ్‌లోకి మార్చితే ధరలు పెరుగుతాయి.
- ప్రస్తుతం ఆరోగ్య, టెర్మ్, ఇతర బీమా పాలసీల ప్రీమియంపై 18శాతం పన్ను ఉంది. దీనిని తగ్గించాలని ఎప్పటినుంచో డిమాండ్ ఉంది. తాజా సంస్కరణల్లో భాగంగా 5శాతానికి తగ్గించవచ్చనే అంచనాలు ఉన్నాయి.
- సిమెంటు, రెడీమిక్స్ కాంక్రీట్, ఏసీలు, టీవీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, డిష్ వాషర్లు, 32 అంగుళాలకుపైన ఉన్న ఎల్‌ఈడీ టీవీలు, ప్రింటర్లు, రేజర్లు, వాణిజ్యపరమైన ప్లాస్టిక్ ఉత్పత్తులు, కార్లు, ఖరీదైన ద్విచక్రవాహనాలు వంటివి ప్రస్తుతం 28శాతం శ్లాబ్‌లో ఉన్నాయి. వీటిని 18శాతం శ్లాబ్‌కు మార్చితే ధరలు బాగా తగ్గుతాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

లోకం తీరు





అధికారులు స్వాధీనం చేసుకున్న బంగారం, నగదు

కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇంట్లో కోటి నగదు..

కిలోల కొద్దీ బంగారం

- సతీశ్ శైల్ నివాసంలో ఈడీ అధికారుల తనిఖీలు

బెంగళూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఉత్తరకన్నడ జిల్లా కారవార కాంగ్రెస్ ఎమ్మెల్యే సతీశ్ శైల్ ఇంటిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు నిర్వహించిన దాడిలో కళ్లు చెదిరేలా నగదు, బంగారం బయటపడింది. గతంలో ఐరన్ ఓర్ అక్రమ తరలింపు కేసులో ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు సతీశ్ శైల్‌కు ఏడేళ్ల జైలు, రూ.9 కోట్ల జరిమానా విధించింది. ఆ తర్వాత ఆ శిక్షను కర్ణాటక హైకోర్టు నిలిపివేసింది. ఈ కేసుకు సంబంధించే తాజాగా దాడులు జరిగాయి. బుధ, గురువారాల్లో నిర్వహించిన తనిఖీల్లో భారీగా నగదు, బంగారం గుర్తించినట్టు ఈడీ 'ఎక్స్' ద్వారా శుక్రవారం ప్రకటించింది. ఢిల్లీ, గోవా, ముంబై, బెంగళూరు నుంచి ఈడీ అధికారులు దాడిలో పాల్గొన్నారు. 1.68 కోట్ల రూపాయల నగదు, 6.750 కిలోల బంగారు ఆభరణాలు, బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నట్టు ప్రకటించారు. 14.13 కోట్ల రూపాయలు ఉన్న బ్యాంకు ఖాతాను స్తంభింప చేశారు. ఈ కేసుకు సంబంధించి పలు కార్యాలయాలపైనా దాడులు నిర్వహించారు.

తనకు తానే అవార్డు ఇచ్చుకున్న మునీర్

లాహోర్, ఆగస్టు 15: పాక్ సైన్యాధ్యక్షుడు ఫీల్డ్ మార్షల్ అసీమ్ మునీర్, మరోసారి వార్తల్లో నిలిచారు. యుద్ధ వేళల్లో అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించే వారికి ఇచ్చే రెండో అత్యున్నత సైనిక పురస్కారం హిలాల్-ఇ-జురాత్‌ను తనకు తానే ప్రకటించుకుని, పుచ్చేసుకున్నారు. ఇది భారతదేశంలోని మహా వీర్ చక్ర అవార్డుతో సమానం.

దేశ రక్షణకు సుదర్శన చక్రం

దుర్భేద్యమైన డ్రోమ్ లాంటి ఆయుధ వ్యవస్థ.. ఆపరేషన్‌తో సిందూర్‌తో పాక్‌కు ఇప్పటికీ నిద్రలేదు

- స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ
- ఎర్రకోట పైనుంచి ఇందిరాగాంధీ కంటే ఎక్కువసార్లు ప్రసంగించిన ప్రధానిగా రికార్డు సాధించిన మోదీ



ఎర్రకోట వద్ద వేడుకల్లో ఎన్‌సీసీ క్యాడెట్లతో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): దేశంపై శత్రువుల దాడులను తిప్పికొట్టేందుకు, తిరిగి దాడులు చేసేందుకు సుదర్శన చక్రం పేరుతో దుర్భేద్యమైన ఆధునిక రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారు. శ్రీకృష్ణుడి స్ఫూర్తితో ఏర్పాటు చేసే సుదర్శన చక్రం వంటి శక్తివంతమైన డ్రోమ్ లాంటి ఈ ఆయుధ వ్యవస్థ.. భారత ప్రజలను కాపాడుతుందని తెలిపారు. సరిహద్దుల్లో అక్రమ వలసలు, చొరబాట్ల వల్ల ఏర్పడుతున్న జాతీయ భద్రతా సవాళ్లను ఎదుర్కొనేందుకు ఉన్నతస్థాయి వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రధాని పలు కీలక ప్రకటనలు చేశారు. దేశంలో 2047కల్లా అణు ఇంధన సామర్థ్యం పెరుగుతుందని, దాదాపు పది అణు రియాక్టర్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. గత 50, 60 ఏళ్ల క్రితం దేశంలో సెమీ కండక్టర్ ఫ్యాక్టరీలను నెలకొల్పకుండా అడ్డుకున్నారని, ఇప్పుడు యుద్ధప్రాతిపదికన సెమీ కండక్టర్ ఫ్యాక్టరీలను నెలకొల్పుతామన్నారు. ఈ ఏడాది చివరికల్లా దేశం మేడ్ ఇన్ ఇండియా చిప్‌ను తయారు చేస్తుందని తెలిపారు. ఇంధన రంగంలో స్వయం సమృద్ధిని సాధించేందుకు వీలుగా పెద్ద ఎత్తున సముద్ర మథనం జరిపి సహజ వనరులను తవ్వి తీస్తామన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజనను ప్రవేశపెడతామని, తద్వారా వచ్చే రెండేళ్లలో 3.5 కోట్ల ఉద్యోగాలను కల్పిస్తామన్నారు. ఈ పథకం కింద ప్రైవేటు రంగంలో ఉద్యోగం సంపాదించిన ప్రతి ఒక్కరికీ నెలకు రూ.15 వేలు చెల్లిస్తామని తెలిపారు. దేశంలో మావోయిజాన్ని పూర్తిగా తుడిచిపెడతామన్న వాగ్దానాన్ని నెరవేర్చుకుంటున్న తీరును మోదీ వివరించారు. మావోయిస్టు ప్రభావిత జిల్లాల సంఖ్య 125 నుంచి కేవలం 20కి తగ్గిపోయిందని, రెడ్ కారిడార్ గ్రీన్ కారిడార్‌గా పరివర్తన చెందిందని చెప్పారు. భారత రాజ్యాంగం 75ఏళ్లుగా ఒక కాగడాలా దేశానికి మార్గదర్శనం చేస్తోందని ప్రధాని అన్నారు. ఆపరేషన్ సిందూర్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించిన ప్రధాని.. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న వీర సైనికులకు వందనం చేస్తున్నట్టు ప్రకటించారు. భారత్ దాడులతో పాకిస్థాన్ ఇప్పటికీ నిద్ర కోల్పోయిందని వ్యాఖ్యానించారు. అణుబాంబు బ్లాక్‌మెయిల్‌కు భారత్ ఏమాత్రం భయపడదని, శత్రుదేశాలు మరో దుశ్చర్యకు పాల్పడినా మన సైన్యం తిరుగులేని విధంగా గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. మేడ్ ఇన్ ఇండియా బలంతోనే మనం తయారు చేసిన ఆయుధాలతో ఆపరేషన్ సిందూర్‌ను అమలు చేశామని ప్రధాని మోదీ అన్నారు. రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించకపోతే శత్రువుకు బుద్ధి చెప్పగలిగే వాళ్లంకాదన్నారు. 2030నాటికి 50శాతం స్వచ్ఛ ఇంధనాన్ని ఉత్పత్తి చేస్తామని తెలిపారు. ఇంధనం కోసం విదేశాలకు రూ.లక్షలాది కోట్లు చెల్లించామని, అదే మొత్తాన్ని పేదరికాన్ని నిర్మూలించేందుకు ఉపయోగించగలిగే వాళ్లమని పేర్కొన్నారు. ఇంధనంతో పాటు ఖనిజ రంగంలోనూ స్వయం సమృద్ధి సాధిస్తామని, 1200 ప్రాంతాల్లో తవ్వకాలు జరుగుతున్నాయని చెప్పారు. అంతరిక్ష రంగంలో స్వయంగా ఆత్మ నిర్భర భారత్ గగన్‌యాన్‌కు సిద్ధమవుతున్నామని, అంతరిక్షంలో 300కు పైగా స్టార్టప్‌లు పనిచేస్తున్నాయని అన్నారు. భారతదేశం స్వయంగా జెట్ ఇంజిన్లను తయారు చేస్తుందని, త్వరలో భారతీయ యుద్ధ విమానాలు శత్రువులను దెబ్బతీసేందుకు రంగంలోకి దిగుతాయని వెల్లడించారు. ఫార్మా రంగంలో ప్రపంచంలో అగ్రశ్రేణికి చేరుకున్నామని, వ్యాక్సిన్ పరిశోధన అభివృద్ధికి మరింత కృషి జరుగుతోందని చెప్పారు.

ఎర్రకోట వేడుకకు రాహుల్ డుమ్మా

ఎర్రకోటపై స్వాతంత్ర్య దిన వేడుకలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గైర్హాజయ్యారు. ఇందుకు కారణమేంటో కాంగ్రెస్ నుంచి అధికారిక ప్రకటనేమీ విడుదల కాలేదు. అయితే లోక్‌సభలో ప్రతిపక్ష నేతనైన తనకు.. గత ఏడాది జరిగిన వేడుకల్లో ముందు వరుసలో కూడా ఐదో వరుసలో సీటు కేటాయించడంతో ఆయన అలకబూనారని.. అందుకే రాలేదని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. గత ఏడాది ఒలింపియన్లకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించడంతో రాహుల్ సహా పలువురు నేతలకు వెనుక వరుసలో సీట్లు కేటాయించాల్సి వచ్చిందని రక్షణ శాఖ అప్పట్లో వివరణ ఇచ్చింది.

భారత్‌కు శుభాకాంక్షలు తెలిపిన పుతిన్, నెతన్యాహు

మాస్కో, జెరూసలేం, ఆగస్టు 15 : భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమీన్ నెతన్యాహు భారత ప్రజలకు శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో భారత్‌కు స్వయం నిర్ణయం తీసుకొనే హక్కు ఉందని పుతిన్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీలకు ఆయన తన సందేశాలను పంపారు. భారత్, రష్యాల వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం చేసేందుకు రష్యా కట్టుబడి ఉందని పుతిన్ తన సందేశంలో వివరించారు.

నాగాలాండ్ గవర్నర్ ఇలా గణేశన్ కన్నుమూత

చెన్నై, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): నాగాలాండ్ గవర్నర్ ఇలా గణేశన్ శుక్రవారం కన్నుమూశారు. ఆయన వయస్సు 80 సంవత్సరాలు. అనారోగ్యం కారణంగా గత వారం రోజులుగా చెన్నై అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇలాగణేశన్ స్పృహలోకి రాకుండానే తుదిశ్వాస విడిచారు. తంజావూరుకు చెందిన గణేశన్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు. 1970లో తన ఉద్యోగానికి రాజీనామా చేసి ఆర్ఎస్ఎస్‌లో చేరారు. 2016 అక్టోబరులో మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు వెళ్లిన ఇలా గణేశన్.. 2021లో మణిపూర్ గవర్నర్‌గా, 2022 జూలై 18 నుంచి పశ్చిమబెంగాల్ గవర్నర్ వ్యవహరించారు. 2023 ఫిబ్రవరి 20 నుంచి నాగాలాండ్ గవర్నర్‌గా విధులు నిర్వర్తించారు.

బీజేపీలో చేరిన నటి కస్తూరి

చెన్నై, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నటి కస్తూరి బీజేపీలో చేరారు. చెన్నై టి.నగర్‌లోని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి శుక్రవారం వెళ్లిన కస్తూరి.. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నయినార్ నాగేంద్రన్ సమక్షంలో బీజేపీ సభ్యత్వం తీసుకున్నారు. ఆమెను నాగేంద్రన్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పంద్రాగస్టు ప్రసంగాల్లో మోదీ రికార్డు

ఎర్రకోట నుంచి 103 నిమిషాల ఉపన్యాసం

న్యూఢిల్లీ, ఆగస్టు 15 : పంద్రాగస్టు వేడుకలు ఈసారి అనేక ప్రత్యేకతలను సంతరించుకున్నాయి. ఢిల్లీ ఎర్రకోట వేదికగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పలు రికార్డులను బద్దలుకొట్టారు. శుక్రవారం 103 నిమిషాలపాటు దేశ ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఒక ప్రధాని ఇంత సుదీర్ఘంగా పంద్రాగస్టు ప్రసంగం చేయడం స్వాతంత్ర్య భారత చరిత్రలోనే ఇది ప్రథమం. గతేడాది 98 నిమిషాలు ఆయన ప్రసంగించారు. అదే అప్పటికి అతి దీర్ఘ ప్రసంగం. ఈసారి ఆయన రికార్డును ఆయననే ఛేదించడం విశేషం. ఆయనకు ముందు నెహ్రూ 72 నిమిషాలు, మాజీ ప్రధాని ఐకే గుజ్రాల్ 71 నిమిషాలు మాట్లాడి అతి దీర్ఘ ఉపన్యాసకులుగా ఘనత పొందారు. నెహ్రూ 1954లో, ఇందిర 1966లో కేవలం 14 నిమిషాలే పంద్రాగస్టు ప్రసంగం చేశారు. ఈ రికార్డు ఇప్పటికీ వారి పేరిటే ఉంది.

ఇందిర రికార్డు బద్దలు...

వరుసగా 12 సార్లు ఎర్రకోట నుంచి దేశ ప్రజలకు సందేశం అందించి.. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ పేరిట ఉన్న రికార్డును ప్రధాని మోదీ అధిగమించారు. ఇందిరాగాంధీ 1966 జనవరిలో ప్రధాని అయి, 1977 మార్చి వరకు కొనసాగారు. అనంతరం 1980 నుంచి 1984 అక్టోబరులో హత్యకు గురయ్యేవరకు తిరిగి ఆ పదవిలో ఉన్నారు. ఈ క్రమంలో మొత్తం 16సార్లు ఆమె ఎర్రకోట నుంచి ప్రసంగించారు. ఎర్రకోట నుంచి అత్యధికంగా 17సార్లు ప్రసంగించిన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ. ఇప్పుడు ఆయన తర్వాతిస్థానం మోదీ దక్కించుకున్నారు. ఇక ప్రధానమంత్రులుగా పనిచేసినవారిలో రాజీవ్‌గాంధీ ఐదుసార్లు, పీవీ నరసింహారావు నాలుగు సార్లు, అటల్ బిహారీ వాజపేయా ఆరుసార్లు, మన్మోహన్ సింగ్ పదిసార్లు ప్రసంగించారు. వీపీ సింగ్, దేవెగౌడ, గుజ్రాల్ ఒక్క పర్యాయమే ఉపన్యసించారు. కాగా, గత ఏడాది మన్మోహన్ సింగ్ పేరిట ఉన్న రికార్డును, ఈ సారి ఇందిర రికార్డును మోదీ వరుసగా ఛేదించడం విశేషం.

ఆకర్షించిన కాషాయ తలపాగా..

వస్త్రధారణలో తన బ్రాండ్‌ను చూపించే ప్రధాని మోదీ ఈసారి పంద్రాగస్టు వేడుకల్లో ధరించిన కాషాయ రంగు తలపాగా ఆకర్షణగా నిలిచింది. తెల్ల కుర్తా, చుడీదార్, బంధ్‌గల్ జాకెట్, మెడలో త్రివర్ణ కండువాతో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. తలపాగా ధరించి ఎర్రకోటపై దర్శనమివ్వడం ఏటా ఒక సంప్రదాయంగా మోదీ పాటిస్తూ వస్తున్నారు. గత ఏడాది రాజస్థానీ లెహెరియా తలపాగాను ఆయన ధరించారు. సామాన్యులుగా కనిపిస్తూ అసామాన్య సేవలను, నైపుణ్యాన్ని దేశాన్ని అందిస్తున్న ఐదువేల మంది ప్రత్యేక అతిథులుగా పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, లఖ్‌పతి దీదీల నుంచి పలు పంచాయతీలకు చెందిన సర్పంచులు వరకు.. ఈ వేడుకలకు హాజరయ్యారు. అలాగే.. ప్రత్యేక ఒలింపిక్ క్రీడలకు ఎంపికైన క్రీడాకారులు, అంతర్జాతీయ క్రీడల్లో పతకాలు సాధించిన విజేతలు, ఖేలో ఇండియా పారా గేమ్స్ బంగారు పతక గ్రహీతలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఔషధ మొక్కలను పెంచుతున్న రైతులను ఈసారి ప్రత్యేకంగా ఆహ్వానించారు.

కూటమి 15 ఏళ్లు కొనసాగాలి

అప్పుడే రాష్ట్రాభివృద్ధి: పవన్ కల్యాణ్

- సుస్థిర పాలన మాతోనే సాధ్యం
- ఓడిపోతే ఓట్ల చోరీ అంటారు.. గెలిచినప్పుడు కనిపించవు
- వైసీపీ 2019లో ఏమీ మాట్లాడలేదు
- 2024లో ఓడాక ఈవీఎంలలో లోపాలట!
- శాంతిభద్రతలు బలంగా ఉంటేనే పెట్టుబడులు
- కాకినాడలో జాతీయ పతాకం ఆవిష్కరణ

కాకినాడ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో సుస్థిరపాలన సాధ్యమని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే మరో పదిహేనేళ్ల కూటమి ప్రభుత్వమే కొనసాగాలన్నారు. అంతేగానీ తామేదో పదవులు అనుభవించడం కోసం అధికారం కోరడం లేదని చెప్పారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే.. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామన్నారు. శుక్రవారం కాకినాడ పోలీస్ పరేడ్ మైదానంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో జాతీయ జెండా ఆవిష్కరించి ప్రసంగించారు. రాష్ట్రంలో 2019 నుంచి 2024 మధ్య బ్రిటిషర్ల తరహాలో రాష్ట్రాన్ని అప్పటి పాలకులు కబంధ హస్తాల్లో బంధించారని విమర్శించారు. స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో ఆ చీకటి రోజులను ఎదుర్కొని అధికారంలోకి వచ్చామన్నారు. నాడు విభజించు-పాలించు పద్ధతిలో పాలన సాగితే.. తమ ప్రభుత్వం 'కలిసి ఉందాం.. కలిసి పాలన చేద్దాం' అనే తరహాలో పాలన సాగిస్తోందని తెలిపారు. అభివృద్ధి జరగాలన్నా, పెట్టుబడులు రావాలన్నా శాంతిభద్రతలు ముఖ్యమని స్పష్టం చేశారు. జాతీయ ప్రతిపక్ష నాయకులు ఓడిపోతే ఓట్ల చోరీ అంటారని, గెలిచినప్పుడు వారికవి కనిపించవని ధ్వజమెత్తారు. వైసీపీ 2019లో విజయం సాధించినప్పుడు ఏమీ మాట్లాడలేదని, 2024లో ఓటమిపాలైనప్పుడు మాత్రం ఈవీఎంలలో లోపాలు కనిపించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. గత వైసీపీ హయాంలో ప్రభుత్వంపై విమర్శలు చేయడానికి అనేకమంది భయపడ్డారన్నారు. రాష్ట్రానికి ఉన్న సుదీర్ఘ తీర ప్రాంత భద్రతపై పోలీసులు దృష్టిసారించాలని సూచించారు. కాకినాడ పోర్టు నుంచి డీజిల్, బియ్యం అక్రమ రవాణా జరుగుతోందని, వదిలేస్తే బయటి నుంచి ఆయుధాలు సైతం వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో అభివద్ధి, సంక్షేమం సమపాళ్లలో సాగుతోందన్నారు. పంచాయతీరాజ్‌శాఖ బాధ్యతలు చేపట్టిన వెంటనే జాతీయ పండుగ నిధులను పెంచి సర్పంచ్‌ల ఆత్మగౌరవాన్ని కాపాడామన్నారు. పల్లె పండుగ ద్వారా 4వేల కిమీ సీసీ రోడ్లు, 22వేల గోకులాల షెడ్ల నిర్మించామని చెప్పారు. అడవితల్లి బాట కింద కొండ ప్రాంతాల్లో రూ.1,005 కోట్లతో 625 గిరిజన గ్రామాలను అనుసంధానిస్తూ 1,069 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. జలజీవన్ మిషన్ కింద 5 జిల్లాల్లో 5 కొత్త ప్రాజెక్టులను రూ.7,910 కోట్లతో ప్రారంభించామని తెలిపారు. కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులు తీసుకొచ్చి విజయవంతంగా ఆపరేషన్ జరిపామన్నారు.


కాకినాడలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, సెల్యూట్ చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, సభలో ప్రసంగిస్తున్న పవన్


యూరప్ ఖండంలో ఎత్తైన ఎల్బ్రస్ శిఖరం అధిరోహించి.. భారత జాతీయ పతాకం ఎగురవేస్తున్న కర్నూలు జిల్లా గోనెగండ్లకు చెందిన సురేశ్

'ఎల్బ్రస్'పై మువ్వన్నెల రెపరెపలు

- 'యూరప్'లో ఎత్తైన శిఖరాన్ని అధిరోహించిన కర్నూలు జిల్లా వాసి

కర్నూలు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా గోనెగండ్ల గ్రామానికి చెందిన సురేశ్ బాబు మరో ఘనత సాధించారు. యూరప్ ఖండంలో అత్యంత ఎత్తైన ఎల్బ్రస్ పర్వత శిఖరాన్ని శుక్రవారం అధిరోహించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ జెండా ఎగురవేసి ప్రశంసలు అందుకున్నారు. సురేశ్ బాబు 2016లో సీబీఆర్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో పర్వతారోహణలో శిక్షణ పొందారు. తొలి ప్రయత్నంలోనే ప్రపంచంలో అత్యంత ఎత్తైన ఎవరెస్టు శిఖరాన్ని 2017 మే 13న అధిరోహించారు. శిఖరారోహణ అభిరుచిగా మార్చుకున్న సురేశ్‌బాబు ఆఫ్రికా ఖండంలోని కిలిమంజారో, ఎంటీ ఎల్బ్రోస్, ఎంటీ మనుసులు, సౌత్ ఆఫ్రికాలోని అకోయకాగియా, అస్ట్రేలియాలోని కోసిస్కో, నేపాల్‌లోని లోహిట్‌సె, ఇండియాలోని రుదుగైరా, జమ్మూకశ్మీర్‌లోని కంగ్రీ, మంగస్‌కట్, టీస్‌టా పీక్, పటీల్స్, హిమాచల్ ప్రదేశ్‌లోని యానమ్.. వంటి పర్వతాలతో సహా ఎనిమిదేళ్లలో 18కి పైగా శిఖరాలను అధిరోహించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వ పీ4-మార్గదర్శులు పథకంలో ఆర్సెలర్ మిట్టల్ సంస్థ సురేశ్‌బాబుకు రూ.4లక్షల ఆర్థిక సాయం అందించింది. ఆ డబ్బును సద్వినియోగం చేసుకున్న ఆయన రష్యాలోని ఈ అత్యంత ఎత్తైన ఎల్బ్రస్ పర్వతం అధిరోహించి త్రివర్ణ పతాకం ఎగురవేశారు. ఇది సముద్ర మట్టానికి 5,642 మీటర్లు (18,510 అడుగులు) ఎత్తులో ఉంటుంది. ఈ నెల 7న శిఖరారోహణ మొదలు పెట్టి శుక్రవారం ఉదయం 8.46 గంటలకు శిఖరంపైకి చేరుకున్నారు. త్రివర్ణ పతాకం ఎగురవేశారు. కాగా, ఎల్బ్రస్ పర్వతంపై మువ్వన్నెల జెండా ఎగురవేయడం మరవలేని ఆనందం ఇచ్చిందని, తనకు సహకరించిన కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఆర్సెలర్ మిట్టల్ సంస్థకు ప్రత్యేకంగా రుణపడి ఉంటానని సురేశ్‌బాబు ఫోన్లో 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

'స్పీడ్ బ్రేకర్ల'పై ఐఆర్‌సీ మార్గదర్శకాలు తప్పనిసరి

- ఇప్పటికే ఉన్నవాటిని మార్చండి.. రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైవేలు, జిల్లా ప్రధాన రోడ్లు, గ్రామీణ రోడ్లపై స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు విషయంలో కేంద్ర రవాణాశాఖ, ఇండియన్ రోడ్ కాంగ్రెస్(ఐఆర్‌సీ) మార్గదర్శకాలను తూ.చ. తప్పకుండా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్ వినతిని పరిగణనలోకి తీసుకొని రోడ్లపై నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను తొలగించడం/ఐఆర్‌సీ మార్గదర్శకాలకు అనుగుణంగా వాటిని మార్చాలని రాష్ట్రంలోని సూపరింటెండెంట్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు రాష్ట్ర రోడ్లు-భవనాలశాఖ చీఫ్ ఇంజనీర్ మెమో జారీ చేసిన విషయాన్ని గుర్తుచేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. న్యాయవాది తాండవ యోగేష్ వేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం మేరకు ఈ ఆదేశాలిచ్చింది. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా.. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ఐఆర్‌సీ కొత్త మార్గదర్శకాలు ఇచ్చి ఉంటే, ఇకపై వేసే స్పీడ్ బ్రేకర్లతో పాటు ఇప్పటికే రోడ్లపై ఉన్నవాటిని వాటికి అనుగుణంగా మార్చాలంది. ఈ మేరకు సంబంధిత అధికారులకు సర్క్యులర్ ఇవ్వాలని ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్‌కు స్పష్టం చేసింది.

డిస్కమ్‌లలో 2,511 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- జేఎల్ఎం 1711.. ఏఈఈ పోస్టులు 800
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం

అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్తు పంపిణీ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ఏటా భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం 2,511 పోస్టులు భర్తీ చేసేందుకు సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇందులో 1,711 జూనియర్ లైన్‌మన్, 800 ఏఈఈ పోస్టులు ఉన్నాయి. కాగా ఏపీఎస్పీడీసీఎల్‌లో 2,850, ఏపీసీపీడీసీఎల్‌లో 1,708, ఏపీఈపీడీసీఎల్‌లో 2,584.. మొత్తంగా 7,142 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏపీ జెన్కో, ట్రాన్స్‌కోల్లోనూ మరికొన్ని ఉన్నాయి. చివరిసారిగా 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం విద్యుత్తు పంపిణీ సంస్థల్లో ఖాళీలను భర్తీ చేసింది. ఆ తర్వాత భర్తీకి నోచుకోలేదు. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానంటూ జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక నిరుద్యోగ యువత మోసపోయారు. 2019-24 మధ్య రాష్ట్ర విద్యుత్తు పంపిణీ సంస్థలు భారీగా నష్టాల్లో కూరుకుపోయాయి. కూటమి ప్రభుత్వానికి ఈ పరిస్థితి భారంగా మారింది. 7,142 పోస్టులను భర్తీ చేయడం కత్తిమీద సాముగా మారింది. అయితే మానవ వనరులు లేకుండా ఇంధన రంగాన్ని నడపడం కష్టమని మంత్రి గొట్టిపాటి రవికుమార్, సీఎస్ విజయానంద్ బుధ, గురువారాల్లో ఇంధన శాఖపై చంద్రబాబు నిర్వహించిన సమీక్షలో వెల్లడించారు. పోస్టులన్నింటినీ ఒకే దఫాలో కాకున్నా ఏటా క్రమం తప్పకుండా భర్తీ చేయడం వల్ల ఇంధన పంపిణీ సంస్థలపై ఆర్థిక భారం పడబోదని వివరించారు. అలాగే ఉన్న కొద్దిపాటి ఉద్యోగులపై అదనపు భారం పడదని కూడా వివరించారు. మంత్రి గొట్టిపాటి, సీఎస్ విజయానంద్ అభిప్రాయంతో సీఎం చంద్రబాబు ఏకీభవించారు. ముందస్తుగా ఏఈఈ, జేఎల్ఎం పోస్టులను అవసరమైన మేరకు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో ఈపీడీసీఎల్, సీపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ పరిధిలో ఏఈఈ, జేఎల్ఎం పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ లభించింది.

శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటల సమయం

- వరుస సెలవుల నేపథ్యంలో తిరుమలకు పోటెత్తిన భక్తులు

తిరుమల, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): వరుస సెలవులతో తిరుమలలో రద్దీ పెరిగింది. ఆగస్టు 15, శ్రీకృష్ణ జన్మాష్టమి, ఆదివారాలు కలిసి రావడంతో శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శుక్రవారం వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరి పార్కులోని తొమ్మిదిషెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగురోడ్డులోని అక్టోపస్ భవనం వరకు భక్తులు బారులు తీరారు.

శ్రీవారి అభిషేక సేవలో న్యాయమూర్తులు


తిరుమల ఆలయం ముందు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎన్వీ రమణ

తిరుమల, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జేకే మహేశ్వరి, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లలిత వేకువజామున అభిషేక సేవలో, ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు.

మహిళా సంక్షేమశాఖలో పలు నోటిఫికేషన్లు రద్దు

- వారంలో మళ్లీ కొత్త నోటిఫికేషన్ల విడుదల

అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 26 జిల్లాల్లో పిల్లల సంక్షేమ కమిటీలు,(సీడబ్ల్యూసీ), జువెనైల్ జస్టిస్ బోర్డ్(జేజేబీ), బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఎస్‌సీపీసీఆర్)చైర్మన్, సభ్యుల నియామకానికి సంబంధించి ఇటీవల మహిళా శిశు సంక్షేమశాఖ వేర్వేరుగా జారీ చేసిన నోటిఫికేషన్లను రద్దు చేయాలని మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు అధికారులు వీటిని రద్దు చేశారు. వారం రోజుల్లో వీటికి సంబంధించి కొత్త నోటిఫికేషన్లు విడుదల చేయనున్నట్లు తెలిపారు.

18 బీసీ కార్పొరేషన్లకు చైర్‌పర్సన్ల నియామకం

అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 18 బీసీ కార్పొరేషన్లకు చైర్‌పర్సన్లు నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ ఎక్స్ అఫిషియో కార్యదర్శి సత్యనారాయణ ఉత్తర్వులు జారీచేశారు. వీరు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి రెండేళ్ల పాటు పదవిలో కొనసాగుతారు.

మోదీ కాళ్లు పట్టుకున్న జగన్.. తల్లి పాదాలకు మొక్కారా?

- మాణిక్యం ఠాకూర్ ధ్వజం

అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): నాడు ముఖ్యమంత్రి హోదాలో ఉంటూ కూడా ప్రధాని నరేంద్ర మోదీ కాళ్లు పట్టుకున్న వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి.. ఏనాడైనా ఆయన తన తల్లి విజయలక్ష్మి పాదాలను బహిరంగంగా తాకారా? అని ఏపీసీసీ ఇన్‌చార్జి కార్యదర్శి మాణిక్యం ఠాకూర్ అని నిలదీశారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఎక్స్ వేదికగా జగన్‌ను ఉద్దేశించి ఘాటైన ప్రశ్నలు సంధించారు. 'ప్రధాని మోదీని జగన్ ఏనాడైనా వ్యతిరేకించారా? మోదీ పాదాలపై వంగిన జగన్.. ఏనాడైనా తన తల్లి పాదాలను తాకారా? ఫొటోలు చూపగలరా?' అని సవాల్ విసిరారు.

మళ్లీ కుర్చీ వివాదంలో కడప ఎమ్మెల్యే

- స్వాతంత్ర్య వేడుక మొదలయ్యాక భర్తతోపాటు వచ్చిన మాధవి
- వేదికపై కుర్చీవేసి రమ్మన్న జేసీ.. ఆమెపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం


వేదికపై తనకు కుర్చీ వేయలేదంటూ జేసీ అదితిసింగ్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కడప ఎమ్మెల్యే మాధవి

కడప, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి మరోసారి కుర్చీ వివాదంలో ఇరుక్కున్నారు. కార్పొరేషన్‌లో మేయర్ పక్కన కుర్చీ వేయలేదంటూ ఆమె ఆందోళనకు దిగడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఇప్పుడు స్వాతంత్ర్య దిన వేడుకల్లో కూడా మరోసారి కుర్చీ వివాదం చోటుచేసుకుంది. కడప పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం జరిగిన ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎండీ ఫరూక్ హాజరయ్యారు. ప్రొటోకాల్ ప్రకారం వేదికపై మంత్రి, కలెక్టర్, ఎస్పీ, జేసీ మాత్రమే ఆశీనులై ఉండాలి. అయితే ఎమ్మెల్యే మాధవి తన భర్త శ్రీనివాసరెడ్డితో కలిసి వేడుకలు ప్రారంభమైన తర్వాత వచ్చారు. ఎమ్మెల్యే వచ్చేప్పటికి వేదికపై ఆమె కోసం విడిగా కుర్చీ లేదు. నిబంధనలకు విరుద్ధమైనప్పటికీ కుర్చీ వేసి వేదికపైకి రావాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ఆహ్వానించారు. అయితే ఎమ్మెల్యే తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆమె వెనక్కి వచ్చేశారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ స్వయంగా వెళ్లి వేదికపైకి రావాలని కోరగా.. థాంక్యూ కలెక్టరు గారూ అని మాదవి సమాధానమిచ్చారు. వేదికపైకి వెళ్లకుండా అక్కడే కాసేపు నిల్చుని వెళ్లిపోయారు.

ఖాకీనే వణికించే కిలేడీ!

(మొదటి పేజీ తరువాయి)

తరచూ వచ్చి వెళ్తూ పెద్దల్ని కలిసి ఫొటోలు దిగి సోషల్ మీడియాలో బాగా ప్రచారం చేసుకుంది. ఆమె ఏకంగా నెల్లూరు జిల్లా ఎస్పీ కార్యాలయంలో కూర్చుని.. 'మీకు ఏమి కావాలో చెప్పండి. నేను చెబితే మీ ఎస్పీ చేయాల్సిందే. అన్నీ నేను చూసుకుంటా' అంటూ సీఐలు, ఎస్ఐలనే కమాండ్ చేసే స్థాయికి చేరింది. వైసీపీ పెద్దలతో పరిచయాలు పెట్టుకుని రెచ్చిపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్నెళ్ల పాటు మౌనంగా ఉంది. గత కొన్ని నెలలుగా మళ్లీ విజృంభిస్తోంది.

పోలీసులకే బెదిరింపులు

ఆ మహిళ వైసీపీ ప్రభుత్వంలో 'దిశ' యాప్‌ను ఆసరాగా ఎంచుకుని పోలీసులతో పరిచయాలు పెంచుకుంది. 'దిశ' ప్రచారకర్తగా పోలీసుల చుట్టూ తిరిగింది. ఇదే క్రమంలో... రహస్యంగా వీడియోలు తీసి బ్లాక్ మెయిల్ చేస్తూ పోలీసులనే ఆటాడుకుంటూ సెటిల్మెంట్లు చేస్తుందని ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల పోలీసులు చెబుతున్నారు. గంజాయి బిజినెస్ నడుపుతోందని పేర్కొంటున్నారు. ఆమె నివాసానికి వచ్చే బైకులు, కార్లకు నెంబర్లు కూడా ఉండవు. కొందరు పోలీసులు ఆమెపై కేసులు పెట్టి రౌడీ షీట్ తెరవాలని చూశారు. కానీ... ఆమె తన పలుకుబడితో ఆపించుకుంది. మొగ్గ దశలోనే తుంచాల్సిన ఈ గంజాయి మొక్కను ఒత్తిళ్లకు తలొగ్గిన పోలీసులు ఇప్పుడు మూడు జిల్లాల్లో వనంలా తయారు చేశారు. ఇప్పుడు.. మూడు జిల్లాల పోలీసుల్ని ఆమె చిటికెలేసి ఆడిస్తోంది. ఎస్ఐను బ్లాక్ మెయిల్ చేసి భారీగా డబ్బులు గుంజడం, సీఐని జిల్లా నుంచే బదిలీ చేయించడం, ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీని వీఆర్‌కు పంపడం, జైలు సూపరింటెండెంట్‌ను రోడ్డు పాలు చేసి ఖాకీ యూనిఫామ్‌కు సైతం చెమటలు పట్టించిన కిలాడీ లేడీ ఆమె.

ఖైదీకి పెరోల్ వెనుకా ఆమే..

రెండు జిల్లాల పోలీసులు, నెల్లూరు సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ వద్దన్నా యావజ్జీవ ఖైదీకి పెరోల్ రావడాన్ని ఇటీవల 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టిన సంగతి తెలిసిందే. ఈ పెరోల్ వెనుక ఉన్నదీ ఈ మహిళే అని తెలుస్తోంది. ఆమెకు అడ్డుగా ఉన్న ఇద్దరు వ్యక్తుల లెక్క తేల్చేందుకే.. జైల్లో ఉన్న ఓ వ్యక్తిని పెరోల్‌పై బయటకు తీసుకొచ్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ ఖైదీ బయటకు వస్తే మూడు జిల్లాల్లో హత్యలు జరిగే అవకాశం ఉందంటూ ఆయా జిల్లాల ఎస్పీలు నివేదికలు ఇచ్చినా ఆ వ్యక్తికి పెరోల్ లభించిందంటే... ఆమె ఏ స్థాయిలో చక్రం తిప్పుతోందో అర్థం చేసుకోవచ్చు.


ప్రమాదంలో దెబ్బతిన్న బస్సులు

రెండు ప్రైవేటు బస్సులు ఢీ

- ముగ్గురు మృతి.. 27 మందికి గాయాలు,
- ఆళ్లగడ్డ సమీపంలో ఘటన

నంద్యాల, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో రెండు ట్రావెల్స్ బస్సులు ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతి చెందగా, 27 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. శ్రీకృష్ణ ట్రావెల్స్, జగన్ ట్రావెల్స్ బస్సులు గురువారం రాత్రి తిరుపతి నుంచి హైదరాబాదుకు 49 మంది ప్రయాణికులతో బయల్దేరాయి. శుక్రవారం తెల్లవారుజామున 3.30 గంటలకు నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సమీపంలో ముందు వెళ్తున్న జగన్ ట్రావెల్స్ బస్సును.. వెనుక వెళ్తున్న శ్రీ కృష్ణ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అనకాపల్లి జిల్లా నాతవరం మండలం గునుపూడి గ్రామానికి చెందిన కుసరాజు(25), రాజమహేంద్రవరానికి చెందిన వెంకట సాయి(22), హైదరాబాద్‌లోని సరూర్ నగర్‌కు చెందిన అనంత గౌతమ్(23) అక్కడికక్కడే మృతి చెందారు. 27 మంది గాయపడ్డారు.


విఐటీ-ఏపీలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న ఆర్.ఎల్.నారాయణ, వీసీ కోటా రెడ్డి, అవార్డు గ్రహీతలు

వీఐటీ-ఏపీలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

- ప్రజల ప్రాణాలు కాపాడిన 9 మందికి సత్కారం
- సమాజానికి సేవ చేసేవారిని గుర్తించి గౌరవించడం సామాజిక బాధ్యత: వీసీ డాక్టర్ ఎస్.వి.కోటా రెడ్డి

అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): వెల్లూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-ఏపీ యూనివర్సిటీలో 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డబ్ల్యూఎన్ఎస్ గ్లోబల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ (విశాఖపట్నం, హైదరాబాద్) ఆర్.ఎల్.నారాయణ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.వి.కోటా రెడ్డి మాట్లాడుతూ.. సమాజానికి సేవలందించే వారిని గుర్తించి, గౌరవించడమనేది విద్యాసంస్థల సామాజిక బాధ్యతలో భాగమని తెలిపారు. ఏటా స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర వేడుకల్లో సమాజానికి నిస్వార్థంగా సేవలందించిన వారిని సత్కరించడం తమకు గర్వకారణమని చెప్పారు. క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో రాణించిన విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎన్డీఆర్ఎఫ్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫైర్ సర్వీసెస్, ఏపీఎస్ ఆర్టీసీ విభాగాలకు చెందిన 9 మంది సిబ్బందిని యూనివర్సిటీ ఘనంగా సత్కరించింది. ప్రజా భద్రత, రక్షణ, సేవా విభాగాల్లో విశేష కృషి చేసిన వారికి జ్ఞాపికతో పాటు రూ. 25,000 నగదు బహుమతిని ఆర్.ఎల్. నారాయణ అందజేశారు. ఎన్డీఆర్ఎఫ్ నుంచి నిడదవోలు గోపాలకృష్ణ (ఇన్‌స్పెక్టర్, 10వ బెటాలియన్), కమ్మరి లోకేశ్ చారి (హెడ్ కానిస్టేబుల్, 10వ బెటాలియన్) పలువురి ప్రాణాలను కాపాడినందుకు ఈ అవార్డులు అందుకున్నారు. ఏపీఎస్ ఆర్టీసీ నుంచి మట్టా వెంకట రమణ (కండక్టర్), ఎస్.కె.ఎం.రసూల్(మృత-డ్రైవర్), భాస్కర్ (మృత-డ్రైవర్), మునియప్ప కన్నని-(డ్రైవర్) విపత్కర పరిస్థితుల్లో కూడా ప్రజలను గమ్యానికి సురక్షితంగా చేర్చినందుకు అవార్డులు అందుకున్నారు. ఏపీ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ & ఫైర్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ కి చెందిన పుటికం హేమ శ్రీకాంత్ రెడ్డి (ఫైర్‌మన్), యల్లావుల వెంకటేశ్వర్లు (స్టేషన్ ఫైర్ ఆఫీసర్), అంజనేయులు జక్కంపూడి (అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్) అత్యవసర పరిస్థితుల్లో ధైర్య సాహసాలు చూపినందుకు అవార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డా. జగదీశ్ చంద్ర ముదిగంటి (రిజిస్ట్రార్), డా.ఎస్‌కె ఖదీర్ పాషా (డిప్యూటీ డైరెక్టర్, స్టూడెంట్ వెల్ఫేర్)తో పాటు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, అతిథులు పాల్గొన్నారు.

అగ్రి బీఎస్సీ దరఖాస్తుల గడువు పొడిగింపు

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ(హానర్స్)) కమ్యూనిటీ సైన్స్ ఎన్నారై కోటాలో బీఎస్సీ(హానర్స్) అగ్రికల్చర్ కోర్సు(2025-26)ల్లో ప్రవేశానికి దరఖాస్తుల గడువును ఈనెల 30 వరకు పొడిగించినట్లు రిజిస్ట్రార్ రామచంద్రరావు తెలిపారు. పూర్తి వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు.

ప్రజాస్వామ్యానికి ప్రాణం సమర్థ పాలన

- స్పీకర్ అయ్యన్న

అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం ద్వారా మనకు స్వేచ్ఛ లభించినా, ప్రతి ఒక్కరూ తమ బాధ్యత తెలుసుకుని, ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవిస్తూ సమాజాభ్యున్నతికి కృషి చేయాలని రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. అమరావతి అసెంబ్లీ ప్రాంగణంలో శుక్రవారం జరిగిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్.. జాతిపిత మాహాత్మాగాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఉప సభాపతి రఘు రామకృష్ణరాజు, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర, అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందాలి: సీఎస్

అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్నారు. అమరావతి సచివాలయంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, సీఎస్‌వో మల్లికార్జున పాల్గొన్నారు.

ఢిల్లీలోని ఏపీ భవన్‌లో..

న్యూఢిల్లీ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఏపీ భవన్‌లో శుక్రవారం స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ జాతీయ జెండాను ఆవిష్కరించి, మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు అశోక్ కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్ర డ్యాంకు మరో ముప్పు

- మొరాయిస్తున్న 7 క్రస్ట్‌గేట్లు
- వరద ఉధృతికి కింది భాగంలో వంపు
- పైకి, కిందకి కదలని వైనం
- గేట్లు దెబ్బతిన్నాయని కర్ణాటక మంత్రి స్పష్టీకరణ

బళ్లారి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల ఉమ్మడి నీటి ప్రాజెక్టు తుంగభద్ర డ్యాంకి మరో ముప్పు ముంచుకొచ్చింది. డ్యాంకి అమర్చిన 4, 6, 11, 18, 20, 24, 27 నంబర్ల క్రస్ట్ గేట్లు వరద ఉధృతికి దెబ్బతిన్నాయి. ఆ క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని బయటకు వదలాలన్నా.. వరద తగ్గాక దించాలన్నా మొరాయిస్తున్నాయి. ప్రస్తుతం ఈ గేట్లు 3 నుంచి 4 అడుగులు మేర తెరిచి ఉన్నాయి. డ్యాంకు వరద పెరుగుతున్న నేపథ్యంలో ఎక్కువగా నీటిని వదలడానికి ఈ క్రస్ట్ గేట్లు మరింత ఎత్తు పెంచేందుకు వీలు కావడం లేదు. అలాగే వరద తగ్గినపుడు గేట్లు దించేందుకు కూడా వీలవ్వడం లేదు. ఈ గేట్లు వరద ఉధృతికి కిందిభాగంలో వంగిపోయాయి. ఈ మేరకు డ్యాం సేఫ్టీ కమిటీ నివేదిక ఇచ్చినట్లు కర్ణాటక మంత్రి, తుంగభద్ర డ్యాం జలమండలి అధ్యక్షుడు శివరాజ్ తంగడిగి తెలిపారు. శుక్రవారం ఆయన కొప్పళలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, డ్యాం గేట్లు దెబ్బతిన్న విషయం, కేంద్ర డ్యాం సేఫ్టీ కమిటీ తనకు ఇచ్చిన నివేదికను వివరించారు. గేట్లు దెబ్బతిన్నది వాస్తవమేనని తుంగభద్ర బోర్డు అధికారులు కూడా అంగీకరించారు. డ్యాంకు మొత్తం 33 క్రస్ట్ గేట్లు ఉన్నాయి. వీటిలో 19వ నంబర్ క్రస్ట్ గేటు గతేడాది వరద ఉధృతికి కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. అప్పుడు గేట్ల తయారీ నిపుణుడు కన్నయ్య నాయుడును ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సంప్రదించి జలాలు వృథాకాకుండా చూడాలని కోరారు. ఆయన తన నైపుణ్యంతో వెంటనే స్టాప్‌లాక్ వేశారు. తరువాత డ్యాం సేఫ్టీ అధ్యయన కమిటీ డ్యాంతోపాటు గేట్లను పరిశీలించి మొత్తం గేట్లను మార్చి కొత్తవి అమర్చాలని సూచించింది. కొత్త గేట్ల తయారీకి రూ. 60 కోట్లతో టెండర్ పిలిచి పనులు చేస్తున్నారు. భద్రతను దృష్టిలో ఉంచుకుని 80 టీఎంసీలకి మించి డ్యాంలో నిల్వ ఉంచరాదని కమిటీ సూచించింది. ఆ మేరకు జలాశయంలో 80 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ చేస్తున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటికే ప్రాజెక్టు నుంచి 135 టీఎంసీల నీరు కిందకు వదిలారు. 24 టీఎంసీల నీరు వినియోగించారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 23,295 క్యూసెక్కులు వస్తోంది. ఔట్ ఫ్లో 23,193 క్యూసెక్కులు వదులుతున్నారు. ఇప్పుడు ఈ గేట్లు దెబ్బతినడంతో పరివాహక ప్రాంతంలోని రైతుల్లో ఆందోళన నెలకొంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'సంఘీ'భావం!

బ్రిటిష్ వలసపాలననుంచి విముక్తిపొందిన తొలి ఏడాది అప్పటి ప్రధాని నెహ్రూ చేసిన ఎర్రకోట ప్రసంగం డెబ్బైరెండు నిముషాలు సాగిందట. చరిత్రలో నిలిచిపోయే చక్కని ప్రసంగమని దానిని ఇప్పటికీ కీర్తిస్తున్నవాళ్ళున్నారు. ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆ నిడివిని ఎప్పుడో దాటేశారు. ప్రధాని అయిన తొలిసంవత్సరం నరేంద్రమోదీ 65నిముషాలు మాత్రమే మాట్లాడారు. మరుసటి ఏడాదిలోనే నెహ్రూను ఓ పదహారు నిముషాలు దాటేశారు. 2016లో 96 నిముషాలు మాట్లాడిన మోదీ, 2017లో 56 నిముషాలకే స్వస్తి చెప్పేశారు. తన ఎర్రకోట ప్రసంగాలు మరీ పొడుగ్గా ఉంటున్నాయని జనం లేఖలు రాయడంతో వాటిని కుదించాలని నిర్ణయించుకున్నట్టు ఆ ఏడాది 'మన్ కీ బాత్'లో మనసు విప్పారు. అయితే, ఆ తరువాత ఆయన ఆ మాటమీద నిలబడిందేమీ లేదు. చివరకు సొంతపార్టీ బలం 240కు పడిపోయి, కూటమి కట్టాల్సివచ్చినప్పటికీ, గత ఏడాది తన 11వ ఎర్రకోట ప్రసంగాన్ని అంతకుముందు పది ప్రసంగాల రికార్డులను చెరిపివేస్తూ సుదీర్ఘంగా చేశారాయన. ఈ ఏడాది ఏకంగా 103 నిముషాల సుదీర్ఘప్రసంగంతో గత ప్రధానమంత్రుల రికార్డులన్నీ చెరిపేశారు, ప్రసంగాల సంఖ్యలో ఇందిరను దాటేశారు.

మోదీ ఏం మాట్లాడినా వినసొంపుగా ఉంటుంది. అవసరం ఉన్నా లేకున్నా ఉద్వేగం, ఉద్రేకం మేళవించి ఆహూతులను ఆకట్టుకోగలరాయన. మోదీ ఎర్రకోట ప్రసంగాల్లో విషయం తగ్గుతోందని గిట్టనివారు అంటారు కానీ, ఈ మారు అత్యధికులకు ఆయన స్వరవిన్యాసం కొత్తగా అనిపించింది. తన ప్రసంగంలో ఆయన ఆపరేషన్ సిందూర్‌కూ, తదనంతర పరిణామాలకు అధికప్రాధాన్యం ఇవ్వడం సహజం. ప్రతీకారేచ్ఛతో, వీరావేశంతో ఆరంభించిన యుద్ధాన్ని వెంటనే నిలిపివేయడం మీద రేగిన విమర్శలను అటుంచితే, ట్రంప్ అలకలూ ఆగ్రహాలూ, సుంకాల యుద్ధాల వరకూ సాగిన పలు పరిణామాల నేపథ్యంలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మోదీ ఈ వేదికమీదనుంచి వాటిని ప్రస్తావించక తప్పలేదు. శత్రువుగా మారిన ట్రంప్ భారత్‌మీద దాడికి పాల్పడుతున్న నేపథ్యంలో, జాతీయవాదాన్నీ, దేశభక్తినీ రగల్చడం అవశ్యకమని మోదీ అనుకున్నారు. ఆసిమ్ మునీర్ వంటివారు ఎగిరెగిరిపడుతున్ననేపథ్యంలో, అణుబాంబు బెదిరింపులకు భారత్ భయపడదన్నారు మోదీ. పహల్గాంలో పర్యాటకులను కాపాడలేకపోయారన్న అప్రదిష్ఠకు తోడుగా 'సిందూర్' సందర్భంలో పాక్ క్షిపణి, డ్రోన్‌దాడుల అనుభవం కూడా ఉన్నందున, యావత్ దేశాన్ని రక్షించడానికి ఆయన సుదర్శన చక్రాన్ని సిద్ధం చేయిస్తున్నారు. పాకిస్థాన్‌కు సింధుజలాలను ధారాదత్తం చేశారంటూ నెహ్రూను తప్పుబడుతున్నవారు ఇంతకాలం దానిని ఎందుకు సరిదిద్దలేదో తెలియదు. రక్షణరంగంలో స్వయం సమృద్ధి, మేడిన్ ఇండియా బలం సిందూర్ విజయానికి దోహదం చేశాయని మెచ్చుకుంటున్నప్పుడైనా ప్రధానికి నెహ్రూ దార్శనికత గుర్తుకువచ్చిందో లేదో. గగనయాన్ గురించి మాట్లాడుతున్నప్పుడు గత ప్రధానులు వేసిన పునాదులు గుర్తుకువస్తే బాగుండేది. మేడిన్ ఇండియా చిప్ గురించి మోదీ చేసిన ప్రస్తావనలు విన్న విదేశీయులకు భారత్ పదేళ్ళక్రితమే కళ్ళుతెరిచిందన్న భ్రమ కలగవచ్చు. తన పాలన అద్భుతమని చెప్పుకోవడంలో తప్పులేదు కానీ, గతమంతా శూన్యమని ఇలా నిందలకు పాల్పడటం సముచితం కాదు.

ఎర్రకోటమీద నుంచి ఫలానా విషయాలు మాట్లాడకూడదనో, రాజకీయం చేయకూడదనో నియమం ఏమీ లేదు. మోదీ ఆరెస్సెస్‌నూ, దాని వందేళ్ళ సేవలను మెచ్చుకున్నారు, , దేశనిర్మాణంలో పాలుపంచుకుందని ప్రశంసించారు. పంద్రాగస్టు ప్రసంగంలో ప్రస్తుతిస్తున్నారు కనుక, స్వాతంత్ర్యోద్యమంలో దాని పాత్ర ఏమిటో చెప్పమంటూ విమర్శలూ ప్రశ్నలూ మొదలైనాయి. మోదీ ఉండగా తమకు ఇక ఆరెస్సెస్ అక్కరలేదని బీజేపీ నేతలు ఎగిరిపడుతూండటంతో, ఆరెస్సెస్ సహాయనిరాకరణతో బీజేపీని లోక్‌సభ ఎన్నికల్లో తన కాళ్ళమీద తాను నిలబడలేకుండా చేసిందని అంటారు. ఆ తరువాత తప్పు గ్రహించి, నాగపూర్ పర్యటనలతో లెంపలేసుకుంటే కానీ మహారాష్ట్ర సహా మరికొన్ని అసెంబ్లీలు బీజేపీ ఖాతాలోకి రాలేదు. ఒక్కరే ఎంతకాలం ఏలుతారు, డెబ్బైఐదేళ్ళకు దిగాల్సిందేనంటూ హెచ్చరికలు కూడా వినవస్తున్న నేపథ్యంలో, దేశానికి వందనం చేయాల్సిన ఎర్రకోటమీదనుంచి ఆరెస్సెస్‌కు అభివాదం అందించిన ఫలితం రాబోయేరోజుల్లో పలువిధాలుగా ఉండవచ్చు, విజయాలు చేకూర్చవచ్చు.

విప్లవం.. చాలించాలి

ఇనుకొండ తిరుమలి రాసిన 'అరణ్యవాసంలోనే విప్లవ ప్రభాతం' వ్యాసం 'ఆంధ్రజ్యోతి'లో 25.7.25న ప్రచురితమైంది. నక్సలైట్లు తమ ఉద్యమాన్ని విరమించి రాజ్యానికి లొంగిపోవాలని తిరుమలి సలహా ఇచ్చారు. ఇది చాలా మంచి విషయం.

గిరిజన ప్రాంతాల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్ల చేతుల్లో పడనీయకుండా అడ్డుపడుతున్నామని మావోయిస్టులు పైకి చెబుతున్నారు గానీ వాళ్ల అసలు లక్ష్యం మార్క్స్ ప్రవచించిన వర్గపోరాటం, వర్గ శత్రు నిర్మూలన, సాయుధ విప్లవంతో ప్రభుత్వాధికారాన్ని చేపట్టడం. డ్రగ్ టెస్టింగ్‌లో విఫలమై, 'రోగంకన్నా హానికరమైన మందు'గా లోకం ముందు రుజువైన వికృత సిద్ధాంతమే మార్క్సిజం. 'మార్క్స్ సిద్ధాంతం ఆచరణలో పెట్టబడిన ప్రతిచోట పెద్దమ్మ (దరిద్ర దేవత) నాట్యమాడును దద్దమ్మా' అని తురగా రామకవి చెప్పినట్టు.. ఇనుప గజ్జెలతల్లి తాండవించడంతో రష్యా, చైనా, తూర్పు యూరప్ సమాజాలు నెత్తీ నోరు కొట్టుకుని కమ్యూనిస్టు వ్యవస్థను వదిలించుకున్న చరిత్ర మనకు తెలిసిందే. మార్క్సిజం ఒక కుహనా రాజకీయ తార్కిక సిద్ధాంతం. భారతదేశంలో మళ్లీ ఆ విఫల ప్రయోగాన్ని చెయ్యడానికి, ఆ విషప్రాయమైన ఔషధాన్ని భారత ప్రజల గొంతుల్లో బలవంతంగా పొయ్యడానికి కంకణబద్ధులై పని చేస్తున్నారు మన మావోయిస్టు అడవి వీరులు, అర్బన్ నక్సలైటు మేధావులు.



అసలు ఎవరో ఆయుధాలు సమకూర్చుకుని, విప్లవ సైన్యాన్ని చేర్చుకుని తాను చెప్పిన విప్లవాన్ని సాధించడానికి మన్ను, మిన్ను ఏకం చెయ్యాలని మార్క్స్ చెప్పలేదు. గతితార్కిక పరిణామాల ద్వారా చరిత్ర క్రమంలో ఎవ్వరూ ఆపలేని విధంగా శ్రామిక విప్లవం దానంతటదే వచ్చేస్తుందని తన మేనిఫెస్టోలో చెప్పారు. ఆయన చెప్పిన విధంగా ప్రపంచంలో ఏ ఒక్కచోట కమ్యూనిస్టు విప్లవం రాలేదు, కార్మికవర్గ నియంతృత్వం ఏర్పడలేదు. మన నక్సలైట్లు, లేక మావోయిస్టులు ఇంత పోరాటం ఆ విప్లవం కోసం చేస్తున్నారంటేనే.. మార్క్స్ చెప్పినట్లు చరిత్ర నడవడం లేదని, ఆయన సిద్ధాంతం, భవిష్యవాణి వట్టి కల్లలని రుజువైపోయింది కదా?!

అయినా ఇప్పటికీ కొందరు ఆ మార్క్స్ వాదాన్ని అంటిపెట్టుకుని అడవుల్లోనూ, నగరాల్లోనూ కొనసాగుతున్నారంటే అందుకు కారణం వాళ్లకు అధ్యయనం, చరిత్ర విశ్లేషణ లేకపోవడం. వాళ్ల మరో ప్రపంచపు అనుభవాల నుంచి ముఖం తిప్పుకోవడం, మార్క్సిజం చేత కట్టించుకున్న పుస్తెను తెంపుకోలేకపోవడం. అంతేకాదు వామపక్ష తీవ్రవాద బృందాలు వేర్పాటువాదులతో, మతతత్వపు ఉగ్రవాదులతో చేతులు కలపడం దేశ ప్రజల దృష్టిలో స్పష్టంగానే పడుతోంది. ఇది వాళ్ల నైరాశ్యానికి, వాళ్ల సిద్ధాంతంపై వాళ్లకే విశ్వాసం జారిపోయి వేరే దేన్నో పట్టుకుని వేళ్లాడుతున్న పరిస్థితికి నిదర్శనం. ఈ నిజాయితీ రాహిత్యం ఇంతటితో ఆగిపోవడం అన్ని విధాలా ఉత్తమం. అంతే కాదు. పత్రికల్లో వామపక్ష ప్రముఖుల ప్రస్తావనలు, చరిత్రలు ప్రచురించేటప్పుడు వాళ్లను విప్లవ వీరులంటూ కీర్తించే పద్ధతి మానెయ్యాలి. కవులు, రచయితలు ఆ విఫల విప్లవం పైన ఆకర్షణ, ఆరాధన కలిగించే పడికట్టు రచనలు చేయడానికి స్వస్తి పలకాలి. కమ్యూనిజం వచ్చిన కొత్తలో అది పేదలకు ఏదో మేలు చేస్తుందన్న విశ్వాసంతో, కొందరు సదుద్దేశంతోనే ఆ దారిలో నడిచారు. తమ మాట వినే వాళ్లను నడిపించారు. కానీ ఇప్పుడు ఆ విశ్వాసం పొరపాటు అని చరిత్ర చెబుతోంది. సమాజంలో అసమానతలు, అన్యాయాలు, పేదరికం ఉండవచ్చు. కానీ మార్క్స్ ప్రతిపాదించిన సిద్ధాంతం మాత్రం అందుకు పరిష్కారం కాదు. ఆయన చూపిన దారి అధోగతికే రహదారి.

పెట్టుబడిదార్లను ద్వేషించినంతగా మార్క్స్ ఇంకెవరినీ ద్వేషించలేదేమో. కానీ ఇప్పుడు ఎక్కడ చూసినా 'పెట్టుబడులను తీసుకువచ్చి, సంపదను సృష్టించి అభివృద్ధి సాధించాలి' అనే విధానమే ప్రపంచాన్ని నడిపిస్తోంది. మరైతే ఇక ఏ విప్లవం వర్ధిల్లాలి? పెట్టుబడిదార్లు, కార్మికులు కూడా సమాజ ప్రగతికి అవసరమే. ఒకరి వల్ల మరొకరికి అన్యాయం జరగకుండా ప్రభుత్వం, సమాజ వ్యవస్థ జాగ్రత్త వహించాలి తప్ప, ఏదో ఒక వర్గాన్ని నిర్మూలించేయడం ఆర్థిక వివేకం కాదు.

• వివి. సుబ్రహ్మణ్యం
రాజమహేంద్రవరం

ఓటర్ జాబితాల విశ్వసనీయత ఎంత?

బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ –సర్)ను సవాల్ చేసిన పిటిషన్లపై విచారణలో భాగంగా దేశ సర్వోన్నత న్యాయస్థానం గత వారాంతంలో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)కు రెండు ముఖ్యమైన ఆదేశాలు జారీ చేసింది. అవి: ఓటర్ల జాబితా నుంచి తొలగించిన పేర్ల జాబితాను, తీసివేతకు కారణాలతో సహా ప్రచురించాలి; ఆధార్ కార్డును ఒక ధ్రువీకరణ పత్రంగా అంగీకరించాలి. 'సర్'ను సవాల్ చేసిన పిటిషన్లపై విచారణ ఇంకా కొనసాగుతోంది.

అయితే 'సర్'కు సంబంధించి, న్యాయసమీక్ష పరిధిలోకి రాని, అంశాలు కొన్ని ఉన్నాయి. అవి అసాధారణమైనవే కాదు, చాలా కలవరం కలిగిస్తున్నవి కూడా.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ముందుగా పేర్కొనవలసినది సవరణ ప్రక్రియ పేరు. గతంలో ఓటర్ల జాబితా సవరణను ప్రత్యేక లేదా సంగ్రహ సవరణగా పేర్కొనేవారు. రెండోది సవరణను చేపట్టిన నిర్దిష్ట సమయం: ప్రత్యేక సమగ్ర సవరణ లాంటి కార్యక్రమాన్ని గతంలో ఎన్నడూ లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలల ముందుగా నిర్వహించలేదు. మూడోది టైమ్ షెడ్యూల్: ఈ ప్రత్యేక సమగ్ర సవరణ తొలి దశను కేవలం 30 రోజులలో పూర్తి చేశారు. అభ్యంతరాలు, వాదనలను మరో 30 రోజుల్లో పరిష్కరిస్తారు. నాల్గోది 'సర్' పరిధి: ఇంతకు ముందు ఓటర్ల జాబితా సవరణకు అప్పటికి చివరిసారిగా జరిగిన సవరణను ప్రాతిపదికగా తీసుకునేవారు. అయితే బిహార్ 'సర్'కు 2024ఓటర్ల జాబితాలను ప్రాతిపదికగా తీసుకోలేదు. వాటిని పక్కన పెట్టేశారు. బిహార్‌కు పూర్తిగా సరికొత్త ఓటర్ల జాబితాను రూపొందించడమే ఈ 'సర్' లక్ష్యం, సందేహం లేదు. ఐదోది: ఓటర్ల జాబితా నుంచి పెద్ద ఎత్తున ఓటర్ల పేర్లను తొలగించేందుకు ఎనలేని ప్రాధాన్యమిస్తూ కొత్త ఓటర్ల పేర్లను చేర్చడంపై మౌనం వహించడం. ఎన్నికల సంఘం అనుసరిస్తున్న ఈ వైఖరి వింతగా ఉన్నది. ఈ ప్రత్యేక సవరణలో 64 లక్షల మంది ఓటర్ల పేర్లను జాబితాను తొలగించినట్టు ఈసీఐ వెల్లడించింది. వీరిలో 22 లక్షల మంది 'మరణించినట్టు', 7 లక్షల మంది పలు ప్రదేశాలలో ఓటర్లుగా నమోదు చేయించుకున్నారని, 36 లక్షల మంది బిహార్ నుంచి శాశ్వతంగా వలస పోయినవారు లేదా ఎటువంటి జాడ తెలియనివారు అని ఈసీఐ పేర్కొంది.

జనన మరణాలు సహజం. చనిపోయిన వ్యక్తుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం సరైన విషయమే. అయితే 18 సంవత్సరాల వయసు వచ్చిన యువతీ యువకుల పేర్లను ఓటర్ల జాబితాలో విధిగా చేర్చడం సముచితం కాదా? ఇది ఎన్నికల సంఘం విధ్యుక్తధర్మం కాదా? బిహార్ ముడి జనన రేటు (క్రూడ్ బర్త్ రేట్ – ఒక నిర్దిష్ట సంవత్సరంలో ప్రతి 1000 మంది జనాభాకు సంభవించే ప్రత్యేక జననాల సంఖ్యను సూచిస్తుంది. ఇది సంతానోత్పత్తి స్థాయి, జనాభా పెరుగుదలకు ప్రాథమిక సూచన) దృష్ట్యా 2024లో లోక్‌సభ ఎన్నికలు ముగిసిన నాటి నుంచి 18 సంవత్సరాల వయస్సు వచ్చిన యువతీ యువకులు లక్షల సంఖ్యలో ఉంటారు. ఇది సందేహాతీతమైన వాస్తవం. మరి ఈ కొత్త వయోజనుల పేర్లను కొత్త జాబితాలో చేర్చారా? ఈసీఐ ప్రతిస్పందించలేదు. కారణమేమిటి? ఎవరికీ తెలియదు.

36 లక్షల మంది బిహారీలు 'శాశ్వతంగా వేరే ప్రదేశాలకు వెళ్లిపోయారని' లేదా 'జాడ తెలియనివారు' అన్న నిర్ణయానికి ఈసీఐ ఎలా వచ్చింది? ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారా? సంబంధిత వ్యక్తులు తాము శాశ్వతంగా బిహార్ నుంచి వెలుపలి ప్రదేశాలకు వలసపోయామని తమకు తామే అంగీకరించారా? సదరు 36 లక్షల మంది ఎక్కడ ఉన్నారో తెలుసుకోవడానికి ప్రయత్నించిందా? 'సాధారణంగా స్థానికుడు' అన్న భావన ప్రామాణికతకు న్యాయపరమైన వ్యాఖ్యానాన్ని త్రోసిపుచ్చి దానికి ప్రత్యామ్నాయంగా 'శాశ్వతంగా వలసపోయినవాడు' అన్న భావనను ఈసీఐ ఎప్పుడు, ఎందుకు ప్రవేశపెట్టింది? ఏ ఒక్కరికీ తెలియదు.

'సర్' కార్యక్రమానికి విశ్వసనీయత లేదు, పారదర్శకత లోపించింది, సమర్థించే సాక్ష్యాధారాలు, సహేతుకమైన నిర్ణయాలు కొరవడ్డాయి. అసలు ఈ ప్రత్యేక సమగ్ర సవరణను ముందస్తు భావనలతో చేపట్టినట్టు కనిపిస్తోంది. వాటిని నిరూపించేందుకే ఆ కార్యక్రమాన్ని అమలుపరుస్తున్నట్టుగా ఉన్నది. జాతి జనాభా ఏటా 0.89 శాతం చొప్పున పెరుగుతున్న దేశంలో ఓటర్ల జాబితా సవరణ ఏ విధంగా చేసినా ఓటర్ల సంఖ్య విధిగా పెరుగుతుంది. అయితే భారత ఎన్నికల సంఘం బిహార్‌లో చేపట్టిన 'సర్' కార్యక్రమం అందుకు పూర్తి విరుద్ధమైన ఫలితాలనే చూపిస్తోంది! 'సర్' అసలు ఉద్దేశం సంఖ్యానేక ప్రజల ఓటు హక్కును రద్దు చేయడమే. ఈ కారణంగానే తాము ఓటు హక్కు కోల్పోతామేమోనని బిహార్‌లో లక్షలాది ఓటర్లు భయపడుతున్నారు. ఈ ఏడాది చివరలో జరగనున్న శాసనసభ ఎన్నికలలో తాము ఓటు వేసేందుకు అనుమతి ఉండదేమోనని ఎంతో మంది బిహారీలు సహేతుకంగానే శంకిస్తున్నారు. 'సర్'ను ఇతర రాష్ట్రాలలో కూడా చేపడతారని తెలుస్తోంది. బిహార్‌లో ఆ ప్రక్రియ ఫలితాల ఆధారంగా చూస్తే కోట్లాది ప్రజల ఓటు హక్కు రద్దయ్యే అవకాశమున్నది.

కర్ణాటకలో ఓటర్ల జాబితాకు సంబంధించి బహిర్గతమైన మరొక వాస్తవం ప్రజాస్వామ్యవాదులను అమితంగా జడిపిస్తోంది. ఆ రాష్ట్రంలోని 28 పార్లమెంటరీ నియోజకవర్గాలలో బెంగళూరు సెంట్రల్ ఒకటి. ఆ లోక్‌సభా నియోజకవర్గంలో ఎనిమిది శాసనసభా నియోజకవర్గాలు ఉన్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికలలో బెంగళూరు సెంట్రల్ ఫలితాలు చూద్దాం. అందులోని ఎనిమిది శాసనసభా నియోజకవర్గాలలో ఒకటైన మహదేవపుర విషయాన్ని కాసేపు పక్కన పెడదాం. కాంగ్రెస్ అభ్యర్థి నాలుగు



బిహార్‌లో అమలుపరుస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు విశ్వసనీయత లేదు, పారదర్శకత లోపించింది. జనాభా ఏటా 0.89 శాతం చొప్పున పెరుగుతున్న దేశంలో ఓటర్ల జాబితా సవరణ ఏ విధంగా చేసినా ఓటర్ల సంఖ్య విధిగా పెరుగుతుంది. భారత ఎన్నికల సంఘం బిహార్‌లో చేపట్టిన సవరణ తద్విరుద్ధమైన ఫలితాలనే చూపిస్తోంది!

అసెంబ్లీ, బీజేపీ అభ్యర్థి మూడు అసెంబ్లీ నియోజకవర్గాలలోను ఆధిక్యతలో ఉన్నారు. ఈ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో నికర ఆధిక్యత 82,178 ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థికి అనుకూలంగా ఉన్నది. ఇప్పుడు మహదేవపుర నియోజకవర్గ ఫలితాన్ని చూద్దాం. ఈ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థికి 1,14,046 ఓట్ల ఆధిక్యత ఉన్నది. ఇది, కాంగ్రెస్ అభ్యర్థికి ఉన్న 82,178 నికర ఓట్ల ఆధిక్యతను రద్దు చేసి బీజేపీ అభ్యర్థికి 31,868 ఓట్ల మెజారిటీతో విజయాన్ని సమకూర్చింది. వీటికి తోడు పోస్టల్ బ్యాలెట్లను కలుపుకుని బీజేపీ అభ్యర్థి మొత్తం 32,707 ఓట్ల మెజారిటీతో గెలుపొందాడు. స్పష్టంగా ఉన్న ఈ వివరాలు తుది ఫలితాన్ని అనుమానాస్పదం చేయలేదు.

అయితే ఈ 32,707 ఓట్ల ఆధిక్యత ఎలా సాధ్యమయింది? ఈ విషయాన్ని నిశితంగా పరిశీలించాలి. కాంగ్రెస్ అభ్యర్థి, ఆయన బృందం ఓటర్ల జాబితాలు, ఇతర డాక్యుమెంట్లను అత్యంత జాగ్రత్తగా పరిశీలించి కొన్ని అసాధారణ తప్పులను కనుగొన్నారు. బలవత్తరమైన ఈ ప్రాథమిక సమాచారం ఆధారంగా బీజేపీ అభ్యర్థికి లభించిన ఆధిక్యతలోని గుట్లు తెలుసుకున్నారు. మితిమీరిన సంఖ్యలో విభిన్న ఓటర్లు ఒకే నివాసంలో ఉన్నట్టుగా నమోదయ్యారు; సదరు ఓటర్ల ఓటర్ కార్డుపై వారి తండ్రి పేరు 'Xtkaprbsu' అని అర్థంకాని విధంగా ఉన్నది. ఓటరు కార్డుపై ఓటర్ల వయసు '0' లేదా '124' అని ఉన్నది. ఇటువంటి ప్రాథమిక తప్పులు వేల సంఖ్యలో ఉన్నాయి.

ఓటర్ల జాబితాలో ఇటువంటి తప్పులు ఉన్నట్టు స్పష్టంగా వెల్లడయినప్పుడు వాటిపై విచారణ జరిపించవలసిన అవసరం లేదా? సామాన్య వ్యక్తి ఎవరైనా 'అవును, జరిపించాల్సిందే' అని వెన్వెంటనే ప్రతిస్పందిస్తాడు. అయితే మన ఎన్నికల సంఘం ఇంకెంత మాత్రం నియమబద్ధమైన ఒక మామూలు వ్యక్తిగా లేదా సంస్థగా వ్యవహరించడం లేదు! తాను రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థనని, ఎన్నికలతో ప్రమేయమున్న ఓటర్లు, అభ్యర్థులు, రాజకీయ పార్టీలకు జవాబుదారీనికానని ఈసీఐ గర్విస్తోంది. బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై పౌర సమాజ ఆక్షేపణలు, రాజకీయ పార్టీల ఆరోపణల విషయమై పార్లమెంటు ఉభయ సభలలో చర్చించేందుకు గౌరవనీయ సభాపతులు ఇరువురూ విముఖత చూపుతున్నారు. దీనితో ఈసీఐ తనను తాను ఒక 'న్యాయస్థానం'గా భావించుకుంటూ రాజకీయ పార్టీలు, రాజకీయ నాయకులు అఫిడవిట్లు దాఖలు చేయాలని డిమాండ్ చేస్తోంది!

ఈ వ్యవహారంలో మహదేవపుర శాసనసభా నియోజకవర్గ ఓటర్ల జాబితా విశ్వసనీయత ఒక ప్రధాన వాదాంశం అన్న వాస్తవాన్ని ఎట్టి పరిస్థితులలోను విస్మరించకూడదు. పార్లమెంటులో దానిపై చర్చ జరగాలి. ఆ అంశం పైన కాకుండా అన్య అంశాలపై పార్లమెంటు దృష్టి పెట్టేందుకు అనుమతించకూడదు. ఈ విషయాన్ని మళ్లీ నొక్కి చెప్తున్నాను: ప్రధాన వాదాంశం ఓటర్ల జాబితాల విశ్వసనీయతే. మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గానికి చెందినవైనా లేదా బిహార్‌కు చెందినవైనా ఓటర్ల జాబితాల విశ్వసనీయతే ప్రధాన వాదాంశం. ఈ రోజు కాకపోయినా భవిష్యత్తులో ఈ మహోన్నత ప్రజాస్వామ్య దేశ ఓటర్లు తమ తీర్పు చెప్పే రోజునైనా భారత ఎన్నికల సంఘం కచ్చితంగా సమాధానమివ్వవలసి ఉంది.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

అమరవీరుల స్మారకవనం స్వప్నమేనా?

చరిత్రలో కొన్ని సంఘటనలను మరువలేం. ఇంకొన్ని జ్ఞాపకాలను సదా గుండె లోతుల్లో దాచకుండా ఉండలేం. అలాంటి సంఘటనలు, జ్ఞాపకాలు సమాజానికి సత్తువ ఇస్తాయి. భావి తరాల భవిష్యత్తుకు దిశా, దశా నిర్దేశం చేస్తాయి. అలాంటి చారిత్రక జ్ఞాపకాల పొరల్లో శాశ్వతంగా గుర్తుకొచ్చేది, మదిని తాకేది ప్రజా రాజధాని అమరావతి ఉద్యమం.

ప్రజా రాజధాని అమరావతిలో 'అమరావతి రాజధాని రక్షణ' కోసం ఉద్యమించి, అస్తమించిన అమరవీరుల పేరిట అమర వీరుల పార్కు లేదా స్మృతి వనం ఏర్పాటు చేస్తామని ఉద్యమ సమయంలో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు వాగ్దానం చేశారు. ఇటీవల అమెరికాలో నిర్వహించిన తానా మహాసభల్లో చికాగోకు చెందిన యలమంచి ప్రసాద్, కాలిఫోర్నియాకు చెందిన శ్యామ్ అరబింది, టెక్సాస్‌కు చెందిన వేనుగుంట రాజేశ్, తానా మాజీ అధ్యక్షుడు కోమటి జయరాం, అమరావతి బహుజన ఐకాస అధ్యక్షుడిగా నేనూ అమరావతిలో అమరవీరుల పార్క్ నిర్మించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని, అందుకు కావలసిన స్థలాన్ని కేటాయించాలని తీర్మానం కూడా చేశాం. కానీ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా, ఆ వాగ్దానాన్ని మాత్రం నెరవేర్చడం లేదు.



నాడు అధికార వైకాపా తప్ప, రాష్ట్రంలోని అన్ని రాజకీయ పక్షాలు అమరావతి ఉద్యమంతో కరచాలనం చేశాయి. రైతులు చేపట్టిన ఈ చరిత్రాత్మక ఉద్యమంలో ఆయా పార్టీలూ ప్రత్యక్షంగా పాల్గొన్న సందర్భాలు చాలా ఉన్నాయి. రైతులు రాజధాని కోసం భూములను ఎలా త్యాగం చేశారో, అమరావతి కోసం కూడా అలాగే పోరాటం చేశారు. ఉద్యమ సమయంలో రైతులు ఎన్నో ఆవేదనలను, అవమానాలను భరించారు. అయినా మొక్కవోని దీక్షతో 1631 రోజులు ఉద్యమించారు. ఆ ఉద్యమంలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో 274 మంది రైతులు, మహిళలు, ఉద్యమ నాయకులు అసువులు బాసారు. మందడం గ్రామానికి చెందిన గద్దె ప్రభావతి రాజధాని ఉద్యమంలో కీలకమైన పాత్ర పోషించారు. 'అమరావతి–అరసవిల్లి పాదయాత్ర'ను రామచంద్రపురంలో నిలిపేయటంతో ఆవేదనకు గురై గుండెపోటుతో మృతి చెందారు. అదే గ్రామానికి చెందిన గడ్డం మార్టిన్ దళిత జేఏసీ అధ్యక్షుడు. ఉద్యమంలో ఎంతగానో పోరాడారు. ఆయనపై కేసులు పెట్టి, ఎన్‌కౌంటర్ చేస్తామని బెదిరించారు. దీంతో ఆయన ఆకస్మికంగా గుండెపోటుతో చనిపోయారు. నారా కోడూరుకు చెందిన నన్నపనేని కోటేశ్వరావు కూడా ఉద్యమంలో అమరులయ్యారు. చిలకలూరిపేటకు చెందిన కుండబద్దలు సుబ్బారావు అరు పదులు నిండిన వయసులో, డయాబెటిస్ ఉన్నా, అమరావతి కోసం 'కుండబద్దలు' కొడుతూనే ఉండేవారు. జగన్మోహన్‌రెడ్డిపై ఒంటి కాలితో యుద్ధం చేశారు. హైదరాబాద్‌కు చెందిన గోసాల ప్రసాద్ రాజకీయ విశ్లేషకులు. రాజధాని కోసం తపించేవారు. తాడేపల్లికి చెందిన రిటైర్డ్ డీఎస్పీ బొప్పన విజయ్ కుమార్, ఆయన సతీమణి బొప్పన విజయకుమారి అమరావతి ఉద్యమంలో ఒక సాంస్కృతిక దళాన్ని ఏర్పాటు చేశారు. సొంత డబ్బులను ఖర్చుపెట్టి మరీ పాటలు రాస్తూ, పాడిస్తూ ఉద్యమ సహకారం అందించారు. వారిద్దరూ ఇప్పుడు లేరు. అనంతవరంకు చెందిన 80 ఏళ్ల యెడ్లూరి పార్వతమ్మ ఒక్క రోజు కూడా విడువకుండా దీక్షా శిబిరంలో కూర్చునేవారు. ఒక చేత్తో అమరావతి జెండా, మెడలో ఆకుపచ్చని కండువా దాల్చి స్ఫూర్తిదాయకంగా ఉండేవారు. పెదపరిమి బాలయ్య దీక్షా శిబిరాన్ని ఛిద్రం చేయడానికి వచ్చిన పోలీసుల ప్రయత్నాలను 'రామరాజు'లా విఫలం చేశారు. శిబిరానికి రక్షకుడిగా నిలిచారు. ఇలా రాజధాని ఉద్యమంలో అసువులు బాసినవారు ఎందరో. అమరావతిలో వారందరి పేరిట 'అమరావతి స్మృతి వనం' నిర్మించాల్సిన చారిత్రక అవసరం ఉంది.

ఉద్యమ సంకల్ప బలాన్ని ముందు తరాలకు అందించాల్సిన అవసరమూ ఉంది. 'ఆంధ్రప్రదేశ్‌కు ఒకటే రాజధాని, అది అమరావతి మాత్రమే' అని ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఈ బాధ్యతను భుజానికి ఎత్తుకుంటుందని ఆశిద్దాం.

○ పోతుల బాలకోటయ్య
అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు

సూపర్ ఫాస్ట్‌గా 'సూపర్ సిక్స్'!

శ్రమించడాన్ని తేనెటీగల నుంచి, ఓర్పును ఫలాలిచ్చే చెట్ల నుంచి, సేవా భావాన్ని తాను కాలుతూ వెలుగునిచ్చే దీపం నుంచి, నిస్వార్థతను ప్రతిఫలం ఆశించకుండా వీచే గాలి నుంచి నేర్చుకోవాలని పెద్దలు చెబుతారు. ప్రకృతిలోని ఈ గుణాలే ఒక నాయకుడి పాలనలోనూ ప్రతిఫలించాలి. ఇదే మార్గంలో రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి నాయకత్వంలో పాలన కొనసాగుతోంది. స్వాతంత్ర్య దినోత్సవం రోజున 'స్త్రీ శక్తి' పథకాన్ని చంద్రన్న ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులో భాగంగా రాష్ట్ర మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. రాష్ట్ర పరిధిలో, ఏపీఎస్ఆర్టీసీకి చెందిన అయిదు రకాల (పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్) బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించేలా కూటమి ప్రభుత్వం ఈ పథకానికి రూపకల్పన చేసింది. రాష్ట్రంలోని పేద, దిగువ మధ్యతరగతి, మధ్యతరగతి మహిళలకు ఆర్థిక భారాన్ని తగ్గించేలా సీఎం చంద్రబాబు ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చారు.

పాలనకు ప్రణాళిక అమలు చేయడమే చంద్రబాబును ప్రత్యేకంగా నిలబెట్టే లక్షణం. జూలైతో పోలిస్తే ఆగస్టు జీఎస్టీ 14 శాతం అధికంగా వచ్చింది. గత ఏడాదితో పోలిస్తే 6 శాతం అధికం. ప్రభుత్వానికి జీఎస్టీ ఆదాయం బాగా ఉందంటే ఆ రాష్ట్రంలో వ్యాపార వ్యవస్థ బాగున్నట్లు. వైసీపీ నేతలు ఖాళీ చేసిన ఖజానాతో 12 జూన్, 2024న ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించి చంద్రబాబు నాయుడు తన మార్క్ పాలనకు శ్రీకారం చుట్టారు. తొలి సంతకం మెగా డీఎస్సీపై, రెండోది ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై, మూడోది రూ.4వేలకు పెన్షన్లు పెంపుపై, నాలుగోది అన్న క్యాంటీన్ల పునరుద్ధరణపై, అయిదోది స్కిల్ సెన్సస్‌పై... ఇలా పాలనకు స్పష్టమైన దిశను చూపించారు. సంక్షేమం, సమగ్రాభివృద్ధే ఎజెండాగా కొనసాగుతున్న చంద్రబాబు ప్రభుత్వ పాలనలో సూపర్ 6 హామీల అమలు శరవేగంగా సాగుతోంది.

ఇచ్చిన మాట ప్రకారం సూపర్ 6లోని 'తల్లికి వందనం' పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలుంటే అంతమందికి రూ.15వేలు వారి తల్లిదండ్రుల ఖాతాలో వేశారు. మొత్తం 67.27 లక్షల మందికి లబ్ధి చేకూరింది. లబ్ధి పొందిన వారిలో బీసీలు 29.82 లక్షలు, ఎస్సీలు 11.76 లక్షలు, ఎస్టీలు 4.26 లక్షలు, మైనారిటీలు 67వేలు, ఈబీసీలు 8.44 లక్షల మంది ఉన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు భారం తగ్గించేందుకు దీపం–2 పథకం కింద ప్రతి కుటుంబానికి ఏటా 3 గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వం ఉచితంగా ఇస్తోంది. ఇప్పటివరకు 1.93 కోట్లకు పైగా సిలిండర్లను అందజేసింది. దేశానికి వెన్నెముకగా ఉన్న రైతన్న సంక్షేమం కోసం సూపర్ 6 హామీల్లోని 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రూ.20వేలు అందించే కార్యక్రమాన్ని సీఎం ఆగస్టు 2న ప్రారంభించారు. కేంద్ర నిధులతో కలిపి రూ.7వేలు జమ చేశారు. గత ప్రభుత్వం రూ.7,500 ఇస్తే– కూటమి ప్రభుత్వం రూ.14,000 ఇస్తోంది. పి–4లో భాగంగా ఆడబిడ్డలకు అండగా ఉండేలా ఈ కార్యక్రమం అమలుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. యువతకు 20లక్షల ఉద్యోగాలు, ఉపాధితో పాటు నిరుద్యోగ భృతి రూ.3వేలు అందిస్తోంది. జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకొస్తూ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించేందుకు చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారు. గడిచిన 13 నెలల్లో రాష్ట్రానికి రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు, 9 లక్షల ఉద్యోగాలకు ఒప్పందాలు జరిగాయి.

సంపద సృష్టించడం ద్వారా సంక్షేమాన్ని రెట్టింపు స్థాయిలో అమలు చేస్తూ బడుగు బలహీనవర్గాల భవిష్యత్‌కు ప్రభుత్వం బంగారు బాటలు వేస్తోంది. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం వినూత్నమైన, సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటూ నవ్యాంధ్రప్రదేశ్‌ను సంక్షేమ ఆంధ్రప్రదేశ్‌గా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభివృద్ధి చేస్తున్నారు.



దేశంలో ఎక్కడా లేని విధంగా పించన్ల కార్యక్రమం రాష్ట్రంలో నడుస్తోంది. క్రమం తప్పకుండా ప్రతి నెలా ఒకటో తేదీన లబ్ధిదారుల ఇంటికి వెళ్లి రూ.4వేల పింఛన్ అందిస్తున్నారు. వలంటీర్లు లేకుండా ఎలా పంచుతారని వైసీపీ విమర్శించింది. కానీ అందుబాటులో ఉన్న అధికారులతో ఒక్క రోజులోనే ప్రభుత్వం సమర్థవంతంగా పింఛన్ల పంపిణీ చేస్తోంది. వైసీపీ హయాంలో రూ.1,000 పెంచడానికి అయిదేళ్ల సమయం తీసుకున్నారు. కానీ కూటమి ప్రభుత్వం మొదటి నెలలోనే పింఛన్లను పెంచి 64 లక్షల మందికి అందిస్తోంది. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుతో పాటు ప్రజలు ఏం కోరుకుంటున్నారో వారి అవసరాలను కూడా గుర్తించి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. వెనుకబడిన వర్గాలకు మొక్కుబడిగా నామినేటెడ్ పోస్టులు, నిధులు కేటాయిస్తూ గత పాలకులు పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు. కానీ కూటమి ప్రభుత్వం నిధులు, విధులు అన్నింటిలోను అన్ని వర్గాలకూ అగ్రతాంబూలం ఇచ్చింది. కీలక నామినేటెడ్ పోస్టులు ఇవ్వడంతో పాటు బడ్జెట్‌లో బీసీల కోసం రూ.47,456 కోట్లు, ఎస్సీల కోసం రూ.20,281 కోట్లు, ఎస్టీల కోసం రూ.8,159 కోట్లు, మైనారిటీల కోసం రూ.4,376 కోట్లు కేటాయించడమే గాక శరవేగంతో ఖర్చు చేస్తూ సంక్షేమానికి బాటలు వేశారు. పోలవరం, అమరావతి, హంద్రీ–నీవా వంటి జీవనాధార ప్రాజెక్టుల పనులు మళ్లీ వేగం అందుకోవడం, రాయలసీమకు నీటి సరఫరా కల్పించడం, రైతులకు ధాన్యం ధరను చెల్లించడంలో 48 గంటల్లోగా నగదు ఖాతాల్లో జమ చేయడం వంటి చర్యలు పాలనకు స్పష్టమైన రూపాన్ని ఇస్తున్నాయి.


'నవరత్నాల' పేరుతో ఇచ్చిన హామీలను జగన్‌రెడ్డి అమలు చేయలేదు. మద్యపాన నిషేధం, జలయజ్ఞం కింద ప్రాజెక్టుల పూర్తి, పేదలందరికీ ఇళ్లు, ఆరోగ్యశ్రీ కింద అన్ని రకాల వైద్యం, పీజీ వరకు ప్రతి ఒక్కరికీ విద్య... అంటూ ఇచ్చిన హామీలేమీ అమలుచేయక వంచించారు. సూపర్ సిక్స్ పథకాల అమలు చూసి వైసీపీ నాయకులు ఓర్చుకోలేక ఆత్మాహుతి చేసుకునే స్థాయికి దిగజారుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తోంది. ఈ పథకాలతో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారు. అయితే వైసీపీ నాయకులు అసూయతో రప్పా రప్పా కుట్రలు చేస్తున్నారు.

మేనిఫెస్టోలో ఇచ్చిన మొత్తం 180 హామీల్లో 128 హామీలను అంటే 71శాతం హామీలను ఇప్పటికే కూటమి ప్రభుత్వం అమలు చేసింది. మరో 52 హామీల అమలుకు ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. త్వరలోనే ఈ హామీలన్నింటినీ అమలు చేసి, మేనిఫెస్టోను పూర్తిగా అమలు చేసిన ప్రభుత్వంగా చరిత్రలో నిలిచిపోనుంది. ప్రతి క్యాబినెట్‌లోనూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుపై చర్చించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి అద్దం పడుతోంది.

సంపద సృష్టించడం ద్వారా సంక్షేమాన్ని రెట్టింపు స్థాయిలో అమలు చేస్తూ బడుగు బలహీన వర్గాల భవిష్యత్‌కు ప్రభుత్వం బంగారు బాటలు వేస్తోంది. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం వినూత్నమైన, సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటూ నవ్యాంధ్ర ప్రదేశ్‌ను సంక్షేమ ఆంధ్రప్రదేశ్‌గా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి చేస్తున్నారు.



■ డా. అనగాని సత్యప్రసాద్
రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి





ఫ్రీబస్సులో ప్రయాణిస్తున్న మహిళలకు హాయ్ చెబుతున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

శ్రావణ శుక్రవారం... మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి 'స్త్రీ'కారం చుట్టారు. పండిట్ నెహ్రూ బస్టాండ్‌లోని సిటీ బస్‌పోర్టు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించగా, పలువురు మహిళలు మొదటిరోజు ఆనందంగా ప్రయాణం చేశారు. ఈ పథకం ద్వారా ఉమ్మడి కృష్ణాజిల్లాలో 22 లక్షల మంది మహిళలకు ప్రయోజనం చేకూరనుంది.

స్త్రీకారం

జిల్లాలో మొదలైన స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణం

- పీఎన్‌బీఎస్ వేదికగా ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- ఉమ్మడి కృష్ణాజిల్లాలో 22 లక్షల మందికి ప్రయోజనం
- మొదటి రోజే నడిచిన ఐదు ప్రత్యేక బస్సులు
- బస్సుల్లో ప్రయాణించి హర్షం వ్యక్తంచేసిన మహిళలు



ఫ్రీబస్సులో వెళ్తున్న ఆనందంలో మహిళలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాలోని అనేక గ్రామాల నుంచి నిత్యం మహిళలు జీవనోపాధి కోసం విజయవాడ వస్తుంటారు. ఇలాంటి మహిళలకు దూరాభారాన్ని బట్టి నెలకు రవాణా ఖర్చే రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకూ ఉంటుంది. ఉచిత బస్సు ప్రయాణంతో వారందరికీ కాస్త ఆర్థిక ఉపశమనం లభించనుంది. కేవలం సిటీ ఆర్డినరీ, పల్లెవెలుగు బస్సులే కాకుండా అల్ట్రా పల్లెవెలుగు, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ వంటి బస్సుల్లోనూ ఉచితంగా ప్రయాణించవచ్చు. రాష్ట్రస్థాయిలో దూరప్రాంతాలకు కూడా అవకాశం కల్పించారు. ఈ పథకాన్ని అన్ని వయస్సుల మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు కూడా ఉపయోగించుకోవచ్చు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఓటరుకార్డు, మరేదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపిస్తే జీరో ఫేర్ టికెట్ ఇస్తారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం 763 బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు పథకం అమలుకానుంది. 260 పల్లెవెలుగు బస్సులు, 53 అల్ట్రా పల్లెవెలుగు బస్సులు, 254 సిటీ ఆర్డినరీ బస్సులు, 111 మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు, 85 ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయొచ్చు. దీనిద్వారా ఏటా మిగతా 6లో..

మహిళలకు దక్కిన గౌరవం



ప్రభుత్వం మహిళలకు గౌరవం కల్పించింది. అభినందనలు తెలుపుతున్నాను. ఉచిత బస్సు పథకం మహిళలకు ఎంతో ఉపయోగపడుతుంది. ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసే మహిళలకు ఇది ఎంతో వెసులుబాటు. స్త్రీ శక్తి పేరు పెట్టడం బాగా నచ్చింది. - జక్కుల మల్లీశ్వరి

ఎంతో మంచి చేశారు



మహిళలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో మంచి చేశారు. ఆటోవాలాలు అభ్యంతరాలు పెడుతుంటే ఈ పథకం ఇవ్వరేమో అనుకున్నా. కానీ, ప్రభుత్వం తన మాట ప్రకారం నడుచుకుంది. చాలా సంతోషంగా ఉంది. మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల సగటున కుటుంబంపై రూ.2 వేల వరకు ఆర్థిక భారం తగ్గే అవకాశం ఉంటుంది. - ఎస్.స్రవంతి



సాయుధ దళాల గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తదితరులు



ఘనంగా.. తిరంగా..

జాతీయ పతాకం రెపరెపలాడింది. జయహో నినాదాలు మిన్నంటాయి. దేశభక్తి ఎల్లెడెలా ప్రజ్వరిల్లింది. ప్రతి ప్రాంతం త్రివర్ణమయమైంది. 79వ స్వాతంత్ర్య వేడుకలు శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరగ్గా, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన రాష్ట్రవ్యాప్త వేడుకల్లో సీఎం చంద్రబాబు పాల్గొని జాతీయ జెండా ఎగురవేశారు. సాయుధ దళాల కవాతు, శకటాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, అతిరథ మహారథులు, రాజకీయ ప్రముఖులు పాల్గొని జాతీయ పతాకానికి సెల్యూట్ చేశారు.

జిల్లావ్యాప్తంగా స్వాతంత్ర్య వేడుకలు

ఐజీఎంసీలో జెండా ఎగురవేసిన సీఎం చంద్రబాబు



- దళాల నుంచి గౌరవ వందనం స్వీకరణ
- ఆకట్టుకున్న వివిధ శాఖల శకటాల ప్రదర్శన
- దేశభక్తిని చాటిన సాయుధ దళాల కవాతు
- బెజవాడలో కలియతిరిగిన శకటాలు



నగరంలో శకటాల ర్యాలీ



కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబును అభినందిస్తున్న సీఎం

'అంగులూరు'కు అవార్డు

కృష్ణాజిల్లాలోని గుడ్లవల్లేరు మండలం అంగులూరు ప్రభుత్వ బాలిక పాఠశాలకు సీఎం చంద్రబాబు అవార్డు అందజేశారు. రాష్ట్రంలోని ఉత్తమ పాఠశాలలకు ఈ అవార్డు దక్కగా, కృష్ణాజిల్లా నుంచి అంగులూరు ప్రభుత్వ బాలికల పాఠశాల ఎంపికైంది.

విజయవాడ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 79వ స్వాతంత్ర్య వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ఆయనకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. సీఎం చంద్రబాబు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం డీజీపీతో కలిసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ వేడుకల్లో సీఎం సతీమణి భువనేశ్వరి, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, యార్లగడ్డ వెంకట్రావు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, కలెక్టర్ లక్ష్మీ, సీపీ రాజశేఖరబాబు తదితరులు పాల్గొన్నారు. వివిధ శాఖలు ప్రదర్శించిన శకటాలు ప్రభుత్వ పనితీరును, అభివృద్ధిని వివరించాయి. మొత్తం 21 శాఖల శకటాలు పాల్గొనగా, పీ4, రవాణా శాఖ, రాజధాని అమరావతి శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేడుకల అనంతరం అన్ని శకటాలు నగర రహదారులపై తిరిగాయి. బందరురోడ్డు, బెంజిసర్కిల్, రామవరప్పాడు రింగ్, ఏలూరు రోడ్డు, కంట్రోల్ రూమ్ మార్గాల్లో వెళ్లిన శకటాలను నగరవాసులు ఆసక్తిగా తిలకించారు.

మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నమస్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ



సమష్టి కృషితో నెంబర్‌వన్

స్వాతంత్ర్య వేడుకల్లో కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ఎందరో మహనీయుల త్యాగాల ఫలితమే నేటి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలని, స్వర్ణాంధ్ర దార్శనికతకు అనుగుణంగా అడుగులేస్తూ జిల్లాను అభివృద్ధి, సంక్షేమంలో నెంబర్‌వన్‌గా నిలిపేందుకు సమష్టిగా అడుగులేద్దామని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. 79వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా శుక్రవారం నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ మహనీయుల ధైర్యం, త్యాగాలను స్మరించుకుంటూ, ముందడుగు వేస్తూ జిల్లా, రాష్ట్రం, దేశ ప్రగతికి కృషిచేద్దామన్నారు. స్వర్ణాంధ్ర కలను సాకారం చేయాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పీ4 అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, ఈ కార్యక్రమం అమలుతో పాటు జిల్లాలో 18.5 శాతం వార్షిక వృద్ధి లక్ష్యాల సాధనకు పనిచేయాల్సిన అవసరముందన్నారు. ఆరోగ్యాంధ్ర సాకారానికి నిర్వహించిన యోగాంధ్రలో జిల్లాను ముందు వరుసలో నిలిపామని, ఇదే స్ఫూర్తితో అన్ని విధాలా ప్రగతికి చేయిచేయి కలపాల్సిన అవసరముందన్నారు. దార్శనిక ప్రణాళికల అమల్లో మెరుగైన ఫలితాలు సాధించడం ద్వారా జిల్లా జీడీపీ, తలసరి ఆదాయ లక్ష్యాలను చేరుకోవచ్చని, ఈ విషయాన్ని గుర్తెరిగి అధికారులు నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ వేడుకల్లో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా, డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజీ వద్ద కాస్త తగ్గిన వరద

తగ్గిన ఉధృతి



- క్రమంగా తగ్గుతున్న కృష్ణానది వరద
- పులిచింతల, ప్రకాశం బ్యారేజీకి సాధారణంగానే ఇన్‌ఫ్లో
- నేటికి మరింత తగ్గే అవకాశం
- వర్షపాతంపై ఆరెంజ్ అలెర్ట్ రద్దు

విజయవాడ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : వరద ఉధృతి తగ్గుతోంది. ఎగువ నుంచి వస్తున్న నీరు సాధారణ స్థాయికి చేరుతోంది. దీంతో పులిచింతల ప్రాజెక్టు, ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణమ్మ పరవళ్లు తగ్గుముఖం పట్టాయి. జిల్లాలో వర్షాలు సాధారణంగా ఉండొచ్చని వాతావరణ శాఖ ఫోర్‌కాస్ట్ విడుదల చేసింది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిస్తే ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉంది. నాగార్జున సాగర్ నుంచి పులిచింతల ప్రాజెక్టుకు 1,54,081 క్యూసెక్కుల నీరు వస్తోంది. ఈ ప్రాజెక్టు నుంచి 1,67,080 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి ప్రకాశం బ్యారేజీకి 2,28,665 క్యూసెక్కుల నీరు వస్తోంది. 55 గేట్లను ఏడు అడుగులు, 15 గేట్లను ఆరు అడుగుల మేర ఎత్తి 2,79,875 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. కాల్వలకు 3,523 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇక వర్షపాతం విషయంలో వాతావరణ శాఖ ఇచ్చిన ఆరెంజ్ అలెర్ట్‌ను రద్దు చేసింది. జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదవుతుందని తెలిపింది. గురువారం రెండు కాల్వలకు 606 క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన బ్యారేజీ అధికారులు ఆ పరిమాణాన్ని శుక్రవారం పెంచారు. బ్యారేజీ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 3.07 టీఎంసీలు. ప్రస్తుతం మూడు టీఎంసీల నీరు నిల్వ ఉంది. పులిచింతల ప్రాజెక్టు నీటి సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 40.81 టీఎంసీలు ఉంది. మరోపక్క మునేరు, బుడమేరుకు నీటి ప్రవాహం తగ్గిపోయింది. శనివారం నాటికి ఈ ఇన్‌ఫ్లోలు మరింతగా తగ్గుతాయని అధికారులు భావిస్తున్నారు.

సింగిల్ విండో విధానంలో గణేశ్ పందిళ్లకు అనుమతివ్వండి

- సీఎంకు ఏపీ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధుల వినతి

విజయవాడ సిటీ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : గణేశ్ పందిళ్లకు, ఊరేగింపులకు ఎలాంటి అడ్డంకులు లేకుండా సింగిల్ విండో విధానంలో అనుమతి ఇవ్వాలని సీఎం చంద్రబాబును ఆంధ్రప్రదేశ్ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సీఎంకు ఉత్సవ సమితి ప్రతినిధులు గోకరాజు గంగరాజు, చలసాని ఆంజనేయులు, పి.త్రినాథ్ శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈనెల 27 నుంచి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పందిళ్ల ఏర్పాటుకు, ఊరేగింపునకు, నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అన్ని ప్రాంతాలకు అందుబాటులో నోడల్ పాయింట్లను ఏర్పాటు చేయాలని, ఎలాంటి నగదు డిపాజిట్ లేకుండా అనుమతులు ఇవ్వాలని, పందిళ్లకు విద్యుత్ సరఫరా, పారిశుధ్య నిర్వహణ అందజేయాలని, డీజే సౌండ్ సిస్టమ్‌కు అనుమతి ఇవ్వాలని, నిమజ్జన పాయింట్లవద్ద క్రేన్‌లను ఏర్పాటు చేయాలని, విగ్రహం ఎత్తు ఎక్కువ ఉందని, పర్యావరణానికి హాని అనే నెపంతో అధికారులు నగదు వసూలు చేయడాన్ని నియంత్రించాలని, ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని కోరారు.



శ్రావణ సందడి

శ్రావణ శుక్రవారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. సెలవు రోజు కూడా కావడంతో దూరప్రాంతాల నుంచి కూడా జనం తరలివచ్చారు. దీంతో క్యూలైన్లు, ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. భక్తులు ఇబ్బంది పడకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

అద్వీక ఆస్తులెక్కడ?

జప్తు చేసేందుకు రంగం సిద్ధంచేస్తున్న సిట్

- వివరాల కోసం తెలంగాణ రిజిస్ట్రేషన్ శాఖకు లేఖ
- ఆస్తుల క్రయవిక్రయాలు జరపొద్దని నోటీసులు



(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : లక్ష రూపాయలు ఇస్తే.. నెలకు రూ.6 వేల వడ్డీ చెల్లిస్తానని మాయమాటలు చెప్పి.. కోట్ల రూపాయల పెట్టుబడులను స్వీకరించి.. బోర్డు తిప్పేసిన అద్వీక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆస్తులను జప్తు చేయడానికి సిట్ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగానే ఆ సంస్థకు ఎక్కడెక్కడ ఆస్తులు ఉన్నాయో గుర్తించే పనిలో అధికారులు పడ్డారు. దీనికి సంబంధించి హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా ఆస్తుల వివరాలపై సిట్ అధికారులు తెలంగాణ రిజిస్ట్రేషన్ శాఖకు లేఖ రాశారు. ఈ వివరాలు రెండు, మూడు రోజుల్లో వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒక బృందం విజయవాడ నుంచి హైదరాబాద్ కూడా వెళ్లి ఈ లేఖను మిగతా 6లో..

ఖబానాను ఏం చేద్దాం?

ఖాతాదారులు, ఏజెంట్ల నుంచి సేకరించిన మొత్తంలో రూ.3 కోట్లను ఆదిత్య దుబాయిలోని ఖబానా సంస్థలో పెట్టుబడిగా పెట్టాడు. ఈ మొత్తం నగదును హవాలా మార్గంలో పంపించాడు. ఫారెక్స్‌లో షేర్లు కొన్నాడు. ఇప్పుడు ఈ నగదు విషయంలో ఏం చేయాలో పోలీసులకు పాలుపోవట్లేదు. ఈ మొత్తం షేర్లను రద్దు చేస్తే నగదంతా హవాలా మార్గంలో తిరిగి వస్తుంది. ఇది చట్టరీత్యా నేరం. అలా చేసి నగదును రప్పించి బాధితులకు న్యాయం చేద్దామంటే లేనిపోని ఆరోపణలు ఎదుర్కోవాలని పోలీసులు భావిస్తున్నారు. ప్రాంతాలవారీగా ఉన్న ఏజెంట్లు, వారి కింద ఉన్న ఖాతాదారులను పోలీసులు పిలిపిస్తున్నారు. వారి నుంచి వాంగ్మూలాలు తీసుకుంటున్నారు. బ్యాంక్ స్టేట్‌మెంట్ల వివరాలను అడుగుతున్నారు. వీలైనంత త్వరగా అద్వీకలో అరెస్టులను అధికారికంగా చూపించాలన్న యోచనలో సిట్ అధికారులు ఉన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న సీఎం చంద్రబాబు



ప్రత్యేక ఆకర్షణగా వివిధ శాఖల అభివృద్ధిని వివరిస్తూ శకటాలు

వైభవంగా.. తిరంగా



విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో రక్షణ శాఖల కవాతు

- ఘనంగా స్వాతంత్ర దినోత్సవం
- ఆకట్టుకున్న శకట ప్రదర్శన
- దేశభక్తిని చాటిన సాయుధ దళాల కవాతు
- ప్రత్యేక ఆకర్షణగా శాఖల శకటాలు

విజయవాడ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి) : విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 79వ స్వాతంత్ర దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా సీఎం చంద్రబాబు హాజరయ్యారయ్యారు.

ఆకట్టుకున్న శకట ప్రదర్శన

స్వాతంత్ర దినోత్సవంలో వివిధ శాఖలు ప్రదర్శించిన శకటాలు ప్రభుత్వ పనితీరును, అభివృద్ధిని వివరించాయి. మొత్తం 21 శాఖల శకటాలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి. పీ4 శకటం, రవాణాశాఖ రూపొందించిన శకటం ప్రత్యేకార్షణగా నిలిచాయి. ఈ ఏడాది ఉత్సవాల్లో ఈ రెండు శకటాలు కొత్తగా చేరాయి. పీ4 శకటం రాష్ట్రంలో పేదరిక నిర్మూలన, బంగారు కుటుంబాలకు ప్రభుత్వం చేపట్టిన విధానాలను ఈ శకటం వివరించింది. సీఆర్‌డీఏ తయారు చేయించిన రాజధాని అమరావతి శకటం కాలాతీత వారసత్వం నుంచి ప్రపంచస్థాయి భవిష్యత్తును చూపింది. పరిశ్రమల శాఖ శకటం స్వర్ణాంధ్ర 2047లో పెట్టుబడులను పెంచే ప్రణాళికను చూపింది. పౌరసరఫరాల శాఖ శకటం దీపం 2 పథకాన్ని తెలియజేసింది. ఆర్టీజీఎస్ శకటం రియల్‌టైమ్ ఇంటెలిజెన్స్ ద్వారా స్మార్ట్ గవర్నెన్స్, క్వాంటం వ్యాలీ, వాట్సాప్ గవర్నెన్స్‌ను వివరించింది. జల వనరుల శాఖ శకటం హంద్రీనీవా సుజల స్రవంతి, పోలవరం ప్రాజెక్టుల ప్రగతిని తెలియజేసింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల శకటం గ్రామాలు, గిరిజన ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధిని స్పష్టం చేసింది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ శకటం వ్యర్థాల నిర్వహణ, చెత్త నుంచి రీసైక్లింగ్, పునర్వినియోగాన్ని, అటవీశాఖ శకటం హరితాంధ్ర వన్యప్రాణుల సంరక్షణ, సుస్థిర అభివృద్ధిని వివరించింది. రవాణా శాఖ శకటం కొత్తగా ప్రారంభించే స్త్రీశక్తి పథకాన్ని తెలియజేసింది. మౌలిక వసతులు, పెట్టుబడులు, మారిటైమ్ బోర్డు శకటం లాజిస్టిక్‌లో రాష్ట్రానికి ఉన్న అవకాశాలను తెలిపింది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ శకటం యోగాంధ్ర, ఆరోగ్యాంధ్ర నినాదాన్ని వినిపించింది. విద్యాశాఖ శకటం ఆంధ్రా మోడల్ ఎడ్యుకేషన్‌ను, వ్యవసాయ శాఖ సహజ వ్యవసాయ నిర్వహణ, సెర్ప్ శకటం 25 వసంతాల వెలుగు ప్రస్థానాన్ని వివరించింది. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మహిళల రక్షణ, భద్రత, సాధికారతకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించింది. చేనేత, జౌళి శాఖ శకటం ఒక జిల్లా ఒక ప్రొడక్ట్‌ను చూపించింది. పట్టుపరిశ్రమ శాఖ శకటం మేరా రేషం మేరా అభియాన్, ఆకు నుంచి వస్త్రం వరకు, స్థిరమైన పట్టు వైపు అంటూ ముందుకు సాగింది. పర్యాటక శాఖ శకటం క్రాఫ్టింగ్ అనుభవం, జ్ఞాపకాలను సృష్టించడం నినాదాన్ని వినిపించింది. మెప్మా శకటం డిజిటల్ ప్రేరణతో సమష్టిగా సాధికారత పొందిన కుటుంబాలను చూపించింది. ఇంధన శాఖ శకటం పునరుత్పాదక శక్తి, హైడ్రోజన్ గ్రీన్ ఎనర్జీ భవిష్యత్ శక్తిని ప్రదర్శించింది. ఈ శకటాల్లో పట్టు పరిశ్రమ శాఖకు మొదటి బహుమతి, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖకు రెండో బహుమతి లభించింది. మెప్మా శకటం తృతీయ బహుమతి లభించింది. వేడుకల అనంతరం మొత్తం అన్ని శకటాలు నగర రహదారులపై తిరిగాయి. ఎంజీ రోడ్డు, బెంజ్ సర్కిల్, రామవరప్పాడు రింగ్, ఏలూరు రోడ్, కంట్రోల్ రూమ్ మార్గాల్లో ప్రదర్శనగా వెళ్లిన ఈ శకటాలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

సేవలకు గుర్తింపు

విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి సీఎం చంద్రబాబు పతకాలను అందజేశారు. ప్రెసిడెంట్ పోలీస్ వెపతకాలను ఇంటెలిజెన్స్ డీజీ మహేష్‌చంద్ర లడ్హా, ఐజీ ఎం.రవిప్రకాష్, రాజమండ్రి ఎస్పీఎఫ్ డీఎస్పీ డీడీ గంగరాజు అందుకున్నారు.

పోలీస్ మెడల్ ఫర్ మెమోరీయస్ సర్వీస్ పతకాలను రిటైర్డ్ కమాండెంట్ వెంకట్ ప్రేమ్‌జిత్, ఏపీఎస్పీ 11వ బెటాలియన్ ఆర్ఎస్ఐ ఆవుల చెన్నయ్య, తిరుపతి ఏఆర్ రిటైర్డ్ ఏఎస్ఐ ఆర్.రమణారెడ్డి, ఒంగోలు పీటీసీ రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ అద్దంకి వెంకటేశ్వర్లు, కడప సీసీఎస్ ఏఎస్ఐ బి.ప్రకాష్ రావు, ఎస్పీఎఫ్ ఎస్ఐ కరి మస్తాన్‌రావు, ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండ్ వెంకట సత్య అనంత దుర్గాప్రసాదరావు, నెల్లూరు ఇన్‌స్పెక్టర్ అక్కిశెట్టి శ్రీహరిరావు, డీఎస్పీ ఈద కోటిరెడ్డికి సీఎం చంద్రబాబు పతకాలు అందజేశారు. అసాధారణ అసూచన కుశలత పతకాలను సీఆర్పీఎఫ్ ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్, డీఎస్పీ ఉజ్జి శ్రీనివాసరావు, ఈగల్ ఆర్ఐ టి.ధనుంజయ నాయుడు, ఎస్ఐబీ ఏఆర్ఎస్ఐ దాసరి గిరిధర్ అందుకున్నారు. సీఎం శౌర్య పతకాలను ఎస్. గోవిందరావు, వై.రమేష్, టి.రాజేష్, కె.మహేష్, ఎన్. చంద్రశేఖర్, ఎం.మోహన్ కుమార్, ఎ.వెంకటేష్, ఎన్.తులసీరాజ్, షేక్. ఖాజా అందుకున్నారు.



వందేమాతరం పోస్టర్ ఆవిష్కరించిన ఎంపీ చిన్ని

విస్సన్నపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రత్నం మూవీ క్రియేషన్స్ ఆధ్వర్యంలో ప్రముఖ సినీ నటుడు శోభనబాబు మేనల్లుడు శోభన్‌రాజా ప్రధాన పాత్రలో నటించిన వందేమాతరం సినిమా ఓటీటీ రిలీజ్ అవుతున్న సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆయన కార్యాలయంలో శుక్రవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రామిశెట్టి శివ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలు మరువరాదు

- మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



గొల్లపూడి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ప్రాణాలను తృణప్రాయంగా పెట్టి మనకు స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుల త్యాగాలు మరిచిపోకూడదని, ఈనాటి స్వేచ్ఛ వారి త్యాగాల ఫలితమే అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా గొల్లపూడిలోని కార్యాలయంలో శుక్రవారం జాతిపిత మహాత్మ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేవినేని ఉమా మాట్లాడుతూ, యువత అన్నివిధాలుగా చైతన్యవంతులై సమగ్రతకు బాటలు వేయాలని కోరారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో రెట్టింపు సంక్షేమం అమలవుతోందన్నారు.



ఎన్జీఓ హోంలో వేడుకల్లో విద్యాసాగర్, డీవీ రమణ తదితరులు

స్వాతంత్ర్య ఫలాలు ప్రతి ఒక్కరికి అందాలి

- ఏపీ ఎన్జీవో అధ్యక్ష, కార్యదర్శులు విద్యాసాగర్, డీవీ రమణ

కలెక్టరేట్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : విదేశీయుల పాలనలో మగ్గిన భారతీయులు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలతో జీవించేందుకు అవకాశం కల్పించిన ప్రతి ఒక్క స్వాతంత్ర్య సమరయోధుడు దేశప్రజల మనస్సులో చిరస్మరణీయంగా నిలిచి వుంటారని ఏపీఎన్జీవో అధ్యక్ష, కార్యదర్శులు ఎ.విద్యాసాగర్, డీవీ రమణ అన్నారు. గాంధీనగర్‌లోని ఎన్జీఓ హోంలో శుక్రవారం అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత రెండు దశాబ్దాల కాలంలో ఎన్నడూ లేనంతగా భారతదేశ కీర్తి ప్రతిష్ఠలు ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచానికి తెలియజెప్పామన్నారు. కార్యక్రమంలో ఎన్జీఓ నాయకులు కె.జగదీశ్వరరావు, జె.మాధవ్, జానకి రాజ్యలక్ష్మి, శివలీల, నాగభూషణం, సేవానాయక్, జానీ బాషా, రవి యాదవ్, డీఎస్ఎన్ రెడ్డి, ఎం.రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతులకు ప్రోత్సాహకం

- రైతులకు గేదెలను పంపిణీ చేసిన నెట్టెం రఘురాం

విజయవాడ : నందిగామ మండలంలోని మునగచర్ల గ్రామంలో పాడిపై ఆసక్తి ఉన్న 22 మంది రైతులకు కృష్ణామిల్క్ యూనియన్ ఆధ్వరయంలో కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం 22 గేదెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రన్న సామూహిక గోకులం ఏర్పాటు చేసి రైతులకు శుక్రవారం గేదెలను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పీ4 కార్యక్రమంలో భాగంగా కృష్ణామిల్క్ యూనియన్ తరఫున బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న వారికి వడ్డీమాఫీ చేస్తామని యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ప్రకటించారు.

రాష్ట్రానికి భారీగా విద్యుత్ పెట్టుబడులు

- ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి

అమరావతి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ పెట్టుబడులతో పునరుత్పాదక విద్యుదుత్పత్తి సంస్థలు ఏర్పాటు కానున్నాయని ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ కీర్తి చేకూరి వెల్లడించారు. గ్రీన్ ఎనర్జీ మూడో దశ కింద రూ. 28,033 కోట్ల ప్రతిపాదనలను కేంద్ర విద్యుత్తు సంస్థ (సీఈఏ)కు పంపామని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడ విద్యుత్ సౌధలో జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. అనంతరం విద్యుత్తు సంస్థల సిబ్బందిని ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. సీఈఏకు ప్రతిపాదించిన మూడో దశ గ్రీన్ ఎనర్జీ ద్వారా 11 గిగావాట్ల సౌరశక్తి, 7373 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులను గ్రీన్ కారిడార్‌కు అనుసంధానం చేస్తామన్నారు. ఏపీ ట్రాన్స్‌కో చేపడుతున్న ప్రాజెక్టులు పూర్తయితే 8,862 సర్క్యూట్ కిలోమీటర్ల మేర కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్లు, 9,500 ఎంవీఏ విద్యుత్తు సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని ఆమె చెప్పారు. 2030 నాటికి జాతీయస్థాయిలో పునరుత్పాదక ఇంధన లక్ష్యాలను అందుకోగలుగుతామని ధీమా వ్యక్తం చేశారు. రూ. 8,638 కోట్ల వ్యయంతో 69 ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులను చేపడుతున్నామని, వీటితో ట్రాన్స్ మిషన్ లైన్లు అదనంగా అందుబాటులోకి వస్తాయన్నారు. గత ఏడాది ట్రాన్స్‌మిషన్ నష్టాలను 2.69 శాతం నుంచి 2.60 శాతానికి తగ్గించామని కీర్తి చెప్పారు.

డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారిగా జి.ధనలక్ష్మి



కలెక్టరేట్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారిగా సీహెచ్.ఆశారాణిని పూర్తిఅదనపు బాధ్యతలతో నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. విజయవాడలో కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న సీహెచ్.ఆశారాణి జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్‌గా పదోన్నతి పొంది రాష్ట్ర కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. విజయవాడ కార్మిక శాఖ కార్యాలయంలో జి.ధనలక్ష్మి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తనను కలిసి తెలపవచ్చన్నారు. ఈ శ్రమ్ పోర్టల్లో ప్రతి కార్మికుడు తమ పేర్లను నమోదు చేసుకొని ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆడబిడ్డలను ఆర్థికంగా బలోపేతం చేస్తాం

- మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి శక్తివంతులుగా తయారుచేసే లక్ష్యంతోనే ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమాన్ని ప్రారంభించామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం రాత్రి ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి 'స్త్రీశక్తి' పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. మంత్రి కండక్టర్‌లా మారి మహిళలకు టికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 11,500 ఆర్టీసీ సర్వీసులున్నాయని, అందులో 74 శాతం సర్వీసులు మహిళల కోసం ఉచితంగా ప్రారంభించామన్నారు. సగటున 25 లక్షల మంది మహిళలు ప్రయాణిస్తున్నారన్నారు. రోజుకు రూ.162 కోట్లు ప్రభుత్వంపై భారం పడుతుందన్నారు. సంవత్సరానికి దాదాపు రూ. 2వేల కోట్లు ఆర్టీసీకి ఖర్చవుతుందని, ఆ ఖర్చును ప్రభుత్వం తిరిగి ఆర్టీసీకి చెల్లిస్తుందన్నారు. ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ, ప్రతి రోజూ 80 వేలమంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో స్వాతి, ఆర్టీసీ ఆర్ఎం వెంకటేశ్వర్లు, డిపో మేనేజర్ పెద్దిరాజు, కార్పొరేటర్ సమతాకీర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, కొరెడ్ల సుశీల, పీవీ ఫణి కుమార్, లంకిశెట్టి నీరజ, పిప్పళ్ల కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



బస్టాండ్‌లో బస్ కండక్టర్‌లా మారిన మంత్రి రవీంద్ర

వరుస కార్యక్రమాలు నిలిచిన ప్రశంసాపత్రాల అందజేత

విజయవాడ సిటీ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): వరస ప్రభుత్వ కార్యక్రమాలు ఉన్న నేపథ్యంలో పంద్రాగస్టు వేడుకల సందర్భంగా జిల్లాలోని అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాల అందజేత కార్యక్రమాన్ని కలెక్టర్ జి.లక్ష్మీశ నిలిపివేశారు. విధుల్లో మెరుగైన పనితీరు కనబర్చిన జిల్లా ఉన్నతాధికారులు, సిబ్బందికి ఏటా ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రశంసాపత్రాలను అందజేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు కృష్ణానదితో పాటు మునేరు, బుడమేరు, కట్టలేరు, వైరా, ఏనుగుగడ్డ వాగుల్లో వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో కొన్ని శాఖల అధికారులు, సిబ్బంది వరద విధుల్లో ఉండిపోయారు. అధికారులు, సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు పూర్తిగా విధుల్లో నిమగ్నమైన నేపథ్యంలో ప్రశంసా పత్రాల అందజేత కార్యక్రమాన్ని నిలుపుదల చేశారు. నేటి నుంచి కార్యాలయాల హెచ్‌వోడీలు వారివారి శాఖలోని ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేస్తారని సమాచారం.

సరుకు లోడింగ్‌లో విజయవాడ డివిజన్‌కు పదో ర్యాంకు

- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో డీఆర్ఎం మోహిత్ సోనాకియా

రైల్వేస్టేషన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్ సరుకుల లోడింగ్‌లో జాతీయ స్థాయిలో పదవ ర్యాంకు లభించిందని డీఆర్ఎం మోహిత్ సోనాకియా అన్నారు. విజయవాడ రైల్వే మినీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో డిఆర్ఎం జాతీయ జెండాను ఎగురవేసి శుభాకాంక్షలు తెలిపారు. ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్న కార్యక్రమంలో సెరిమోనియల్ పరేడ్ నిర్వహించారు. ఐక్యమత్యానికి, అంకితభావానికి ఆదర్శంగా నిలుస్తూ నిర్వహించిన పరేడ్‌ను సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ షణ్ముఖ వడివేలుతో కలిసి మోహిత్ సోనాకియా పరిశీలించారు. ఆర్‌పిఎఫ్, జాక్ అండ్ జిల్ స్కూల్ విద్యార్థులు ఈ పరేడ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోహిత్ సోనాకియా మాట్లాడుతూ.. రైల్వే డివిజన్ ఉద్యోగులను అభినందించారు. సరుకుల లోడింగ్‌లో విజయవాడకు పదవ ర్యాంకు రావటం అభినందనీయమని, దీనిని కొనసాగించాలని ఆయన కోరారు. ఇటీవల జరిగిన రైల్వే వారోత్సవాల సందర్భంగా విజయవాడ డివిజన్‌కు 12 బెస్ట్ పని తీరు అవార్డులు రావటం అభినందనీయమన్నారు. ఓవరాల్ సమర్థతలో కూడా షీల్డ్ రావటం శ్లాఘనీయమన్నారు. అమృత భారత్ స్టేషన్ స్కీమ్ కింద రాజమండ్రి, విజయవాడ, నెల్లూరు మొత్తం 24 స్టేషన్లలో అప్‌గ్రేడేషన్ జరుగుతుందన్నారు. ప్రమాద రహిత డివిజన్‌గా రూపొందించేందుకు కృషి జరుగుతుందన్నారు. 87 శాతం రైళ్ల రాకపోకలలో సమయపాలన జరుగుతుందన్నారు. ఈ ఏడాది జులై నాటికి 3,114 మిలియన్ టన్నుల సరుకును రవాణా చేసినట్లు, గత ఏడాది కంటే 21.45 శాతం వృద్ధి ఉందని తెలిపారు. 2024-25లో గ్రాస్ రెవెన్యూ రూ.5,841 కోట్లుగా ఉందన్నారు. ఇందులో సరుకు రవాణాకు సంబంధించి రూ.4,239.74కోట్లు ఉందన్నారు. సీసీ టీవీ కెమెరాల అమరిక, మౌలిక సదుపాయాల విస్తరణ, తదితర అంశాలను ఆయన ప్రస్తావించారు. మెకానికల్, ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్లు వ్యాగన్ ఓవర్ హాల్స్‌లో రికార్డు సాధించిందన్నారు. కొత్త ట్రైన్ సర్వీసులను ప్రారంభించామని, సోలార్ కెపాసిటిని విస్తరించామని, రోడ్డు అండర్ బ్రిడ్జిలను పూర్తి చేస్తున్నామని తెలిపారు. డివిజన్‌కు 2015లో ఐఎస్ఓ సర్టిఫికెట్ వచ్చిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ అడిషనల్ డిఆర్ఎం కొండా శ్రీనివాసరావు, ఇంకా ఇతర అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



రాజధాని అమరావతి నిర్మాణానికి ఉద్యోగులు పరిశ్రమించాలి

- ఏడీసీ సీఎండీ డి.లక్ష్మీ పార్థసారథి

కలెక్టరేట్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతి నిర్మాణంలో అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ఉద్యోగులందరూ పరిశ్రమించాలని సంస్థ సీఎండీ డి.లక్ష్మీ పార్థసారథి పిలుపునిచ్చారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శుక్రవారం విజయవాడ రింగ్‌రోడ్డులోని ఏడీసీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించి ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేయడానికి ఉద్యోగులు కృషిచేయాలన్నారు. ఏడీసీ జీఎం కె.శ్రీహరి, చీఫ్ ఇంజినీర్లు ఆర్.గోపాలకృష్ణారెడ్డి, సీహెచ్.ధనుంజయ్, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో..

- డీటీసీ ఎ.మోహన్

కృష్ణలంక : ఎందరో మహనీయులు ప్రాణాలు సైతం లెక్కచేయకుండా దేశం కోసం పోరాడి సాధించుకొన్న స్వరాజ్య ఫలితాలే నేడు మన స్వేచ్ఛా జీవితానికి నిదర్శనమని జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎ.మోహన్ అన్నారు. బందరురోడ్డులోని డీటీసీ కార్యాలయంలో శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డీటీసీ ఎ.మోహన్ పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఇన్‌చార్జి ఆర్టీవోలు ఆర్.ప్రవీణ్, కె.వెంకటేశ్వరరావు, మోటారు వాహన తనిఖీ అధికారులు వి.పద్మాకర్, వై.నాగేశ్వరరావు, శివరామ గౌడ్, జీవీఎస్ఎస్ మూర్తి, ఏపీ రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షులు ఎం.రాజుబాబు, కార్యాలయ పరిపాలన అధికారులు సత్యనారాయణ, అబ్దుల్ సత్తార్, చంద్రకళ, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఆర్‌డీఏ కార్యాలయంలో

కలెక్టరేట్ : ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ మల్లారపు నవీన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సభను ఉద్దేశించి మాట్లాడారు. భవిష్యత్ ఆశయాల నగరమైన అమరావతిని నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టులో భాగమవ్వడం ప్రతి ఉద్యోగికి గర్వకారణమన్నారు. సీఆర్‌డీఏ డైరెక్టర్ వల్లభనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రపంచస్థాయి ఉన్నత ప్రమాణాలతో, మౌలిక సదుపాయాలతో రాజధాని అమరావతిని భారతీయులందరికీ గర్వకారణంగా తీర్చిదిద్దే బాధ్యత సీఆర్‌డీఏపై వుందని తెలియజేశారు. పేదలు, అనాథ బాలల సంక్షేమం కోసం పనిచేస్తున్న ఈ ట్రస్ట్‌కు ఏపీ సీఆర్‌డీఏ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది రూ.1 లక్ష విరాళం అందించారు.



పోలీసు శాఖ ద్వారా విశిష్ట సేవలకు గాను సీపీ రాజశేఖరబాబు నుంచి పతకాలు అందుకుంటున్న పోలీసు అధికారులు, సిబ్బంది

విశిష్ట సేవలకు ఉత్తమ పురస్కారం

విజయవాడ సిటీ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు విశిష్ట సేవలు అందించిన జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందికి ఉగాది-2025 ఉత్తమ సేవా, సేవా పతకాలను పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నగరంలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. ఎందరో త్యాగ ఫలితమే ఈ స్వాతంత్ర్యమని సీపీ ఈ సందర్భంగా గుర్తు చేశారు. అనంతరం ట్రాఫిక్ రిటైర్డ్ డీసీపీ కృష్ణమూర్తినాయుడు, మహిళా ఎస్ఐ వెంకటదుర్గామల్లేశ్వరి, ఏఆర్ ఎస్ఐలు ఎ.ఏలియా, ఎస్.శ్రీనివాసరావు, సీసీఎస్ ఎస్ఐ కె.నాగేశ్వరరావు, ఎస్బీ రిటైర్డ్ ఎస్ఐ కె.రామకృష్ణరాజు, పటమట రిటైర్డ్ ఎస్ఐ వై.నాగమహంకాళిరావు, సీసీఆర్బీ ఏఎస్ఐ కె.కోటేశ్వరరావు, సైబర్ క్రైం ఏఎస్ఐ వి.వెంకటేశ్వరరావు, ఎస్బీ హెడ్‌కానిస్టేబుళ్లు బి.దుర్గాప్రసాద్‌వర్మరాజు, బి.నాగేంద్రసింగ్, బిసత్యనారాయణ, వై.రమేష్, ఎం.రాజు, గవర్నర్‌పేట హెడ్ కానిస్టేబుల్ సోమయ్య, సీఎస్‌డబ్ల్యూ హెడ్ కానిస్టేబుల్ వి.బాలరామమూర్తి, మాచవరం హెడ్‌కానిస్టేబుల్ ఎం.వీరయ్య పతకాలను అందజేశారు.



స్త్రీకారం

(5వ పేజీ తరువాయి)

రూ.360 కోట్ల మేర ప్రభుత్వం ఖర్చు భరించనుంది.

ఆ ఐదు బస్సుల్లో..

ఈ పథకం కోసం ఆర్టీసీ ఐదు స్పెషల్ బస్సులను ఏర్పాటు చేసింది. ఈ బస్సులను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే బొండా ఉమా కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు జెండా ఊపి ఈ బస్సులను ప్రారంభించారు. బస్సుల్లో ప్రయాణిస్తున్న వారికి ఆయన టాటా.. కూడా చెప్పారు. మొదటి సిటీ ఆర్డినరీ బస్సును గుంటుపల్లి వరకు, రెండో పల్లెవెలుగు బస్సును జి.కొండూరు వరకు, మూడో అల్ట్రా పల్లెవెలుగు బస్సును పరిటాల వరకు, నాల్గో మెట్రో ఎక్స్‌ప్రెస్‌ను తుమ్మలపాలెం వరకు, ఐదో ఎక్స్‌ప్రెస్ సర్వీసును కంచికచర్ల వరకు నడిపారు.

మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం

- ఎమ్మెల్యేలు బొండా ఉమా, గద్దె రామ్మోహన్

బస్టేషన్ : ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్ అన్నారు. పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో శుక్రవారం స్త్రీశక్తి పథక ప్రారంభోత్సవంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలుచేస్తోందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలందరూ ఆనందంగా ఉన్నారన్నారు.

అద్విక ఆస్తులెక్కడ?

(5వ పేజీ తరువాయి)

అందజేసింది. సిట్ ఏర్పాటు చేయడానికి ముందు సాగిన దర్యాప్తులో హైదరాబాద్‌లో అద్విక కిరణ్‌కు కొన్ని ఆస్తులు ఉన్నట్టు గుర్తించారు. వాటిపై ఎలాంటి క్రయవిక్రయాలు చేయరాదని ఇప్పటికే ఆయా అధికారులకు పోలీసులు నోటీసులు అందజేశారు. దర్యాప్తులో భాగంగా హైదరాబాద్‌లో ఉంటున్న సంస్థ ఎండీ తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్య సోదరులను పోలీసులు విచారణ చేశారు. ఆ సంస్థతో తమకు ఎలాంటి సంబంధం లేదని వారు చెప్పినట్టు తెలిసింది.

ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచేలా ఉప ఎన్నికలు: సీపీఐ

అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే చర్యలకు పాల్పడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల నిర్వహణ తీరే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. గతంలో వైసీపీ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇతరులెవరూ నామినేషన్లు వేయనీయకుండా ఎన్నికలను ఏకగ్రీవం చేయించారని, ఇప్పుడు టీడీపీ నాయకులు ఓట్లు వేయకుండా ప్రజలను అడ్డుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలోని దాసరి భవన్ వద్ద జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉంటే వారు చట్టాన్ని చేతిలోకి తీసుకుని ఎన్నికలు నిర్వహించడం సిగ్గుచేటని ఖండించారు.

సూపర్ సిక్స్ అమలే కూటమి లక్ష్యం : గద్దె

కృష్ణలంక, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు చంద్రబాబు చెప్పినట్లుగా సూపర్ సిక్స్ అమలులో భాగంగానే శుక్రవారం మహిళలకు స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. స్త్రీ శక్తి పథకం ప్రారంభానికి వెళ్తున్న సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు కృష్ణలంక వారధి వద్ద జాతీయ రహదారిపై ఎమ్మెల్యే గద్దె, 18, 20, 21 డివిజన్ల టీడీపీ నాయకులు విచ్చేశారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ, ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. నాయకులు వేముల దుర్గారావు, రామేశ్వరం, వీరుబాబు, బలగారి శ్రీను, గొరిపర్తి నామేశ్వరరావు, కొర్రా అప్పన్న, పగడాల వెంకటేశ్వరరెడ్డి, అమ్ములు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి సత్యానందం


ఎమ్మెల్యే గద్దె కార్యాలయంలో..


బహుమతి అందిస్తున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ విజయసారథి


వైద్యకళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఏడుకొండలరావు

మహనీయుల త్యాగాలు మరవొద్దు

● వాడవాడలా మువ్వన్నెల రెపరెపలు ● ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

పటమట, ఆగస్టు15 (ఆంధ్రజ్యోతి): ఎంతో మంది త్యాగాల ఫలితంగా నేడు స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, వారి త్యాగాలను ఎన్నటికీ మరువకూడదని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. అశోక్‌నగర్ ఎమ్మెల్యే కార్యాలయం ఆవరణలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముస్లిం పెద్ద అతావుర్ రెహ్మాన్ జాతీయ జెండాను ఆవిష్కరించగా మహాత్ముడి చిత్రపటానికి సీనియర్ సిటిజన్ కె.మల్లిఖార్జునరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొట్లూరి సాయిబాబు, ముమ్మనేని ప్రసాద్, సాయన బుజ్జి, షేక్ కరీం, పేరిపి ఈశ్వర్, చలసాని రమణ పాల్గొన్నారు.

● కాకాని ఆశయ సమితి అధ్యక్షుడు కాకాని తరుణ్ ఆధ్వర్యంలో కాకాని వెంకటరత్నం విగ్రహం వద్ద జాతీయ జెండాలు చేతబూని ఆయనకు ఘన నివాళి అర్పించారు. నాగేశ్వరరావు, జాస్తి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

● మదర్‌థెరిస్సా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు బోగినేని ధనశేఖర్ ఆధ్వర్యంలో అయ్యప్పనగర్ భాస్కర్ హోమ్స్ గేటెడ్ కమ్యూనిటీలో జి.రవికుమార్, ఎం.శ్రీనివాస్, శేఖర్, స్వరూప్, రెడ్డి, సోమశేఖర్, వెంకటేష్, వితీన్‌పాల్గొన్నారు.

భారతీనగర్: ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎ.కనకారావు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

●ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.విజయ సారథి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఘనంగా జరిగాయి.

● గుణదలలోని ఈఎస్ఐ రోడ్డులోని దాసరి వెంకట గిరిధర్‌కుమార్ అవంతి నగర పాలక పాఠశాలలో హెచ్ఎం మురళీకృష్ణ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఎస్ఎంసీ చైర్‌పర్సన్ రమాదేవి జెండాను ఆవిష్కరించారు.

●శ్రీరామచంద్ర నగర్ కాలనీలోని మెయిన్ రోడ్డులోని ప్రధాన సెంటర్ వద్ద కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో ఘనంగా నిర్వహించారు. కాలనీ సీనియర్ సిటిజన్ చేతుల మీదగా జెండాను ఆవిష్కరించారు.

●ఎన్టీఆర్ కాలనీలోని క్రీడా ప్రాంగణంలో కాలనీ అసోసియేషన్ అధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు జెండాను ఆవిష్కరించారు.

సిద్ధార్థ వైద్య కళాశాలలో

మాచవరం: సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ప్రిన్సిపాల్ ఏడుకొండలరావు జాతీయ జెండాను ఆవిష్కరించి, గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. డాక్టర్ ఆశా ప్రవీణ్, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ సత్యకిషోర్, ఫిజికల్ డైరెక్టర్ రాము తదితరులు పాల్గొన్నారు.

బెజవాడ బార్ అసోసియేషన్‌లో

విజయవాడ లీగల్: బెజవాడ బార్ అసోసియేషన్ ఆవరణలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ముందుగా బార్ అధ్యక్షుడు ఏకే బాషా జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో బార్ ప్రధాన కార్యదర్శి కేవీ రంగారావు, మెట్రో పాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానందం, ఇతర న్యాయమూర్తులు పాల్గొన్నారు.

లబ్బీపేట : ఏపీ ఎగ్జిబిషన్ ఆర్గనైజర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లబ్బీపేటలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు శివ, కోశాధికారి అచ్చయ్య, గోపి, జానకి రామయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

● 19వ డివిజన్‌లో గద్దె క్రాంతి కుమార్ పాల్గొని జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో షేక్ నాగుర్, ఫిరోజ్, భాగం సాయి ప్రసాద్, ఖలీల్ తదితరలు పాల్గొన్నారు.


ఎన్టీఆర్ కాలనీలోని క్రీడా ప్రాంగణంలో...


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీ కేశినేని చిన్ని

యువ ఆంధ్రా చాంపియన్‌షిప్-2025

పటమట స్టేడియంలో కబడ్డీ లీగ్ పోటీలు ప్రారంభం

విజయవాడ(స్పోర్ట్స్), ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న యువ ఆంధ్రా చాంపియన్‌షిప్-2025 కబడ్డీ లీగ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామీణ పేద క్రీడాకారుల ప్రతిభను వెలికితీసే ఉద్దేశ్యంతో ఈ లీగ్ ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందిస్తున్నట్లు తెలిపారు. క్రికెట్‌లో ఐపీఎల్ ఏవిధంగా విజయవంతమైందో రాష్ట్రస్థాయిలో జరిగే ఇటువంటి లీగ్‌లు కూడా విజయంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షురాలు కె.ప్రభావతి, కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్, ఎన్.అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భవన్‌లో వేడుకలు..

గురునానక్ కాలనీ, విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని జాతీయ పతాకాన్ని ఎగురవేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయకత్వంలో మహిళల కోసం స్త్రీశక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కానుకగా అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, బొప్పన భవ కుమార్, కోనేరు శ్రీధర్, గొట్టుముక్కల రఘురామ రాజు, మరుపిళ్ల తిరుమలేశ్వరరావు, ఎస్.సంజయ్ వర్మ, చెన్నుపాటి ఉషారాణి, షేక్ ఆషా, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత యోగా శిబిరం రేపటి నుంచి

భారతీనగర్: పతంజలి యోగా పీఠ్ హరిద్వార్ ఆధ్వర్యంలో గురునానక్ రోడ్లోని సాయిజ్యువెల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఉచిత యోగా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కావూరి అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం నుంచి 21వరకు ఉదయం 5.30నుంచి 7.30, సాయంత్రం 6నుంచి 7.30వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో అధికబరువు, షుగర్, బీపీ, థైరాయిడ్, నడుము నొప్పులు తదితర అనారోగ్య సమస్యలకు పరిష్కారం చూపుతామని, సంపూర్ణ ఆరోగ్యం కోసం శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల న్నారు. వివరాలకు 9603076511, 9603076699లో సంప్రదించాలని పేర్కొన్నారు.

మొగల్రాజపురం వీపీ సిద్ధార్థలో..


మాట్లాడుతున్న పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, సాంస్కృతిక ప్రదర్శన

మొగల్రాజపురం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : మొగల్రాజపురం వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన వేడుకలలో ఐపీఎస్ అధికారి దొనేపూడి విజయ్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. గౌరవ అతిథిగా సిద్ధార్థ అకాడమీ జాయింట్ సెక్రటరీ లలిత్ ప్రసాద్ , ఉపాధ్యక్షులు వెల్లంకి నాగభూషణ్‌రావు, గవర్నింగ్ బాడీ సభ్యులు లలిత తదితరులు మాట్లాడారు.

● సిద్ధార్థ నగర్ లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఫణి ప్రసాద్ ముక్తేవి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ సుధాప్రవీణ ముక్తేవి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● పీబీ సిద్ధార్థ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ జాతీయ జెండా ఆవిష్కరించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చుండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ జంపాల తదితరులు మాట్లాడారు. ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

మైనార్టీలకు అండగా ప్రభుత్వం : ఎంపీ కేశినేని చిన్ని

ఆటోనగర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మైనా ర్టీలకు అండగా ఉంటుందని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఆటోనగర్ మస్జీదే కౌసర్ ప్రాంగణంలో ముస్లింలతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రార్థనలు చేశారు. ఆయన మాట్లాడుతూ, విజయవాడలో మసీదుల ఆధునీకరణకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఫతావుల్లాహ్, కార్పొరేటర్ సాంబశివరావు, షాబాజ్, కలాం తదితరులు పాల్గొన్నారు.

ఐలాలో..



ఆటోనగర్‌లోని వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం వేడుకలు ఘనంగా జరిగాయి. వంద అడుగుల రోడ్డులో ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఐలా మాజీ అధ్యక్షుడు సుంకర దుర్గాప్రసాద్ జాతీయ జండాను ఆవిష్కరించారు. ఆటోమొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ భవనంలో ఎంఎస్ఎంఈ గౌరవాధ్యక్షుడు బాయన వెంకట్రావు, ఏపీఐఐసీ కార్యాలయం వద్ద డిప్యూటీ జెడ్ఎం రహీమ్, ఆటోనగర్ ఆర్టీసీ డిపో వద్ద డిపో మేనేజర్ కె.ప్రవీణ్‌కుమార్ జాతీయ జండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ కలాం, ఏటీఏ అధ్యక్షుడు రాజనాల వెంకట రమణారావు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో స్వాతంత్ర్య, కృష్ణాష్టమి వేడుకలు

ప్రసాదంపాడు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవ, కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. తొలుత జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్ జాతీయ జెండాను ఎగురువేశారు. ఉపాధ్యాయులు జాతీయగీతాలను ఆలపించారు. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా కృష్ణుడు, గోపికల వేషధారణతో విద్యార్థినీవిద్యార్థులు ఆహుతుల్ని ఆకట్టుకున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు ఉట్టి కొట్టి, కృష్ణ గీతాలు పాడుతూ పాఠశాల ఆవరనంత కృష్ణమయం చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పరిమి చంద్ దంపతులు, పాఠశాల డైరెక్టర్ కడియాల ప్రవీణ్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్ డేవిడ్‌రాజ్, ప్రిన్సిపాల్ ఎం.ఎస్.భవనేశ్వరన్, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్ కుమార్ భాటియా, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ


మాట్లాడుతున్న కొనకళ్ల నారాయణరావు

లబ్బీపేట, ఆగస్టు15 (ఆంధ్రజ్యోతి) : సహాయ కార్యక్రమాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా లయన్స్ క్లబ్ పనిచేయడం అభినందనీయమని మాజీ ఎంపీ, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 28వ క్యాబినెట్ ఇన్‌స్టలేషన్ కార్యక్రమం ఏ కన్వెన్షన్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సేవభావంతో లయన్ క్లబ్ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. లయన్స్ జిల్లా గవర్నర్‌గా ఎన్నికైన ఆంజనేయులు ఈ ఏడాది మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని కోరు తున్నానన్నారు.నూతనంగా ఎన్నికైన సభ్యులకు అభినందనలు తెలిపారు. అనంతరం జిల్లా గవర్నర్‌గా వీవీపీఎస్ ఆంజనేయులు ప్రమాణ స్వీకారంచేసి మాట్లాడుతూ, తోటివారికి సహాయం చేయడంలో నిజమైన ఆనందం ఉంటుందన్నారు. లయన్స్ ఆధ్వర్యంలో మీల్స్ ఆన్ వీల్స్ పేరుతో 365 రోజులు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ చిగురుపాటి వరప్రసాద్, లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ పర్వతనేని సుభాష్‌బాబు, చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు.. కుటుంబసభ్యుల చెంతకు

గుణదల, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): తల్లి నుంచి తప్పిపోయిన బాలుడిని పటమట పోలీసులు తండ్రి చెంతకు చేర్చారు. సింగ్‌నగర్‌లో నివాసం ఉంటున్న తొమ్మిదేళ్ల బాలుడు అదే ప్రాంతంలో కేర్‌అండ్‌షేర్ పాఠశాలలో చదువుకుంటున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి కాళేశ్వరరావు మార్కెట్‌కు తల్లితోపాటు వెళ్లాడు. తల్లి తనకు పని ఉందని, కుమారుడిని బస్సు ఎక్కి ఇంటికి వెళ్లిపొమ్మని చెప్పింది. దారి తెలియక బాలుడు సిటీ బస్సు ఎక్కి నిడమానూరులో దిగాడు. మెయిన్‌రోడ్డు మీద ఒంటరిగా డివైడర్ దాటుతుండటాన్ని అక్కడ సీఎం బందోబస్తులో ఉన్న హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరమ్మ బాలుడిని దగ్గరకు తీసుకుని ఆరాతీసింది. తండ్రి పేరు రాజు అని, సింగ్ నగర్, కేర్ అండ్‌షేర్ స్కూల్‌లో చదువుతున్నానని చెప్పాడు. కానిస్టేబుల్ బాలుడిని పటమట పోలీస్‌స్టేషన్‌కు పంపించారు. పటమట ఎస్సై దుర్గాదేవి పాఠశాలకు సమాచారం అందించి, పిల్లాడి తల్లిదండ్రులు చిరునామా తెలుసుకున్నారు. స్టేషన్‌కు పిలిపించి బాలుడిని అప్పగించారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో యూత్ రెడ్‌క్రాస్ సభ్యులు

మాచవరం:స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్రానికి చెందిన 64 మంది యూత్ రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నట్లు రెడ్‌క్రాస్ట్ కంటింజెంట్ ఆఫీసర్, ఎన్ఎస్ఎస్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ తెలిపారు. ఈనెల 6 నుంచి 15వ తేదీ వరకు విజయవాడలోని వివిధ కళాశాలలకు ఎస్ఆర్ఆర్, సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నర్సింగ్ కళాశాలల, నలంద, కేబీఎన్, విజయ్ ఇన్‌స్టిట్యూట్ టెక్నాలజీ ఫర్ ఉమెన్, వెస్టన్ కళాశాలలకు చెందిన 70 మంది రెడ్‌క్రాస్ట్ వలంటీర్లు ఈ పరేడ్‌లో పాల్గొన్నారన్నారు. సీఎం చంద్రబాబుకు గౌరవ వందనం చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ సమరం, వైస్ చైర్మన్ వెలగల జోషి, సెక్రటరీ చిట్టిబాబు పాల్గొన్నారు.

న్యాయవాదికి సత్కారం

విజయవాడ లీగల్: న్యాయవాదిగా 50 వసంతాలు పూర్తిచేసుకొన్న సందర్భంగా వి.గురునాథంను శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం రోజున దుర్గాపురం వాకర్స్ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. దుర్గాపురం వాకర్స్ క్లబ్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.కె.బాబు ముందుగా జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. వాకర్స్ సభ్యులు ఎన్.సత్యనారాయణ, ఎం.వి.కృష్ణారావు, కూనపరెడ్డి అనిల్‌కుమార్, మల్లంపల్లి సాంబశివరావు, దొడ్ల ఆంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ఇంద్రకీలాద్రిపై కృష్ణాష్టమి వేడుకలు

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో శనివారం శ్రావణ బహుళ అష్టమి సందర్భంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు శుక్రవారం ఈవో వి.కె.శీనా నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 8 గంటలకు ఆశీర్వచన మండపంలో శ్రీకృష్ణ భగవానుల పూజ, గోపూజ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సాయంత్రం పురాణ పండితులచే ఉపన్యాస కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం ఉట్టి కొట్టు కార్యక్రమం రాజగోపురం ముందు ఖాళీ ప్రదేశంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

నవ్య
కుటుంబ కదంబం

భోజనకుతూహలం

గడ్డల్ని కరిగించే కంద ఆకులు

సంస్కృతంలో కందకు 'సూరణం', 'వేరు వెల్లకి' అనే పేర్లు ఉన్నాయి. శూరుడిలా పోరాడేది కాబట్టి ఈ దుంపను సూరణం అంటారు. ఆయుర్వేద గ్రంథాల ప్రకారం- కడుపులో పెరిగే గడ్డలు, ఏలిక పాములపై ఇది పోరాడుతుంది. భౌగోళికంగా చూస్తే - కంద మొక్క దక్షిణాదివారి స్వంతం. ఉష్ణ ప్రాంతాల్లో ఎక్కువగా పెరిగే మొక్క ఇది! భారతదేశం మొత్తం మీద తెలుగు నేలపైన పెరిగే కందకు ప్రసిద్ధి ఎక్కువ. పూర్వం వానప్రస్థాశ్రమంలో కంద మూలాలు తింటూ జీవించేవారని చెప్పేవారు. కంద మూలాలంటే సాధారణ అర్థంలో దుంపకూరలని! కంద అనేది సంస్కృత పదం, దుంప అనేది తెలుగు. ఈ రకంగా చూస్తే కంద లాంటి దుంప కూరలు, ఇతర ఉడక బెట్టిన దుంపలు తింటారని అర్థం. ఇక కంద ఆకులు వెడల్పుగా పెద్దవిగా రెమ్మలురెమ్మలుగా ఉంటాయి. వీటిలో ఎ- విటమిన్, ప్రొటీన్లు, ఫైబర్ ఉంటాయి. ఇక కంద వల్ల కలిగే లాభాలేమిటో చూద్దాం..



- కంద ఆకులకు వేడి చేసే స్వభావం ఉంటుంది. అయితే ఈ స్వభావం వల్ల కంద ఆకులు శరీరంలోని ఉన్న దోషాలను పోగొడతాయి. కఫదోషం వల్ల కలిగే వ్యాధులు ఉన్నవారికి ఈ ఆకులను వండిపెట్టవచ్చు.
- ఒకప్పుడు బోదవ్యాధి ఎక్కువగా ఉండేది. ఆ సమస్య ఉన్నవారికి కంద మంచి ఔషధం.
- కంద కాడల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. అందు వల్ల ఇవి పొట్టను మృదువుగా చేస్తాయి.
- కంద ఆకులను ఈశాన్య రాష్ట్రాల్లో ఎక్కువగా తింటారు. అయితే లేత కంద ఆకులను తింటేనే మంచిది. ముదురు ఆకుల్లో ఆగ్జలైట్ క్రిస్టల్స్ ఎక్కువగా ఉంటాయి. ముదురు ఆకులను నేరుగా తింటే కిడ్నీలో రాళ్లు ఏర్పడతాయి. ఒకవేళ ముదురు ఆకులను తినాలనుకొనేవారు ఆకులను శుభ్రపరచి, సన్నగా తరిగి, మజ్జిగలో వేసి బాగా మెత్తపడేదాకా ఉడికిస్తే ఈ క్రిస్టల్స్ తొలగిపోతాయి.

• గంగరాజు అరుణాదేవి

మేకప్

తళుక్కున మెరవాలంటే...

ముఖ చర్మాన్ని కాన్వాస్‌గా మలిచి, అందంగా తీర్చిదిద్దడమే మేకప్. అందుకోసం కొంత ఓర్పు, నేర్పు అవసరమవుతాయి. నాణ్యమైన ఉత్పత్తులను ఎంచుకోవడం ఒక ఎత్తైతే, వాటిని తగుమాత్రంగా ముఖానికి అద్దుకోవడం మరొక ఎత్తు. మెరుపులీనే తారలా తళుక్కుమనడం కోసం ఇవిగో ఈ మేకప్ కిటుకులు పాటించండి.



షేపింగ్: ముఖం కోలగా మలచాలన్నా, గుండ్రంగా తీర్చిదిద్దాలన్నా అందుకు తగిన మేకప్ మెలకువలు అనుసరించాలి. షాడో, బ్రాంజ్, కాంపాక్ట్‌ల షేడ్‌లను ఆచితూచి ఎంచుకుని, అవసరమైన చోటే అద్దుకోవాలి. ముక్కును తీర్చిదిద్దే తీరు మీద ప్రత్యేక దృష్టి పెట్టాలి. అలాగే దవడలు, చెవుల దగ్గర డెప్త్‌ను ఏ మేరకు పెంచాలో అంచనా వేయాలి.

ముడతలు: నుదురు, పెదవులు, కళ్ల కింది ప్రదేశాల్లో ముడతలు దాచడం కోసం అవసరానికి మించి కన్‌సీలర్ ఉపయోగించకూడదు. సహజసిద్ధమైన లుక్‌ను సొంతం చేసుకోవడం కోసం కళ్ల కింద ఎరుపు రంగు షేడ్‌ను పలుచగా అద్దుకుని, దాని మీద ఫౌండేషన్ అప్లై చేసుకోవాలి. కన్‌సీలర్‌ను పలుచగా అద్దుకుని, ఫౌండేషన్‌లో కలిసిపోయేలా చూసుకోవాలి.

హైలైట్: ముఖంలో కనుబొమలు, పెదవులు... ఇలా ప్రతి ఒక్కరి ముఖంలో ఏదో ఒక ఆకట్టుకునే అంశం ఉంటుంది. కాబట్టి ఆ అంశాన్ని సెంటర్ ఆఫ్ అటెన్షన్‌గా చేసి, దానికి తగ్గట్టు ముఖాన్ని మలిచే ప్రయత్నం చేయాలి. ఆకర్షణీయమైన కళ్లు ఉన్నవారు బోల్డ్ లైనర్‌ను ఉపయోగించాలి. పౌట్‌ను గుర్తించడం కోసం ముదురు రంగు లిప్‌స్టిక్ ఎంచుకోవాలి.

లైట్‌గా మొదలు పెట్టి: మేకప్ ఉత్పత్తులను వీలైనంత తక్కువగా వాడడం అలవాటు చేసుకోవాలి. కొద్దిగా కన్‌సీలర్‌ను చర్మం మీద అప్లై చేసి బ్రష్‌తో బ్లెండ్ చేసుకోవాలి. ఇంకొద్దిగా అవసరం పడితే, మళ్లీ అప్లై చేసుకోవాలి. అలాగే కన్‌సీలర్‌ను అప్లై చేయడం కోసం డో ఫుట్ అప్లికేటర్‌ను ఉపయోగించాలి.

ఐ షాడో బ్రష్: కనురెప్పల మీద ముడతలు ఉంటే, ఫ్లాట్ బ్రష్‌కు బదులుగా ఫ్లఫ్ఫీగా ఉండే బ్రష్ వాడాలి. సన్నని మొన కలిగిన బ్రష్ వాడడం వల్ల షాడో, కనురెప్పల ముడతల్లో ఇరుక్కుపోయే ప్రమాదం ఉంటుంది. అలాగే చివర్లో క్రీజ్ బ్రష్‌తో అదనపు షాడోను తొలగించుకోవాలి.

పిల్లలు ఆలస్యంగా పడుకుంటున్నారా..?

పిల్లలు నిద్రకు ఉపక్రమించే సమయం, ఎన్ని గంటలు పడుకుంటున్నారనే అంశాలు వారి ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. పిల్లల శారీరక మానసిక ఎదుగుదలకు పోషకాహారంతోపాటు సరైన నిద్ర కూడా అత్యవసరమని నిపుణులు చెబుతున్నారు. పిల్లలు సమయానికి నిద్రపోవడం వల్ల కలిగే లాభాలు, ఆలస్యంగా పడుకోవడం వల్ల కలిగే నష్టాల గురించి తెలుసుకుందాం...



సమయానికి నిద్రిస్తే...

- పిల్లలు రోజూ సరైన సమయానికి నిద్రించడం వల్ల శారీరకంగా వారి ఎదుగుదల బాగుంటుంది. మెదడు చురుగ్గా పనిచేస్తుంది. నేర్చుకొనే సామర్థ్యం పెరుగుతుంది. హార్మోన్లు సమతుల్యంగా ఉంటాయి. తరచుగా ఒత్తిడికి గురికాకుండా భావోద్వేగాల పరంగా నియంత్రణలో ఉంటారు. ఆకలి పెరిగి చక్కగా ఆహారం తినగలుగుతారు. దీనివల్ల పిల్లల్లో రోగనిరోధక శక్తి పెంపొందుతుంది. ఎటువంటి వ్యాధులు రాకుండా పిల్లలు ఆరోగ్యంగా ఉంటారు.

ఆలస్యమైతే...

- నిద్ర సరిపోక కళ్లు, మెదడు అలసిపోతాయి. దీంతో పిల్లలు రోజంతా చిరాకుగా ప్రవర్తిస్తుంటారు. జీర్ణ సమస్యలు, ఆకలి లేకపోవడం, మలబద్ధకం లాంటివి ఎదురవుతాయి. కొంచెం పెద్ద పిల్లలకయితే ఏకాగ్రత కుదరదు. చదివిన అంశాలు గుర్తుండవు. పరీక్షలు సరిగా రాయలేక నిరాశ, ఆందోళనలకు గురవుతూ ఉంటారు. పిల్లలు ఆలస్యంగా పడుకుని, ఆలస్యంగా నిద్రలేస్తుంటే తల్లిదండ్రులు గమనించి ఆ అలవాటును మానిపించాలి.

ఏ సమయానికి పడుకోవాలంటే...

- చిన్న పిల్లలు రాత్రి ఎనిమిదింటికల్లా పడుకోవడం మంచిది. బడికి వెళ్లే పిల్లలు రాత్రి తొమ్మిది లోపు పడుకోవాలి. కనీసం ఎనిమిది నుంచి పది గంటలపాటు నిద్రించడం వారి ఆరోగ్యానికి మంచిది.

వంటిల్లు

కృష్ణునికి అటుకులు, పాలు, మీగడ, వెన్న అంటే ఇష్టమని మనందరికీ తెలుసు. కృష్ణాష్టమి రోజున వీటితో రకరకాల వంటకాలు తయారుచేసి కృష్ణునికి నివేదిస్తూ ఉంటాం. తక్కువ సమయంలో తేలికగా అటుకులతో తయారుచేసే రుచికరమైన నైవేద్యాల గురించి తెలుసుకుందాం...



• పాలు చిలకరించకుండా మరో నాలుగు చెంచాల నెయ్యి వేసి చేస్తే లడ్డూలు చాలా రోజుల వరకు నిల్వ ఉంటాయి.

అల్లరి కృష్ణునికి అటుకుల నైవేద్యం..!

అటుకుల లడ్డు

కావాల్సిన పదార్థాలు

అటుకులు- రెండు కప్పులు, నెయ్యి- అయిదు చెంచాలు, జీడిపప్పు పలుకులు- కొన్ని, బాదం పలుకులు- కొన్ని, ఎండు కొబ్బరిపొడి- రెండు చెంచాలు, యాలకులు- మూడు, తురిమిన బెల్లం- ముప్పావు కప్పు, కాచి చల్లార్చిన పాలు- మూడు చెంచాలు

తయారీ విధానం

- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో అటుకులు వేసి దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి. వాటిని చల్లార్చాలి. స్టవ్ మీద పాన్ పెట్టి రెండు చెంచాల నెయ్యి వేసి వేడిచేయాలి. అందులో జీడిపప్పు పలుకులు, బాదం పలుకులు వేసి ఎర్రగా వేయించాలి. తరవాత ఎండు కొబ్బరి పొడి వేసి బాగా కలిపి స్టవ్ మీద నుంచి దించాలి.
- మిక్సీలో చల్లారిన అటుకులు, యాలకులు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. తరవాత బెల్లం తురుము వేసి మరోసారి గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని జీడిపప్పు-బాదం పలుకుల మిశ్రమంలో వేసి బాగా కలపాలి. అందులో మూడు చెంచాల నెయ్యి వేసి కొద్దికొద్దిగా పాలు చిలకరిస్తూ ముద్దలా కలపాలి. ఈ మిశ్రమాన్ని చేత్తో కొద్దికొద్దిగా తీసుకుంటూ లడ్డూలు చుట్టుకోవాలి. అంతే..! కృష్ణునికి ఎంతో ఇష్టమైన అటుకుల లడ్డు రెడీ..!

• అటుకులను చిన్న మంట మీద నెమ్మదిగా వేయించుకోవాలి. లేదంటే తొందరగా మాడిపోతాయి.

అటుకులు పెసరపప్పు పాయసం

కావాల్సిన పదార్థాలు

అటుకులు- ఒక కప్పు, పెసరపప్పు- అర కప్పు, బెల్లం- ఒకటింబావు కప్పులు, నెయ్యి- నాలుగు చెంచాలు, కాచి చల్లార్చిన పాలు- మూడు కప్పులు, యాలకుల పొడి- అర చెంచా, కొబ్బరి ముక్కలు- కొన్ని, జీడిపప్పు పలుకులు- కొన్ని, బాదం పప్పులు- కొన్ని, కిస్‌మిస్‌లు- కొన్ని, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో పెసరపప్పు వేసి దోరగా వేయించి మరో గిన్నెలోకి తీయాలి. అందులో నీళ్లు పోసి పెసరపప్పును రెండుసార్లు కడగాలి. తరువాత రెండు కప్పుల నీళ్లు పోసి పావుగంటసేపు నానబెట్టాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో బెల్లం వేసి పావుకప్పు నీళ్లు పోయాలి. బెల్లం పూర్తిగా కరిగిన తరవాత స్టవ్ మీద నుంచి దించి మరో గిన్నెలోకి వడబోయాలి. స్టవ్ మీద పాన్ పెట్టి మూడు చెంచాల నెయ్యి వేసి వేడిచేయాలి. అందులో కొబ్బరి ముక్కలు, జీడిపప్పు పలుకులు, బాదం పప్పులు, కిస్‌మిస్‌లు వేసి ఎర్రగా వేపి పళ్లెంలోకి తీసుకోవాలి. తరువాత అటుకులు వేసి, దోరగా వేయించి మరో పళ్లెంలోకి తీయాలి. అదే గిన్నెలో నానబెట్టిన పెసరపప్పును నీళ్లతో సహా వేసి ఉడికించాలి. మధ్యలో ఒక చెంచా నెయ్యి వేసి కలపాలి. పెసరపప్పు మెత్తగా ఉడికిన తరువాత వేయించిన అటుకులు వేసి కలపాలి. రెండు నిమిషాల తరువాత పాలు పోసి కలపాలి. ఈ మిశ్రమాన్ని అయిదు నిమిషాలు ఉడికించి స్టవ్ మీద నుంచి దించాలి. తరవాత బెల్లం నీళ్లు పోసి కలపాలి. మళ్లీ గిన్నెను స్టవ్ మీద పెట్టి రెండు నిమిషాలు మిశ్రమాన్ని ఉడికించాలి. అదే సమయంలో... వేయించి పెట్టుకున్న కొబ్బరిముక్కలు, జీడిపప్పు, బాదం పప్పులు, కిస్‌మిస్‌లతోపాటు యాలకుల పొడి వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. అంతే! కమ్మని అటుకులు-పెసరపప్పు పాయసం నైవేద్యానికి రెడీ!



• పాయసాన్ని జారుగా ఉన్నప్పుడే స్టవ్ మీద నుంచి దించాలి. అది చల్లారిన తరవాత కొద్దిగా గట్టిపడుతుంది.

• బెల్లం నీళ్లు పూర్తిగా చల్లారిన తరవాతనే పాలు-అటుకులు-పెసరపప్పు మిశ్రమంలో కలపాలి. లేదంటే పాలు విరిగిపోవచ్చు.

- అటుకుల్లో ఎ, బి, సి, కె విటమిన్లతోపాటు ప్రొటీన్లు, పిండిపదార్థాలు, ఐరన్, పీచుపదార్థాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అటుకులను తరచూ తినడం వల్ల నీరసం తగ్గుతుంది. రక్తహీనత, జీర్ణ సమస్యలు, గుండె జబ్బులు దరిచేరవు. రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటుంది. మెదడు చురుకుగా పనిచేస్తుంది. అటుకుల్లో క్యాలరీలు, కొవ్వులు ఉండవు కాబట్టి ఎక్కువగా తిన్నప్పటికీ శరీరం బరువు పెరగదు. ఇవి త్వరగా జీర్ణమవుతాయి. అందుకే అటుకులను పిల్లలు, వృద్ధులు, గర్భిణులకు బలవర్థకమైన ఆహారంగా నిపుణులు సూచిస్తున్నారు.

సంకల్పం

నాట్యం... పరవశం

మూడు గంటలు భరతనాట్యం... మధ్యలో పావుగంట విరామం...
అలా ఏకధాటిగా 170 గంటల ప్రదర్శన..! సాధ్యమేనా..? అందరిదీ ఇదే సందేహం.
కానీ... అసాధ్యమనుకున్నది సుసాధ్యం చేసి చూపించింది ఇరవయ్యేళ్ల రెమోనా ఎవెట్టే పెరీరా.
అమ్మ అండతో... స్నేహితులు, సన్నిహితుల ప్రోత్సాహంతో... ఈ మెగా ఫీట్‌ను దిగ్విజయంగా ముగించి...
'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించిన రెమోనా కథ ఇది.





"మాటల్లో చెప్పలేని భావాలను నాట్యంతో వ్యక్తీకరించవచ్చు. సంప్రదాయ నృత్యంలోని గొప్పదనం అదే. కాళ్లకు గజ్జె కట్టి, శరీరం లయబద్ధంగా కదులుతున్నప్పుడు నన్ను నేను మరిచిపోతాను. నర్తిస్తున్నంతసేపూ ఏదో తెలియని పరవశానికి లోనవుతాను. నేను అమితంగా ఇష్టపడింది, తొలిసారి ప్రేమలో పడింది భరతనాట్యంతోనే. కర్ణాటక రాష్ట్రం మంగళూరు నగరం మాది. ఊహ తెలియనప్పుడే మా అమ్మ నన్ను తీసుకువెళ్లి భరతనాట్యం గురువుకు అప్పగించింది. ఇక అప్పటి నుంచీ నాకు అదే లోకం అయిపోయింది. దీని వెనుక ఒక చిన్న కథ ఉంది. సంప్రదాయ నృత్యం అభ్యసించాలని మా అమ్మ ఎన్నో కలలు కన్నది. కానీ సామాజిక కట్టుబాట్ల పేరుతో ఇంట్లోవాళ్లు అనుమతించలేదుట. అందుకే నాకు కళలు నేర్పించాలని నిర్ణయించుకుంది. కానీ భరతనాట్యం వైపు వెళ్లమని తను నన్ను బలవంతం పెట్టలేదు. దీంతోపాటు పెయింటింగ్, ఇతర నాట్య రీతులు కూడా ఆరంభంలో సాధన చేశాను. అయితే ఎందుకో తెలియదు... అన్నిటికంటే నన్ను భరతనాట్యమే అమితంగా ఆకర్షించింది.

ఆలోచన అలా వచ్చింది...

ఆరంభం నుంచీ మా గురువు శ్రీవిద్య మురళీధర్ గారి దగ్గరే నాట్యం అభ్యసిస్తున్నాను. భరతనాట్యం నాకు ఒక సంప్రదాయ నృత్య సాధన మాత్రమే కాదు... భావోద్వేగాల బంధం. ఆధ్యాత్మిక అనుబంధం. నేను వేరు, నాట్యం వేరు కాదు. ప్రస్తుతం నేను బీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నా. విద్య ఎంత ముఖ్యమో కళ కూడా అంతే ముఖ్యం. అందులో ఎప్పుడూ ఏదో కొత్తగా చేయాలని తపిస్తుంటాను. అలా ఒక రోజు ఇన్‌స్టాగ్రామ్ చూస్తుంటే... 'డ్యాన్స్ మారథాన్' అని కనిపించింది. అలాంటిది ఒకటి ఉంటుందని కూడా అప్పటివరకు నాకు తెలియదు. ఆశ్చర్యం కలిగింది. నన్ను బాగా ఆకర్షించింది. 'నేను ఎందుకు ప్రయత్నించకూడదు' అనిపించింది.

అనుకున్నది 24 గంటలే... కానీ...

ఎప్పుడైతే ఆలోచన వచ్చిందో వెంటనే కార్యరంగంలోకి దిగాను. డ్యాన్స్ మారథాన్‌కు సంబంధించిన అప్లికేషన్ మా కాలేజీవాళ్లు తెప్పించారు. ముందుగా అనుకున్నది 24 గంటల మారథాన్. కానీ అప్లికేషన్ నింపుతుంటే... 170 గంటలు చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన వచ్చింది. ఆ సంఖ్య నా మదికి ఎలా తట్టిందో తెలియదు. దరఖాస్తులో రాసే ముందు అమ్మకు చెప్పాను. తను అవాక్కయింది. కాసేపటికి తేరుకొని... 'అంటే ఎన్ని రోజులు' అని అడిగింది. 'సుమారుగా ఏడు రోజుల రెండు గంటలు' అన్నాను. ఆశ్చర్యంగా నా వైపు చూస్తూ... 'నిజంగానే చేద్దామనుకొంటున్నావా' అంటే... 'అవును' అని బదులిచ్చాను. మరో ఆలోచన లేకుండా... 'అయితే నా మద్దతు నీకు ఉంటుంది' అంది అమ్మ.

ప్రత్యేక సన్నాహకాలు లేకుండానే...

ఈవెంట్‌కు కొన్ని వారాల ముందే 170 గంటలు నాన్‌స్టాప్‌గా భరతనాట్య ప్రదర్శన ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. దాంతో సన్నాహకాలకు ఎక్కువ సమయం లేకుండా పోయింది. అయితే నా మనసులో ఒకటే అనుకున్నా... 'వారం రోజుల పాటు నిద్ర ఉండదు. కనుక దానికి ముందు బాగా నిద్ర పోవాలి' అని. ఈ మారథాన్ కోసం నేను సన్నద్ధమైంది ఏదైనా ఉందంటే... అది కంటి నిండా కునుకు తీయడమే. చివరకు ఈవెంట్ రోజు, అంటే జూలై 21 వచ్చేసింది. ప్రదర్శన మొదలుపెట్టాను. మా కాలేజీ ఆడిటోరియంలోనే. నాకు తెలుసు... మొదటిరోజు హాయిగానే సాగిపోతుందని. మూడో రోజు నుంచి కష్టపడాల్సి వస్తుందని అనుకున్నా. కానీ నా అంచనాలు తలకిందులు అయ్యాయి. తొలి రోజే ఆపేద్దామనుకున్నా. అమ్మ 'నువ్వు చేయగలవు' అని ఆత్మవిశ్వాసం నింపింది. ఆడిటోరియంలో నా స్నేహితులు, స్థానికులు, అధ్యాపకులు... అందరూ నాకు అండగా నిలిచారు. నాకు నిద్ర వచ్చినప్పుడల్లా... చప్పట్లు కొడుతూ, ఈలలు వేస్తూ ఉత్సాహపరిచారు. మూడు గంటల నాట్యం... మధ్యలో పావుగంట విరామం. ఎక్కువగా అరటి, ఆపిల్, జామపండ్లు, కొబ్బరి నీళ్లతోనే సరిపెట్టుకున్నా. నిద్ర మరీ ముంచుకొస్తే ఒకటి రెండు సిప్‌లు కాఫీ. రాత్రి అయ్యేసరికి విపరీతమైన వెన్ను, కాళ్ల నొప్పులు. తట్టుకోలేక కళ్లల్లో నీళ్లు తిరిగేవి. అన్నిటి కంటే పెద్ద సవాలు... నిద్ర ఆపుకోవడం. అన్నిటినీ భరించాను. అందరి సహకారంతో జూలై 28న విజయవంతంగా మారథాన్ ముగించాను.

అమ్మ లేకపోతే నేను లేను...

నా జీవితంలోనే కాదు... నా ఈ నాట్య ప్రయాణంలోనూ మా అమ్మ పాత్ర ప్రముఖమైనది. వెల కట్టలేనిది. నా ప్రతి దశలో తోడై, అడుగడుగునా ప్రోత్సహిస్తూ వస్తోంది. అంతేకాదు... నాట్య ప్రదర్శనకు అవసరమైన దుస్తులు తనే డిజైన్ చేసి, కుడుతుంది. అమ్మ నా నిశ్శబ్ద భాగస్వామి. నన్ను నలుగురిలో గొప్పగా నిలబెట్టడానికి అహర్నిశలూ కష్టపడుతుంది. తను లేకపోతే నేను లేను. నా మారథాన్ సమయంలో అమ్మ కూడా నిద్ర పోలేదు. సరిగ్గా తినలేదు. నిరంతరం నన్ను అంటిపెట్టుకొనే ఉంది.

సరికొత్త రికార్డు...

నా ప్రదర్శన 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో నమోదైంది. ఇది నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. రికార్డు నెలకొల్పాననే ఆనందం కన్నా... అంత పెద్ద లక్ష్యాన్ని దిగ్విజయంగా పూర్తి చేయగలిగాననేదే నాకు ఎక్కువ సంతృప్తిని ఇస్తోంది. జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం నాకు ఇదే మొదటిసారి కాదు. గతంలో పిల్లలకు ఇచ్చే అత్యున్నత అవార్డు... 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్'ను నరేంద్ర మోదీ చేతుల మీదుగా అందుకున్నాను. నేను ఎక్కడ ఉంటే అక్కడ భరతనాట్యం ఉండేలా కృషి చేస్తాను. ప్రస్తుతం ట్రాన్స్‌జెండర్స్, పిల్లలకు నృత్యం నేర్పిస్తున్నాను. భరతనాట్యంలో పీహెచ్‌డీ చేయాలనేది నా కల. తద్వారా ఈ కళారూపాన్ని మరింత లోతుగా అర్థం చేసుకొనే అకాశం లభిస్తుంది కదా."

వ్యక్తిగత గౌరవం పెరిగేలా...

మనం వ్యక్తిగతంగా ఎదగడానికి మన అలవాట్లే దోహదం చేస్తాయి. ఒక్కోసారి తెలిసీ తెలియక చేసే పొరబాట్లు నలుగురిలో నగుబాటుకి గురిచేస్తూ ఉంటాయి. అలాకాకుండా సమాజంలో ఉన్నతంగా నిలవాలంటే ఏవిధంగా మెలగాలో తెలుసుకుందాం...

- కొంతమంది వ్యక్తిగతమైన ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తూ ఉంటారు. గంట గంటకూ కామెంట్లు, లైక్‌లు చూస్తూ ఉంటారు. అనుకున్నట్లు జరిగితే సంతోషమే. కానీ అలా కానిపక్షంలో భావోద్వేగాల మీద నియంత్రణ కోల్పోతూ ఉంటారు. దీనివల్ల మానసికంగా అశాంతి, అసహనం, కోపం పెరుగుతాయి. ఇవి వ్యక్తిగత గౌరవాన్ని ప్రభావితం చేస్తాయి. అందుకే సామాజిక మాధ్యమాల్లో గడపడాన్ని తగ్గించుకోవాలి.
- కొంతమంది ఎప్పుడూ ఎదుటివారిలో తప్పులు వెతుకుతూ ఉంటారు. చిన్న చిన్న అంశాలనే పెద్దవిగా చేసి అనవసరమైన గందరగోళం సృష్టిస్తూ ఉంటారు. అలాకాకుండా తప్పు అనిపించిన అంశాన్ని నేరుగా మృదువుగా చెప్పడం మంచిది. దీనివల్ల నలుగురిలో సానుకూలంగా వ్యవహరించడం అలవడుతుంది.



- వాయిదా వేసే ధోరణి చాలామందిలో కనిపిస్తూ ఉంటుంది. మీటింగ్ లేదా ఫంక్షన్‌కి వస్తానని చెప్పి ఆఖరు నిమిషంలో రానని చెప్పడం, చేయాల్సిన పనులను ఎప్పటికప్పుడు వాయిదా వేయడం లాంటివి వ్యక్తిగత గౌరవాన్ని తగ్గిస్తాయి. కాలయాపన చేయకుండా క్రమశిక్షణతో మెలగడం అలవాటు చేసుకోవాలి.

అంకితకు స్వర్ణం



న్యూఢిల్లీ: ఒలింపియన్ అంకితా ధ్యాని అంతర్జాతీయ వేదికపై పతకంతో సత్తా చాటింది. ఇజ్రాయెల్‌లోని జెరూసలెంలో జరిగిన గ్రాండ్ స్లామ్ అథ్లెటిక్స్ మీట్‌లో మహిళల 2000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో అంకిత స్వర్ణం సాధించింది. ఫైనల్స్‌లో అంకిత 6 నిమిషాల 12.92 సెకన్లలో గమ్యాన్ని అధిగమించి విజేతగా నిలిచింది. ఈ క్రమంలో భారత్ తరఫున గతంలో పారుల్ చౌదరి నెలకొల్పిన 6 నిమిషాల 14.38 సెకన్ల జాతీయ రికార్డును అంకిత బద్దలు కొట్టింది.

సౌరభ్ సూపర్

ఏపీఎల్‌లో బుల్స్‌పై వారియర్స్ గెలుపు



సౌరభ్ (4-0-7-4)

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-4 టోర్నీలో భాగంగా శుక్రవారం ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగిన రెండో మ్యాచ్‌లో తుంగభద్ర వారియర్స్ 13 పరుగుల తేడాతో భీమవరం బుల్స్‌పై గెలిచింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 18 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన తుంగభద్ర వారియర్స్ జట్టు నిర్ణీత 18 ఓవర్లలో 6 వికెట్లకు 151 పరుగులు చేసింది. కెప్టెన్ మహీప్ కుమార్ (41), ప్రశాంత్ (40), ఓపెనర్ జ్ఞానేశ్వర్ (24), గుత్తా రోహిత్ (24) రాణించారు. బుల్స్ బౌలర్లలో నారాయణరాజుకు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో వారియర్స్ బౌలర్ సౌరభ్ కుమార్ (4-0-7-4) ధాటికి భీమవరం బుల్స్ జట్టు 18 ఓవర్లలో 138/8 స్కోరుకే పరిమితమైంది. మిడిల్ ఆర్డర్ ఆటగాడు శ్రవణ్ (76 నాటౌట్) అజేయ అర్ధ సెంచరీతో సత్తా చాటినా ఫలితం లేకపోయింది. శాత్విక్ (43) ఫర్వాలేదనిపించాడు. వీరిద్దరు మినహా మిగిలిన ఆటగాళ్లంతా సింగిల్ డిజిట్‌కే వెనుదిరిగారు. కేవీ శశికాంత్, స్టీఫెన్ చెరో రెండు వికెట్లు తీశారు. అంతకుముందు రాయల్స్ ఆఫ్ రాయలసీమ, సింహాద్రి వైజాగ్ లయన్స్ జట్ల మధ్య మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది.

నవతరం రాకెట్లు

పారుపల్లి కశ్యప్, కిడాంబి శ్రీకాంత్, పీవీ సింధు తర్వాత ప్రపంచ బ్యాడ్మింటన్ యవనికపై తెలుగు షట్లర్ల జోరు కొంత మేర తగ్గింది. నవతరం ఆటగాళ్ల రాక కోసం ఎదురుచూస్తున్న అభిమానుల ఆకాంక్షల్ని నిజం చేస్తూ మన్నేపల్లి తరుణ్, కలగొట్ల వెన్నెల ఇప్పుడు తెరపైకొచ్చారు. వీరు జాతీయ పోటీల్లోనే కాకుండా అంతర్జాతీయ టోర్నీల్లోనూ తమ ఉనికిని బలంగా చాటే దిశగా దూసుకెళ్తున్నారు.



తరుణ్

మన్నేపల్లి తరుణ్ చౌదరి.. ఖమ్మం జిల్లాకు చెందిన 23 ఏళ్ల ఈ కుర్రాడు ఇటీవల మకావు ఓపెన్‌లో టాప్‌సీడ్, ప్రపంచ 13వ ర్యాంకర్ లీ చెయుక్ యియు (హాంకాంగ్)ను ఓడించి అందరి దృష్టినీ ఆకర్షించాడు. కబడ్డీ క్రీడాకారుడైన తాతయ్య రంగారావు ప్రోత్సాహంతో ఎనిమిదేళ్ల ప్రాయంలో తరుణ్ రాకెట్ పట్టుకున్నాడు. సుధాకర్ రెడ్డి శిక్షణలో బ్యాడ్మింటన్ ఓనమాలు నేర్చుకున్న తరుణ్ రెండేళ్లు తిరిగేసరికి జిల్లా స్థాయిలో సింగిల్స్‌లో రన్నరప్, డబుల్స్‌లో విజేతగా నిలిచాడు. అక్కడ నుంచి అతను వెనుదిరిగి చూడలేదు. మెరుగైన శిక్షణ కోసం హైదరాబాద్‌కు మకాం మార్చిన తరుణ్ కొద్ది రోజులు శాట్ కోచ్ ఫణి కిశోర్ దగ్గర శిక్షణ తీసుకున్నాడు. ఆ తర్వాత పుల్లెల గోపీచంద్ అకాడమీలో చేరి మరింత రాటు దేలాడు.

ఆర్థిక అండ అవసరం..

మూడేళ్ల క్రితం వరకు స్పాన్సరర్లు లేకపోవడంతో తరుణ్ ఎక్కువ అంతర్జాతీయ టోర్నీలు ఆడలేకపోయాడు. ఇది అతడి అంతర్జాతీయ ర్యాంకింగ్‌పై ప్రభావం చూపింది. నాన్న సతీష్ కష్టంపైనే ఆధారపడాల్సి వచ్చిందని తరుణ్ తెలిపాడు. ప్రస్తుతం గోపీసార్, పలు సంస్థల సహకారంతో కొన్ని స్పాన్సర్‌షిప్‌లు దక్కాయన్నాడు. కానీ, తనలాంటి వర్ధమాన ఆటగాళ్లకు ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తే కచ్చితంగా ఒలింపిక్స్‌లో పతకం సాధిస్తానని తరుణ్ ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తున్నాడు.

ఇక్కడ చేరాక..: గోపీచంద్ అకాడమీలోని అధునాతన సదుపాయాలు, క్రమశిక్షణతో కూడిన శిక్షణ.. అన్నింటికీ మించి కోచ్‌లు గోపీ, గురుసాయిదత్, పారుపల్లి కశ్యప్‌ల ప్రోత్సాహంతో తరుణ్ కెరీర్ మలుపు తిరిగింది. 2020 నుంచి గోపీచంద్ అకాడమీలో సాధన చేస్తున్న తరుణ్ ఈ నాలుగేళ్లలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు తగ్గట్టు తనను తాను మల్చుకున్నాడు. గత ఏడాది పురుషుల సింగిల్స్‌లో భారత్ నెంబర్ వన్‌గా ఎదిగిన తరుణ్ ప్రస్తుతం వరల్డ్ టాప్-40లో స్థానం సంపాదించాడు.



వెన్నెల

రైజింగ్ స్టార్

కలగొట్ల వెన్నెల.. సికింద్రాబాద్‌కు చెందిన ఈ రైజింగ్ స్టార్ ఇటీవలే ఇండోనేసియా వేదికగా జరిగిన ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం సాధించింది. దీంతో 13 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈ టోర్నీలో భారత్‌కు పతకం అందించి రికార్డు సృష్టించింది. అంతేకాదు, పీవీ సింధు తర్వాత ఈ పతకం కైవసం చేసుకున్న భారత మహిళా షట్లర్‌గానూ ఘనత వహించింది. 5 అడుగుల 8 అంగుళాలున్న వెన్నెల గత మూడేళ్లుగా జాతీయ స్థాయిలో అదరగొడుతోంది. వచ్చే నెలలో జరిగే వరల్డ్ జూనియర్ చాంపియన్‌షిప్‌నకు కూడా అర్హత సాధించింది. బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడైన నాన్న శ్రీనివాస్‌రెడ్డి ప్రేరణతో బ్యాడ్మింటన్‌ను కెరీర్‌గా మలుచుకున్న 17 ఏళ్ల వెన్నెల.. క్రీడల్లో తండ్రి చేరలేకపోయిన ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు అడుగులు వేస్తోంది. ఎనిమిదేళ్ల ప్రాయంలో కోచ్ గోవర్ధన్ వద్ద బ్యాడ్మింటన్‌లో ఓనమాలు నేర్చుకున్న వెన్నెల.. 2019 నుంచి గోపీచంద్ అకాడమీలో శిక్షణ తీసుకుంటోంది. కెరీర్ ప్రారంభంలో డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ ఆడిన వెన్నెల ఇప్పుడు సింగిల్స్‌పైనే పూర్తిగా దృష్టి సారించింది. పటిష్ఠమైన డిఫెన్స్, బలమైన స్మాష్‌లు, బ్యాక్‌హ్యాండ్ షాట్స్‌తో కోర్టులో వెన్నెల చిరుతలా కదలాడుతుంది. గత నెలలో జరిగిన ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టోర్నీ సింగిల్స్‌లో మూడో స్థానంలో నిలిచిన వెన్నెల, జూనియర్ విభాగం సింగిల్స్‌లో రన్నరప్, డబుల్స్‌లో టైటిల్ కైవసం చేసుకుంది. ప్రస్తుతం జూనియర్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో 33వ స్థానంలో ఉన్న ఈ యువ షట్లర్.. భవిష్యత్‌లో పెద్ద టోర్నమెంట్లలో సత్తా చాటేందుకు సిద్ధమవుతోంది.

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి-హైదరాబాద్)

ఆ ముగ్గురు అదరగొట్టారు

యాస్తిక, రాధ, తనూజ హాఫ్ సెంచరీలు

భారత మహిళలదే వన్డే సిరీస్



యాస్తిక భాటియా (66)

రాధా యాదవ్ (60)



తనూజా కన్వర్ (50)

బ్రిస్బేన్: ఓపెనర్ యాస్తిక భాటియా (66), కెప్టెన్ రాధా యాదవ్ (60), తనూజా కన్వర్ (50) అర్ధ సెంచరీలతో మెరవడంతో ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో వన్డే సిరీస్‌ను భారత్ 'ఎ' టీమ్ మరో మ్యాచ్ మిగిలుండగానే కైవసం చేసుకుంది. శుక్రవారం ఇక్కడ ఉత్కంఠగా జరిగిన రెండో మ్యాచ్‌లో 2 వికెట్లతో ఆతిథ్య జట్టును ఓడించింది. మొదట ఆసీస్ 50 ఓవర్లలో 265/9 స్కోరు చేసింది. అలీసా హీలీ (91), కిమ్ గార్త్ (41 నాటౌట్) రాణించారు. స్పిన్నర్ మిన్ను మణి 3, పేసర్ సైమా ఠాకూర్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం భారత్ 'ఎ' 49.5 ఓవర్లలో 266/8 స్కోరు చేసి గెలిచింది. ప్రేమా రావత్ (32 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడింది. ఎడ్గర్, హేవార్డ్, జార్జియా తలా 2 వికెట్లు తీశారు. ఛేదనలో 83/4తో ఇబ్బందుల్లో పడిన దశలో రాధ, యాస్తిక ఐదో వికెట్‌కు 68 పరుగులు జోడించి పరిస్థితి చక్కదిద్దారు. వీరిద్దరి నిష్క్రమణ తర్వాత ఓ దశలో మనోళ్లు 193/7 స్కోరుతో ఉండడంతో ఓటమి తప్పదేమోననిపించింది. అయితే తనూజ, ప్రేమ ఒత్తిడిని అధిగమించి ఎనిమిదో వికెట్‌కు 68 రన్స్ జోడించడం ద్వారా జట్టును విజయ తీరాలకు చేర్చారు.

సంక్షిప్తస్కోర్లు

ఆస్ట్రేలియా 'ఎ': 50 ఓవర్లలో 265/9 (అలీసా 91, గార్త్ 41 నాటౌట్, మిన్ను మణి 3/46, సైమా ఠాకూర్ 2/30).

భారత్ 'ఎ': 49.5 ఓవర్లలో 266/8 (యాస్తిక 66, రాధ 60, తనూజా 50, ప్రేమ 32 నాటౌట్, అమీ 2/55, ఎలా హేవార్డ్ 2/57, జార్జియా 2/68).



మీ వల్లే సంతోషంగా ఉన్నాం..

క్రీడా దిగ్గజాల స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

న్యూఢిల్లీ: భారత 79వ స్వాతంత్ర్య దిన వేడుకల్లో భాగంగా దేశ ప్రజలకు క్రీడా ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. 'ఈరోజు మేం సంతోషంగా, స్వేచ్ఛగా ఉంటున్నామంటే సరిహద్దులో మీరు అత్యంత ధైర్య సాహసాలతో నిలబడడమే కారణం. స్వాతంత్ర్య దినోత్సవం రోజున మన హీరోలకు సెల్యూట్ చేద్దాం' అంటూ విరాట్ కోహ్లీ ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు. 'హ్యాపీ ఇండిపెండెన్స్ డే. జైహింద్' అని ట్వీట్ చేసిన సచిన్ టెండూల్కర్ జెండాతో ఉన్న ఫొటోను పోస్ట్ చేశాడు. రోహిత్, సెహ్వాగ్, మిథాలీలతో పాటు ఇతర క్రికెటర్లు తమ స్పందనను తెలిపారు. మరోవైపు స్టార్ షూటర్ మను భాకర్ వయోలిన్‌పై జాతీయ గీతాన్ని స్వరపరిచి ఆకట్టుకుంది.

ఆరో స్థానంలో గుకేష్

సెయింట్ లూయిస్ (యూఎస్ఏ): వరల్డ్ చెస్ టూర్‌లో భాగంగా జరుగుతున్న సెయింట్ లూయిస్ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ టోర్నీలో ప్రపంచ చాంపియన్ గుకేష్ ఆరో స్థానానికి దిగజారాడు. బ్లిట్జ్‌లో తొలి తొమ్మిది రౌండ్లలో గుకేష్ ఒక విజయం సాధించి, నాలుగు గేమ్‌లు డ్రాగా ముగించాడు. దాంతో మొత్తం 13 పాయింట్లతో వియత్నాం గ్రాండ్‌మాస్టర్ లీమ్ లేతో కలిసి గుకేష్ సంయుక్తంగా ఆరో స్థానంలో నిలిచాడు.

భారత్‌లో మెస్సీ పర్యటన ఖరారు



కోల్‌కతా: అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ భారత పర్యటన అధికారికంగా ఖరారైంది. నాలుగు రోజుల ఈ పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రమోటర్లు శుక్రవారం వెల్లడించారు.

డిసెంబరు 12: రాత్రికి కోల్‌కతా చేరుకోనున్న మెస్సీ.

డిసెంబరు 13: ఉదయం 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమం. అనంతరం మెస్సీ విగ్రహావిష్కరణ. సాల్ట్‌లేక్ లేదా ఈడెన్ గార్డెన్స్‌లో గోట్ కన్సర్ట్, గోట్ కప్. మెస్సీ కుడ్య చిత్రాన్ని (25 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పు) గోట్ కన్సర్ట్ సందర్భంగా అతడికి ప్రదానం చేస్తారు. ఈడెన్ గార్డెన్స్‌లో గంగూలీ, లియాండర్ పేస్, బైచుంగ్ భూటియా, జాన్ అబ్రహంతో కూడిన జట్టుతో కలిసి మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడతాడు. సాయంత్రం అహ్మదాబాద్ వెళ్లి అదానీ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటాడు.

డిసెంబరు 14: ముంబై బ్రబౌర్న్ స్టేడియంలో 'మీట్ అండ్ గ్రీట్'. షారుఖ్ ఖాన్, లియాండర్ పేస్‌తో కలిసి మెస్సీ టెన్నిస్ ఆడతాడు. వాంఖడే స్టేడియంలో గోట్ కన్సర్ట్, గోట్ కప్. గోట్ కెప్టెన్ల సమావేశంలో భాగంగా సచిన్, ధోనీ, రోహిత్‌తో భేటీ.

డిసెంబరు15: న్యూఢిల్లీలో ప్రధాని మోదీతో సమావేశం.

మార్కెట్లకు వచ్చే 2-3 నెలలు కీలకం

ట్రంప్ సుంకాలతోనే ఆటుపోట్లు ● యూనియన్ ఏఎంసీ సీఈఓ మధు నాయర్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పోటుతో దేశీయ స్టాక్ మార్కెట్ తీవ్ర ఆటుపోట్లు ఎదుర్కొంటోంది. ఇదే అదునుగా విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) పాలోమంటూ అమ్మకాలతో హోరెత్తిస్తున్నారు. దీంతో మార్కెట్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీలు బేర్‌మంటున్నాయి. రిటైల్ మదుపరులూ బేజారవుతున్నారు. ఈ నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లో వచ్చే రెండు, మూడు నెలలు చాలా కీలకంగా ఉంటాయని అంటున్నారు యూనియన్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ) సీఈఓ మధు నాయర్. స్టాక్ మార్కెట్ల గమనం, పెట్టుబడులు, సుంకాల ప్రభావం వంటి తదితర అంశాలపై ఆయన 'ఆంధ్రజ్యోతి బిజినెస్'తో ఇష్టాగోష్ఠిగా ముచ్చటించారు. ఆ వివరాలు..

ప్రస్తుతం స్టాక్ మార్కెట్లో నెలకొన్న ఆటుపోట్లు ఎన్నాళ్లు కొనసాగే అవకాశం ఉంది?

ప్రస్తుతం మన మార్కెట్ చాలా ఆసక్తికరంగా కనిపిస్తోంది. ఒకవైపు అమెరికా సుంకాల పోటు, కొనసాగుతున్న అంతర్జాతీయ ఉద్రిక్తతల ఒత్తిళ్లతో ఎఫ్‌పీఐలు అమ్మకాలు పెంచాయి. మరోవైపు చక్కటి ద్రవ్య విధానాలు, మెరుగైన జీడీపీ వృద్ధి రేటుతో మిగతా దేశాలతో పోలిస్తే మన ఆర్థిక పటిష్ఠంగా ఉంది. వచ్చే రెండు మూడు నెలలు మన మార్కెట్‌కు అత్యంత కీలకంగా భావించాలి. అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదిరితే ప్రస్తుత అనిశ్చితి చాలా వరకు తగ్గి మార్కెట్ స్థిరపడే అవకాశం ఉంది.

రిటైల్ మదుపరుల పెట్టుబడి వ్యూహం ఎలా ఉండాలి?

స్వల్పకాలంలో మార్కెట్ ఆటుపోట్లు ఎలా ఉంటాయో ఊహించలేం. దీన్ని దృష్టిలో ఉంచుకుని రిటైల్ మదుపరులు తమ ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా దీర్ఘకాలిక దృష్టితో మంచి కంపెనీల షేర్లలో పెట్టుబడులు పెట్టాలి. ఇలాంటి పెట్టుబడులు దీర్ఘకాలంలో మంచి లాభాలు పంచుతాయని అనుభవాలు చెబుతున్నాయి. అయితే ఇందుకు క్రమశిక్షణతో కూడిన పెట్టుబడి వ్యూహం కీలకం. ప్రస్తుత ఆటుపోట్ల నేపథ్యంలో క్రమానుగత పెట్టుబడులు (సిప్), క్రమానుగత బదిలీ పథకాలు (ఎస్‌టీపీ) ఇందుకు బాగా ఉపయోగపడతాయి. ఈ వ్యూహాల ద్వారా షేర్ల సగటు కొనుగోలు ధర తగ్గడంతో పాటు పెట్టుబడులపై మార్కెట్ ఆటుపోట్ల ప్రభావం పెద్దగా ఉండదు. సరైన సమయంలో పెట్టుబడి పెట్టలేక పోయామే అనే బెంగ కూడా ఉండదు.

వడ్డీ రేట్లు మరింత తగ్గుతాయా?

జీడీపీ వృద్ధి రేటుకు కొన్ని సవాళ్లు ఉన్నప్పటికీ సమీప భవిష్యత్‌లో మన దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం 2 నుంచి 4 శాతం మించకపోవచ్చు. సుంకాల ముప్పు ఉన్నా ప్రస్తుతం మన ఆర్థిక పరిస్థితి చాలా వరకు స్థిరంగానే ఉన్నాయి. కాబట్టి భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కీలక రెపో వడ్డీ రేటు ఇంకా తగ్గించే అవకాశం తప్ప పెంచే అవకాశం కనిపించడం లేదు.

అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదరకపోతే ఏయే రంగాలపై ప్రభావం పడొచ్చు?

అమెరికాకు ఎగుమతులపై ఎక్కువగా ఆధారపడిన రత్నాభరణాలు, టెక్స్‌టైల్, రొయ్యల కంపెనీలు, ఎలక్ట్రానిక్స్ కంపెనీలు బాగా దెబ్బతినే అవకాశం ఉంది. అమెరికా మార్కెట్‌పై ఆధారపడిన కొన్ని భవన నిర్మాణ పరికరాల కంపెనీలపైనా ఒత్తిడి తప్పదు.

దేశీయ స్టాక్ మార్కెట్‌కు సానుకూల, ప్రతికూల అంశాలేమిటి?

పటిష్ఠంగా ఉన్న ఆర్థిక పరిస్థితులు, ప్రభుత్వ పెట్టుబడులు, పెరుగుతున్న కంపెనీల రాబడులు, కోలుకుంటున్న పట్టణ, గ్రామీణ వినియోగం మన మార్కెట్‌కు ఉన్న ప్రత్యేక సానుకూల అంశాలు. పొంచి ఉన్న అమెరికా సుంకాల పోటు, అంతర్జాతీయ ఉద్రిక్తతలు, చమురు ధరల్లో ఆటుపోట్లు, ఎఫ్‌పీఐల అమ్మకాలు పెద్ద ప్రతికూల అంశాలు. ప్రధాన దేశాల ద్రవ్య విధానాలను కూడా మనం జాగ్రత్తగా గమనిస్తుండాలి.

పసిడి ధరలు మరింత పెరుగుతాయా?

ప్రస్తుత అంతర్జాతీయ అనిశ్చితిలో పసిడి ఆకర్షణీయంగానే కనిపిస్తోంది. కరెన్సీ, రిజర్వ్‌ల నష్టభయాన్ని తట్టుకునేందుకు దాదాపు అన్ని దేశాలు కేంద్ర బ్యాంకులు బంగారాన్ని కొని పెట్టుకుంటున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలు ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లు, అంతర్జాతీయ ఉద్రిక్తతలతో సురక్షిత పెట్టుబడి సాధనంగా పసిడికి ఉన్న ప్రాముఖ్యత మరింత పెరిగింది. కాబట్టి మధ్యకాలికంగా చూస్తే బంగారం ధర మరింత పెరిగే అవకాశమే కనిపిస్తోంది.

యూనియన్ ఏఎంసీ నుంచి ఏమైనా కొత్త పథకాలు తీసుకొస్తున్నారా?

మ్యూచువల్ ఫండ్స్‌తో పాటు ఇతర వ్యాపారాల్లోకి విస్తరించబోతున్నాం. మా దీర్ఘకాలిక వృద్ధి వ్యూహంలో భాగంగా మారుతున్న మదుపరుల అభిరుచులకు అనుగుణంగా ప్రత్యేక ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఎస్ఐఎఫ్), ప్రత్యామ్నాయ పెట్టుబడి పథకాల (ఏఐఎఫ్)ను ప్రారంభించబోతున్నాం. వీటికి తోడుగా గిఫ్ట్ సిటీ ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్ (ఐఎఫ్ఎస్‌సీ) ఏర్పాటు చేసి విదేశీ మదుపరులకూ మా సేవలు అందించబోతున్నాం. ఈ చర్యలతో యూనియన్ ఏఎంసీ సమగ్ర ఆర్థిక సేవల సంస్థగా ఎదగనుంది.

ప్రస్తుతం సంస్థ ఏయూఎంలు ఏ స్థాయిలో ఉన్నాయి?

ఈ ఏడాది జూన్ నాటికి యూనియన్ ఏఎంసీ నిర్వహణలో ఉన్న ఆస్తులు (ఏయూఎం) రూ.20,360.95 కోట్లుగా ఉన్నాయి.

కొత్త తరం ఎస్‌యూవీల కోసం 'న్యూఐక్యూ' ప్లాట్‌ఫామ్

2027 నాటికి మార్కెట్లోకి 4 కొత్త కార్లు.. మహీంద్రా అండ్ మహీంద్రా



ముంబై: దేశీయ మార్కెట్ సహా అంతర్జాతీయ మార్కెట్‌కు కొత్త తరం స్పోర్ట్స్ యుటిలిటీ వాహనాల (ఎస్‌యూవీ)ను అందించడం లక్ష్యంగా మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) 'న్యూఐక్యూ' పేరిట ఒక కొత్త ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరించింది. ఈ సందర్భంగా నాలుగు ఎస్‌యూవీ కాన్సెప్ట్ కార్లు.. విజన్.ఎస్, విజన్.టీ, విజన్.ఎస్ఎక్స్‌టీ, విజన్.ఎక్స్‌లను కూడా ఆవిష్కరించింది. ఈ సరికొత్త మాడ్యులర్ వేదికపై తొలి ఉత్పత్తిని 2027లో మార్కెట్లోకి తేవాలన్నది తమ లక్ష్యమని ఈ కొత్త వేదిక, కాన్సెప్ట్‌లను విడుదల చేసిన సందర్భంగా గ్రూప్ సీఈఓ అనిష్ షా చెప్పారు. ప్రపంచ మార్కెట్లో ఇంతవరకు ఎవరూ ప్రవేశించని విభాగంలోకి అడుగు పెట్టేందుకు ఈ కొత్త వేదిక రూపొందించినట్లు ఆయన వెల్లడించారు. ప్రధానంగా ఈ కాన్సెప్ట్ ఎస్‌యూవీలు 4 మీటర్ల లోపు నిడివి గల మిడ్‌సైజ్ ఉత్పత్తులని షా తెలిపారు.

పబ్లిక్ ఇష్యూకి ఆర్ఎస్ బ్రదర్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆర్ఎస్ బ్రదర్స్ సహా పలు బ్రాండ్‌నేమ్స్‌తో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రిటైల్ స్టోర్లను నిర్వహిస్తున్న హైదరాబాద్ సంస్థ ఆర్ఎస్‌బీ రిటైల్ ఇండియా లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వస్తోంది. ఇందుకు అనుమతి కోరుతూ క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓలో భాగంగా రూ.500 కోట్ల తాజా ఈక్విటీ షేర్ల జారీతో పాటు ప్రమోటర్ల వాటాకు చెందిన 2.98 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనున్నట్లు కంపెనీ డీఆర్‌హెచ్‌పీలో వెల్లడించింది. ఐపీఓ ద్వారా కంపెనీ మొత్తం రూ.1,500 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉందని ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు వెల్లడించాయి. తాజా ఈక్విటీ జారీ ద్వారా సమీకరించనున్న నిధుల్లో రూ.275 కోట్లను రుణాల చెల్లింపుల కోసం వినియోగించుకోనున్నట్లు కంపెనీ తెలిపింది. ఆర్ఎస్ బ్రదర్స్ సౌత్ ఇండియా షాపింగ్ మాల్ బ్రాండ్‌నేమ్‌తో మరిన్ని స్టోర్ల ఏర్పాటుకు రూ.118 కోట్లు వెచ్చించనున్నట్లు, మిగతా సొమ్మును సాధారణ వ్యాపార అవసరాల కోసం ఉపయోగించుకోవాలనుకుంటున్నట్లు వెల్లడించింది.

22 నగరాలు.. 73 స్టోర్లు: ఆర్ఎస్‌బీ రిటైల్ 2008లో ఏర్పాటైంది. ఆర్ఎస్ బ్రదర్స్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌తో పాటు కాంచీపురం నారాయణి సిల్క్స్, డీప రాయల్, వాల్యూ జోన్ హైపర్ మార్ట్ బ్రాండ్ నేమ్స్‌తో రిటైల్ విక్రయ స్టోర్లను నిర్వహిస్తోంది. ఈ ఏడాది మార్చి 31 నాటికి తెలంగాణ, ఏపీ, కర్ణాటకలోని 22 నగరాల్లో మొత్తం 73 స్టోర్లను కలిగి ఉంది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఆర్ఎస్‌బీ రిటైల్ రూ.2,694 కోట్ల ఆదాయంపై రూ.104.4 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. వేగంగా వృద్ధి చెందుతున్న దేశీయ రిటైల్ ఇండస్ట్రీ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రూ.92.6 లక్షల కోట్ల స్థాయికి చేరే అవకాశం ఉందని టెక్నోపార్క్ నివేదిక అంచనా వేసింది.

బిజినెస్

జీఎస్‌టీలో మలివిడత సంస్కరణలు

సులభంగా రిజిస్ట్రేషన్లు, రిటర్న్‌ల ప్రక్రియ

న్యూఢిల్లీ: జీఎస్‌టీ వ్యవస్థను సమూలంగా సంస్కరించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కొన్ని ప్రతిపాదనలు చేసింది. వచ్చే నెలలో జరిగే జీఎస్‌టీ మండలి సమావేశంలో దీనిపై చర్చ జరగనుంది. పన్ను ఎగవేతలు, బోగస్ ఇన్వాయిస్‌లతో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) స్వాహాకు చెక్ చెప్పేలా ఈ సంస్కరణలు ఉంటాయని అధికార వర్గాలు చెప్పాయి. వేగంగా జీఎస్‌టీ రిజిస్ట్రేషన్, రిటర్న్‌ల ప్రాసెసింగ్, రిఫండ్‌ల క్లియరెన్స్ ఉండేలా ఈ సంస్కరణలు ఉంటాయని సమాచారం. ఈ సంస్కరణలను అధికార వర్గాలు 'మలివిడత జీఎస్‌టీ సంస్కరణలు'గా అభివర్ణించాయి. ఈ సంస్కరణలతో జీఎస్‌టీ పన్ను చెల్లింపుదారులపై కంప్లయెన్స్ (అమలు) భారం తగ్గుతుందని భావిస్తున్నారు. ఈ సంస్కరణల్లో భాగంగా కొత్త వ్యాపార సంస్థలు, స్టార్టప్ కంపెనీల జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ మూడు రోజుల్లో పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందుకోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని భావిస్తోంది. అలాగే ఎగుమతిదారులు, ఇన్వర్టెడ్ డ్యూటీ చెల్లింపు విధానంలో ఉన్న జీఎస్‌టీ చెల్లింపుదారులతో సహా 80 శాతం రిటర్న్‌ల రిఫండ్స్‌ను, రిటర్న్ ఫైల్ చేసిన వెంటనే వేగంగా క్లియర్ చేయాలని ప్రతిపాదించారు. ముందుగానే పూర్తి చేసిన రిటర్న్‌ల ద్వారా రిటర్న్‌ల ఫైలింగ్ ప్రక్రియ మరింత సులభమవుతుందని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



16 తేదీ			
హైదరాబాద్	485	విజయవాడ	520
వరంగల్	487	గోదావరి	510
చిత్తూరు	548	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	102	విజయవాడ	119
వరంగల్	102	గుంటూరు	121
కరీంనగర్	102	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	102	చిత్తూరు	95
కర్నూలు	102	నెల్లూరు	100
విశాఖపట్నం	113	అనంతపురం	100
గోదావరి	119		


బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,300 ▼	92,850 ▼	1,26,000 ▲
విజయవాడ	1,03,000 ▼	97,000 ▲	1,18,250 ▼
విశాఖపట్నం	1,01,350 ▼	92,900 ▼	1,26,100 ▲
రాజమండ్రి	1,01,240 ▼	92,800 ▼	1,18,200 ▼
ప్రొద్దుటూరు	1,00,800 ▼	92,740 ▼	1,17,300 ▼
ముంబై	1,00,023 ▲	91,621 ▲	1,14,933 ▼

కశ్మీర్‌లో శిథిలాల కింద 500 మంది!

» ఫరూఖ్ అబ్దుల్లా అంచనా



న్యూఢిల్లీ, శ్రీనగర్, ఆగస్టు 15: కిష్త్వార్ జిల్లాలో మేఘ విస్ఫోటం జరిగిన సమయంలో చశోతీ గ్రామంలో వెయ్యి మందికి పైగా ఉన్నారని, సుమారు 500 మంది శిథిలాల కింద చిక్కుకుపోయి ఉంటారని జమ్మూకశ్మీర్ మాజీ సీఎం ఫరూఖ్ అబ్దుల్లా అంచనా వేశారు. అయితే... ఈ ఘటనలో 60 మంది చనిపోయినట్లు సీఎం ఒమర్ అబ్దుల్లా ధ్రువీకరించారు. వంద మందికి పైగా గాయపడినట్లు తెలిపారు. ప్రధాని మోదీ తనతో ఫోన్‌లో మాట్లాడారని, తాజా పరిస్థితిని వివరించారనని చెప్పారు. మచైల్ ఆలయానికి వెళ్లే యాత్రికులకు ఈ గ్రామమే బేస్ పాయింట్. ఎగువ ప్రాంతంలో కుండపోత వానల కారణంగా మెరుపు వరదలు రావడంతో భక్తుల టెంట్లు, దుకాణాలన్నీ కొట్టుకుపోయాయి. మేఘ విస్ఫోటం సమయంలో బాంబు పేలుడు తరహాలో భారీ శబ్దం వచ్చిందని ప్రమాదం నుంచి బయటపడినవారు చెబుతున్నారు. పేలుడు రాగానే పరిగెత్తండంటూ అరుపులు వినిపించాయని, రెండు నిమిషాల్లోనే అందరూ 4 అడుగుల బురద, శిథిలాల కింద చిక్కుకుపోయారని ఓ క్షతగాత్రుడు తెలిపారు.

పాక్‌లో భారీ వర్షాలు.. 214 మంది మృతి



ఇళ్ల మధ్య నుంచి ఉధృతంగా వరద

పెషావర్/ఇస్లామాబాద్, ఆగస్టు 15: పాకిస్థాన్‌ను భారీ వర్షాలు, వరదలు ముంచెత్తాయి. పాకిస్థాన్‌లోను, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోను గురువారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు కనీసం 214 మంది మృతి చెందారు. అనేక మంది గల్లంతయ్యారు. వరదల్లో అనేక మంది గల్లంతు కావడంతో మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. కుండపోత వర్షాల కారణంగా ఒక్కసారిగా వరదలు రావడంతో కొండచరియలు విరిగిపడి అనేక ఇళ్లు, రోడ్లు దెబ్బతిన్నాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో పాకిస్థాన్ ఆర్మీ, రెస్క్యూ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. హెలికాప్టర్ ద్వారా సహాయం అందిస్తున్న క్రమంలో శుక్రవారం ఓ హెలికాప్టర్ కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు పైలట్లతో సహా అయిదుగురు మృతి చెందారు. పీవోకేలోని కారకోరం, బాల్టిస్థాన్ రహదారులు దెబ్బతిన్నాయి. నీలం లోయలోని రట్టి గలీ సరస్సు వద్ద 600 మంది పర్యాటకులు చిక్కుకున్నారు.

ఇనుములో క్రీడోత్సాహం పుట్టెనే..

» చైనాలో హ్యూమనాయిడ్ రోబోల ఆటల పోటీలు.. ప్రపంచంలోనే మొట్టమొదటిసారి నిర్వహణ

» పోటీల్లో పాల్గొంటున్న 16 దేశాల రోబోలు.. మొత్తం 280 జట్లు.. 26 అంశాల్లో పోటీలు



బీజింగ్, ఆగస్టు 15: ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా చైనాలో మర మనుషుల(హ్యూమనాయిడ్ రోబోలు) ఆటల పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఈ 'వరల్డ్ హ్యూమనాయిడ్ గేమ్స్' జరగనున్నాయి. 16 దేశాలకు చెందిన 280 జట్లు మొత్తం 26 విభాగాల్లో పోటీ పడుతున్నాయి. మనుషులను పోలిన రోబోలను హ్యూమనాయిడ్ రోబోలు అంటారన్న సంగతి తెలిసిందే. మర మనుషుల క్రీడల్లో భాగంగా ఫుట్‌బాల్, రన్నింగ్, లాంగ్ జంప్, టేబుల్ టెన్నిస్ లాంటి ఆటలతో పాటు ఔషధాలను గుర్తించడం, వస్తువులను మోసుకు వెళ్లడం, పరిసరాలను శుభ్రంగా ఉంచడం లాంటి అంశాల్లో కూడా పోటీలను నిర్వహిస్తున్నారు. అమెరికా, జపాన్ తదితర దేశాలకు చెందిన 192 యూనివర్సిటీలు, 88 ప్రైవేటు కంపెనీలు రూపొందించిన రోబోలు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. రోబోల క్రీడల పోటీల్లో భాగంగా తొలుత స్ప్రింట్ రన్నింగ్, ఫుట్‌బాల్ పోటీలు జరిగాయి. చాలా రోబోలు ఆటల మధ్యలోనే పడిపోయాయి. అయితే, ఈ ఆటలు కేవలం వినోదానికే కాకుండా రోబోలపై పరిశోధనకు అత్యంత కీలకమని వివిధ రోబో కంపెనీల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఈ గేమ్స్‌లో ఒక్కో టికెట్ ధర రూ.1,500 నుంచి రూ.8వేల వరకు ఉంది. బీజింగ్ మున్సిపల్ గవర్నమెంట్ ఈ పోటీలను నిర్వహిస్తోంది. కాగా, చైనా కొంత కాలంగా ఏఐ, రోబోటిక్స్‌పై ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. ఈ క్రమంలోనే గతేడాది ఈ రంగం కోసం 20బిలియన్ డాలర్లను ఖర్చు పెట్టింది. ఏఐ, రోబోటిక్స్ స్టార్టప్‌ల కోసం భవిష్యత్తులో 137బిలియన్ డాలర్లతో ఓ నిధిని ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే ఇటీవల బీజింగ్‌లో రోబో మారథాన్ నిర్వహించారు.

తండ్రి అప్పు తీర్చలేదని కుమార్తె కిడ్నాప్

» సీసీ ఫుటేజీతో స్వల్ప వ్యవధిలోనే ఛేదించిన పోలీసులు

» తల్లిదండ్రుల చెంతకు బాలిక.. అదుపులో ఫైనాన్స్ వ్యాపారి

ఒంగోలు క్రైం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): తండ్రి అప్పు తీర్చలేదని ఎనిమిదో తరగతి చదువుతున్న 13 ఏళ్ల ఆయన కుమార్తెను ఓ వ్యాపారి కిడ్నాప్ చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు రెండు గంటల వ్యవధిలోనే కేసును ఛేదించారు. ఒంగోలులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ దామోదర్ ఈ కేసు వివరాలను వెల్లడించారు. ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం మువ్వావారిపాలేనికి చెందిన శ్రీనివాసరావు గతంలో బేల్దారి పనులకు తిరుపతి వలస వెళ్లాడు. ఆసమయంలో తిరుపతికి చెందిన ఆర్.ఈశ్వరరెడ్డి వద్ద రూ.5లక్షలు అప్పుతీసుకున్నాడు. కొంతకాలంగా ఆ బాకీ చెల్లించడం లేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం చీమకుర్తి వచ్చిన ఈశ్వర్‌రెడ్డి నేరుగా శ్రీనివాసరెడ్డి కుమార్తె చదువుకునే పాఠశాల వద్దకు వెళ్లాడు. అక్కడ స్వాతంత్ర్యదిన వేడుకలకు హాజరై బయటకు వస్తున్న ఆ బాలికకు.. 'మీ నాన్న ఇంటికి తీసుకురమ్మన్నాడ'ంటూ మాయమాటలు చెప్పి మధ్యాహ్నం 12.30 గంటలకు మోటారు సైకిల్‌పై ఎక్కించుకున్నాడు. స్వీట్లు కొనిస్తానని చెప్పి దారిమళ్లించి ఒంగోలుకు తీసుకువచ్చాడు. ఈ దృశ్యం సీసీ కెమెరాలో రికార్డయింది. అక్కడి నుంచి శ్రీనివాసరావుకు ఫోన్‌చేసి 'మీ కుమార్తెను తీసుకెళుతున్నా.. నాకు ఇవ్వాల్సిన నగదు ఇవ్వకపోతే చంపేస్తా' అని బెదిరించాడు. వెంటనే శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు అప్రమత్తమయ్యారు. ఎస్పీ దామోదర్ స్వీయ పర్యవేక్షణలో ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. సీసీ ఫుటేజీ ఆధారంగా కిడ్నాపర్ తిరుపతికి చెందిన ఆర్.ఈశ్వరరెడ్డిగా గుర్తించారు. అతడి ఫోన్ ట్రాక్ చేసి నెల్లూరు జిల్లా కావలి సమీపంలోని కె.బిట్రగుంట వద్ద మధ్యాహ్నం 2.30 గంటలకు అదుపులోకి తీసుకొన్నారు. కిడ్నాప్ అయిన బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

అమ్మాయి అదృశ్యం వెనుక..?




బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడిగా కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వంలో నటిస్తోన్న చిత్రం 'కిష్కిందపురి'. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. షైన్ స్క్రీన్స్ బేనర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 12న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర టీజర్‌ను మేకర్స్ శుక్రవారం విడుదల చేశారు. టీజర్‌లో మొదటి షాట్ నుంచే మిస్టరీ ప్రారంభమవుతుంది. పురాతన బంగ్లాలోకి వెళ్లిన ఓ అమ్మాయి ఒక్కసారిగా అదృశ్యం అవుతుంది. ఇంతలో రేడియో నుంచి ఓ సమాచారం ప్రసారం అవుతుంది. మొత్తానికి టీజర్ ఆద్యంతం ఉత్కంఠతతో అదరగొట్టింది. చైతన్ భరద్వాజ్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ టీజర్‌ని మరో లెవల్‌కి తీసుకెళ్లింది.

ఈ ముసుగు వీరుడెవరు?



సాధారణంగా స్టార్ హీరోలు, హీరోయిన్లు సినిమా థియేటర్లకు వెళ్లరు. అక్కడ అభిమానుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. తప్పని సరి అయితే ఎవరూ తమను గుర్తించకుండా మారు వేషంలో వెళ్తారు. ఇటీవలె హీరోయిన్ రష్మిక మందన్న మారువేషంలో వెళ్లి విజయ్ దేవరకొండ సినిమా 'కింగ్‌డమ్' చూసి వచ్చినట్లు వార్తలు వచ్చాయి. తాజాగా హీరో నాని కూడా ఇలానే గురువారం బ్యాక్ టు బ్యాక్ రెండు సినిమాలు చూశారు. ముఖానికి ముసుగు వేసుకొన్న నాని.. జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'వార్-2', రజనీకాంత్ 'కూలీ' సినిమాలను ఏఎంబీ సినిమాస్‌లో వీక్షించారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.



యుద్ధ వీరుడిగా శ్రీకృష్ణుడు

చలన చిత్ర పరిశ్రమలో తొలిసారిగా శ్రీకృష్ణుడిని ఒక యుద్ధ వీరుని పాత్రలో చూపిస్తూ నిర్మిస్తున్న చిత్రం 'శ్రీకృష్ణ అవతార్ ఇన్ మహోబా'. ముకుంద్ పాండే దర్శకత్వంలో అనిల్ వ్యాస్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో 11-12 వ శతాబ్దాల నాటి 'మహోబా' సాంస్కృతిక వైభవాన్ని, శ్రీకృష్ణుని దివ్యత్వాన్ని, ధీరత్వాన్ని, ఆధ్యాత్మిక ప్రాభవాన్ని చూపించే చిత్రమిదని దర్శకుడు చెప్పారు. 'శ్రీకృష్ణ అవతార్ ఇన్ మహోబా' పాన్ వరల్డ్ ప్రాజెక్ట్. ప్రపంచ స్థాయి సాంకేతిక నిపుణులతో తెరకెక్కిస్తున్నాం. చరిత్ర, సాంస్కృతిక వారసత్వం, ఆధ్యాత్మికతను వివరించే సినిమా ఇది' అని నిర్మాత తెలిపారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు వెల్లడిస్తామన్నారు.



వారి కలయికలో తొలి అడుగు


'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా ఘన విజయంతో మంచి జోష్‌లో ఉన్న విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ దర్శకత్వంలో నటించనున్నారు. చాలా కాలంగా ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న వీరి కాంబినేషన్‌కు పూజా కార్యక్రమాలతో శుక్రవారం తొలి అడుగు పడింది. నిర్మాత సురేశ్ బాబు కెమెరా స్విచ్చాన్ చేశారు. హారిక -హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ(చిన బాబు) నిర్మిస్తున్నారు. వెంకటేశ్ నటించిన 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరీ' చిత్రాలకు త్రివిక్రమ్ డైలాగ్స్ రాశారు. ఇప్పుడు ఆయన దర్శకత్వంలోనే వెంకటేశ్ నటిస్తుండటంతో అందరిలో ఆసక్తి నెలకొంది.

'అమ్మ' అధ్యక్షురాలిగా శ్వేతా మీనన్!

● 'అమ్మ' చరిత్రలో మహిళకు ఇదే తొలి అవకాశం



అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ (అమ్మ) నూతన అధ్యక్షురాలిగా నటి శ్వేతా మీనన్ ఎన్నికయ్యారు. శుక్రవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కొచ్చిలో జరిగిన పోలింగ్‌లో శ్వేతకు 159 ఓట్లు రాగా, ఆమె ప్రత్యర్థి, నటుడు దేవన్‌కు 132 ఓట్లు వచ్చాయి. దాంతో శ్వేత ఎన్నికయినట్లు ప్రకటించారు. 31 ఏళ్ల 'అమ్మ' చరిత్రలో ఒక మహిళ అధ్యక్షురాలిగా ఎన్నిక కావడం ఇదే ప్రథమం. పలువురు నటులు, దర్శకులపై నటీమణులు లైంగిక ఆరోపణలు చేసిన నేపథ్యంలో అధ్యక్షుడిగా ఉన్న మోహన్‌లాల్ నైతిక బాధ్యత వహిస్తూ పదవికి రాజీనామా చేశారు. దీని వల్ల 2027లో జరగాల్సిన ఎన్నికలను ఇప్పుడే నిర్వహించారు. అధ్యక్ష స్థానానికి పోటీ పడుతున్న శ్వేతా మీనన్‌పై కొన్ని రోజుల క్రితం ఓ కేసు నమోదు అయింది. ఈ నేపథ్యంలో జరిగిన ఎన్నికల్లో ఆమె గెలుపుపై ఉత్కంఠ ఏర్పడింది. 27 ఓట్ల ఆధిక్యంతో శ్వేత గెలిచి రికార్డ్ సృష్టించారు. తన గెలుపుపై ఆమె స్పందిస్తూ 'ఇకపై 'అమ్మ' అంటే ఓ మహిళ అని గర్వంగా చెప్పవచ్చు' అన్నారు. అసోసియేషన్ నుంచి వైదొలిగిన సభ్యులకు శ్వేత తిరిగి స్వాగతం పలికారు. అవసరమైతే తను వ్యక్తిగతంగా వారిని ఆహ్వానిస్తానని కూడా చెప్పారు. మోడలింగ్ నుంచి సినీరంగంలోకి అడుగుపెట్టిన శ్వేత మలయాళ, తమిళ, కన్నడ, హిందీ చిత్రాల్లో నటించారు. తెలుగులో 'ఆనందం', 'జూనియర్స్', 'రాజన్న' తదితర చిత్రాల్లో మెరిశారు.



నిజ జీవిత ఘటనల ఆధారంగా..



రమణ్, వర్ష విశ్వనాథ్ జంటగా రామచంద్ర వట్టికూటి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మటన్ సూప్'. 'విట్‌నెస్ ది రియల్ క్రైమ్' దీని ట్యాగ్‌లైన్. ఎలికా(గోపాల్), అరుణ్ చంద్ర వట్టికూటి, రామకృష్ణ సనపల నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టైటిల్, మోషన్ పోస్టర్లను సీనియర్ నిర్మాత కేఎస్ రామారావు ఆవిష్కరించి చిత్ర బృందానికి ఆల్ ద బెస్ట్ చెప్పారు. నిర్మాత రామకృష్ణ మాట్లాడుతూ 'నిజ జీవిత ఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించాం. త్వరలోనే విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని అన్నారు. కార్యక్రమంలో చిత్ర దర్శకుడు రామచంద్ర, హీరో రమణ్ తదితరులు పాల్గొన్నారు.

పదిహేను చిత్రాలకు శ్రీకారం




భీమవరం టాకీస్ పతాకంపై ఇప్పటికే 114 చిత్రాలను నిర్మించిన తుమ్మలపల్లి రామసత్యనారాయణ, ఒకేసారి పదిహేను చిత్రాలకు శ్రీకారం చుట్టారు. ఈ వేడుకకు చిత్ర పరిశ్రమకు చెందిన మురళీమోహన్, రేలంగి నరసింహారావు, సుమన్, శ్రీకాంత్, జేడీ చక్రవర్తి, తనికెళ్ల భరణి, సి.కల్యాణ్, తమ్మారెడ్డి భరద్వాజ, తుమ్మల ప్రసన్న కుమార్, చదలవాడ శ్రీనివాసరావు, భరత్ భూషణ్‌తోపాటు ప్రముఖ రచయిత, రాజ్యసభ సభ్యులు విజయేంద్ర ప్రసాద్ తదితరులు హాజరయ్యారు. ఈ పదిహేను చిత్రాలను 2026 ఆగస్టు 15 నాటికి పూర్తిచేసి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని రామసత్యనారాయణ తెలిపారు.

అడుగు అడుగునా...



రోహిత్ సాహిని ప్రధాన పాత్రలో మహి కోమటిరెడ్డి తెరకెక్కించిన చిత్రం 'మిస్టీరియస్'. జయ్ వల్లందాస్ నిర్మించారు. ఈ చిత్రం నుంచి 'అడుగు అడుగునా..' అంటూ సాగే గీతాన్ని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆవిష్కరించారు. పోలీస్ నిబద్ధత గురించి అద్భుతంగా రాయడంతోపాటు సంగీతాన్ని అందించిన ఎంఎల్ రాజాని కమిషనర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో రోహిత్, దర్శకనిర్మాతలు మహి కోమటిరెడ్డి, వల్లందాస్, సహ నిర్మాత రామ్ ఉప్పు (బన్నీ రామ్) తదితరులు పాల్గొన్నారు.



FARNAZ



ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ప్రధాన కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

» జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ప్రధాన కార్యాలయంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జూబ్లీహిల్స్ ఫిలింనగర్‌లోని కార్యాలయంలో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. వేడుకల్లో ఆంధ్రజ్యోతి డైరెక్టర్ వేమూరి ఆదిత్య, ఏబీఎన్-ఆంధ్రజ్యోతి డైరెక్టర్ కోగంటి భానుప్రకాష్, ఉభయ సంస్థల్లోని అన్ని విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజం పట్ల బాధ్యతగా ఉండాలి: పల్లా



అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): నాయకులకు డబ్బు పట్ల కాకుండా సమాజం పట్ల బాధ్యత ఉండాలని, ఎన్టీఆర్, చంద్రబాబు అలాంటి నాయకులని టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీనివాసరావు జెండా ఆవిష్కరించి, స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యాలయ కార్యదర్శి అశోక్‌బాబు, నాదెండ్ల బ్రహ్మం, వల్లూరు కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఉండవల్లిలోని సీఎం నివాసంలో భువనేశ్వరి జాతీయజెండాను ఆవిష్కరించి, సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు.

నాడు కుప్పం.. నేడు పులివెందుల

» ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన జగన్, చంద్రబాబు: షర్మిల



అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): నాడు కుప్పంలో జగన్, నేడు పులివెందులలో చంద్రబాబు ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేసి.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. జగన్‌కూ చంద్రబాబుకూ తేడాలేదన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం షర్మిల మాట్లాడుతూ దేశాన్ని మోదీ చెర నుంచి విడిపించేందుకు మరో స్వాతంత్ర్య పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. దేశాన్ని కార్పొరేట్లకు దోచిపెట్టి, ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని అమలు చేయడమేనా నయా భారత్ అని ప్రశ్నించారు.



విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, పాల్గొన్న నాయకులు



వీఐటీ-చెన్నై వార్షికోత్సవంలో కమల్‌హాసన్, విశ్వనాథన్ తదితరులు

వైఫల్యాలను ఎదుర్కొని విజయం వైపు సాగండి

» యువతకు కమల్‌హాసన్ పిలుపు

» నాస్తికుణ్ణి కాదు... హేతువాదినంటూ వ్యాఖ్య.. ఘనంగా వీఐటీ-చెన్నై వార్షికోత్సవం

చెన్నై, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): జీవితంలో వైఫల్యాలను ధైర్యంగా ఎదుర్కొని విజయం వైపు యువత ముందుకు సాగాలని ప్రముఖ సినీ నటుడు, ఎంపీ కమల్‌హాసన్ పిలుపునిచ్చారు. 'వీఐటీ-చెన్నై' 15వ వార్షికోత్సవం సందర్భంగా 'క్రిస్టల్ కనెక్షన్స్ పూర్వ విద్యార్థుల సమ్మేళన సమావేశం' శుక్రవారం కేలంబాక్కంలో ఘనంగా జరిగింది. వీఐటీ వ్యవస్థాపక కులపతి జి.విశ్వనాథన్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి వీఐటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జీవీ సెల్వం స్వాగతం పలకగా, కమల్ హాసన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కమల్ మాట్లాడుతూ.. 'దేవుడంటే గౌరవం లేదు కానీ, తమిళాన్ని మాత్రం గౌరవిస్తారు' అని కొంతమంది తనను ప్రశ్నిస్తుంటారని అంటూ.. 'నిజమే, తమిళం నా మాతృభాష. భాష మాత్రమే గౌరవించదగినది' అని అన్నారు. తాను నాస్తికుణ్ని కాదని, హేతువాదిని మాత్రమేనన్నారు. జి.విశ్వనాథన్ మాట్లాడుతూ.. ఉన్నత విద్య మాత్రమే భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చగలదన్నారు.

- మన తెలుగుజాతి ప్రపంచంలోనే ముందు వరుసలో ఉండాలన్నదే నా తపన, కోరిక, ఆశయం. అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా నిలిపేందుకు నిరంతరం కష్టపడతా. జాతిని సమున్నత స్థానంలో నిలబెడతా.
- ఏపీ బ్రాండ్ పునరుద్ధరించడమే కూటమి ప్రభుత్వ ఆశయం. పారిశ్రామికవేత్తలకు నమ్మకాన్ని కలిగించి తిరిగి రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చేలా కృషి చేస్తున్నాం.

\- సీఎం చంద్రబాబు




ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న సీఎం చంద్రబాబు

సూపర్‌సిక్స్ సూపర్ హిట్!

(మొదటి పేజీ తరువాయి)

స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 'కూటమి ప్రభుత్వంలో సంక్షేమానికి సాటి లేదు. అభివృద్ధికి అడ్డులేదు.. సుపరిపాలనకు పోటీ లేదు. ఇది రికార్డు.. ఇదే ఆల్‌టైం రికార్డు'గా అభివర్ణించారు. ఎన్టీఆర్ భరోసా కింద 64 లక్షల మందికి ఇంటి వద్దే పెన్షన్లు పంపిణీ చేస్తూ సంక్షేమ రాజ్యానికి కొత్త అర్థాన్ని ఇచ్చామన్నారు. పేదింటి తల్లులకు ఆర్థిక భరోసా ఇచ్చేందుకు రూ.10వేల కోట్లతో తల్లికి వందనం పథకాన్ని తీసుకొచ్చామన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో మొదట విడతగా రాష్ట్రప్రభుత్వం రూ.5వేలు, కేంద్రం ఇచ్చిన రూ.2వేలు కలిపి మొత్తం రూ.7వేల చొప్పున రూ.3,173 కోట్లను రైతుల ఖాతాల్లో వేశామని చెప్పారు. దీపం పథకం కింద ఏటా 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని, రూ.2,684 కోట్లు ఖర్చుతో 2కోట్ల రాయితీ సిలిండర్లు ఇచ్చామన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ఆడబిడ్డలకు 'స్త్రీశక్తి' పేరుతో ఉచిత ప్రయాణాన్ని కానుకగా ఇస్తున్నామని చెప్పారు. 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించామని.. ఈ నెలాఖరుకు నియామకాలు పూర్తి చేస్తామన్నారు. ప్రజలకు నాడు కునుకు లేకుండా చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుచేశామని గుర్తుచేశారు. 204 అన్న క్యాంటీన్లలో 5.16కోట్లమందికి రూ.5కే కడుపు నింపుతున్నామని చెప్పారు. 6 వేలకు పైగా ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలకు రూ.10వేల చొప్పున విడుదల చేస్తున్నామని తెలిపారు. అర్చకుల వేతనాలను రూ.15 వేలకు పెంచామని, ఆలయాల్లో అన్యమతస్థులు లేకుండా చూస్తున్నామన్నారు. దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణుల కనీస వేతనం రూ.25వేలకు పెంచామని.. దేవాలయ ట్రస్టు బోర్డుల్లో వారికి చోటు కల్పించామన్నారు. 40వేల సెలూన్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. కల్లుగీత కార్మికులకు 10శాతం మద్యం షాపులు, బార్లు కేటాయించామని చెప్పారు. మత్స్యకారులకు వేట విరామ సమయంలో రూ.20వేల ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. 'మత్స్యకారుల సేవలో' పథకం ద్వారా 1,29,178 మందికి రూ.259 కోట్లు అందించామని తెలిపారు. చేనేతకు నెలకు 200యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణతో వారి దశాబ్దాల ఆకాంక్ష నెరవేర్చామన్నారు. 'అడవితల్లి బాటలో' కార్యక్రమం ద్వారా రూ.1,000 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఇమామ్‌లకు రూ.10వేలు, మౌజన్లకు 5వేల చొప్పున గౌరవవేతనం ఇస్తున్నామన్నారు. సోషల్ మీడియాలో మహిళలపై అసభ్యకర పోస్టులు పెడితే కఠినంగా వ్యవహరిస్తున్నామని, మహిళల ఆత్మగౌరవం కాపాడుతున్నామని తెలిపారు. సీఎం ఇంకా ఏం చెప్పారంటే...

గ్రామ స్వరాజ్యం దిశగా..



పల్లెలే దేశానికి పట్టుగొమ్మలన్న మహాత్మాగాంధీ మాటలు మాకెప్పుడూ ఆచరణీయం. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అత్యధికంగా రూ.5,211 కోట్లు ఖర్చు పెట్టాం. గ్రామీణ ప్రాంతాల్లో 4 వేల కి.మీ సీసీ రోడ్లు, 250 కి.మీ బీటీ రోడ్లు నిర్మించాం. 2028 నాటికి జల్‌జీవన్ మిషన్ కింద ప్రతి పల్లెకు, ప్రతి గడపకు సురక్షిత తాగునీరు అందిస్తాం. ఆరోగ్యాంధ్రప్రదేశ్ మా విధానం. ప్రివెంటివ్, క్యూరేటివ్, కాస్ట్ ఎఫెక్టివ్, రియల్‌టైమ్ మానిటరింగ్ విధానాలతో ప్రజారోగ్యానికి సంజీవనిగా వైద్యశాఖను తీర్చిదిద్దాం. సీఎం సహాయ నిధి నుంచి రూ.552 కోట్లు అందించాం. సూపర్ సిక్స్, మేనిఫెస్టో అమలుతో ప్రజల జీవనప్రమాణాలు మారుస్తున్నాం.

గ్రోత్ ఇంజన్లుగా నగరాలు, పట్టణాలు..

నగరాలు, పట్టణ ప్రాంతాలను రాష్ట్రానికి గ్రోత్ ఇంజన్లుగా అభివృద్ధి చేస్తున్నాం. భవన నిర్మాణాలకు అనుమతులు సులభతరం చేశాం. 100 గజాల్లోపు స్థలాల్లో బిల్డింగ్ ప్లాన్ లేకుండానే ఇంటిని నిర్మించుకునే అవకాశం కల్పించాం. పారిశ్రామికవేత్తలకు నమ్మకం కలిగిస్తున్నాం. ఇప్పటివరకు 9ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశాలు నిర్వహించి రూ.5.94 లక్షల కోట్ల విలువైన 113 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపాం. వీటి ద్వారా 5.56 లక్షల ఉద్యోగాలు వస్తాయి. గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి దిగ్గజ ఐటీ కంపెనీలు నవ్యాంధ్రలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ఉచిత ఇసుక విధానంతో భవన నిర్మాణ రంగాన్ని నిలబెట్టాం. ఇప్పటి వరకు 1.5 కోట్ల టన్నుల ఇసుక అందించాం. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకునే మద్యం పాలసీని రూపొందించాం. నాణ్యమైన, బ్రాండెడ్ మద్యం విక్రయాలు జరిగేలా చూస్తున్నాం. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 700 పౌరసేవలు అందిస్తున్నాం. అత్యంత పేదరికంలో ఉన్న వారిని ఆదుకునేందుకు తీసుకొచ్చిన కార్యక్రమం జీరో పావర్టీ-పీ4. ఉన్నతస్థాయిలో ఉన్న 10 శాతం మంది అట్టడుగున ఉన్న 20 శాతం మందికి చేయూతనిచ్చి పైకి తీసుకురావడమే దీని ముఖ్యోద్దేశం.

3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా..

మోదీ నాయకత్వంలో త్వరలోనే 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనున్నాం. మనది డెడ్ ఎకానమీ కాదు, గుడ్ ఎకానమీ. సైనిక శక్తిలోనూ మనమేంటో ఆపరేషన్ సిందూర్‌తో నిరూపించాం. శత్రుదేశాలు తూటాలు పేల్చితే.. మిస్సైళ్లతో బదులిచ్చిన మన త్రివిధ దళాలకు జైకొడదాం. మోదీ వికసిత్ భారత్-2047 విజన్ రూపొందించారు. మనం స్వర్ణాంధ్ర-2047 విజన్‌ను రూపొందించాం. 2047 నాటికి భారతదేశం ప్రపంచ ఆర్థిక శక్తిగా నిలుస్తుంది.





ప్రదర్శనలో ప్రథమ బహుమతి పొందిన పట్టు పరిశ్రమ శాఖ శకటం, బహుమతి అందుకుంటున్న ఆ శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, అదనపు డైరెక్టర్ అరుణకుమారి, వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్



ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, సెల్యూట్ చేస్తున్న సీఎం చంద్రబాబు

బనకచర్లకు అభ్యంతరమెందుకు?

» ఎగువ రాష్ట్రాల నుంచి వరద వస్తుంటే.. ఆ కష్టనష్టాలను దిగువ రాష్ట్రంగా భరిస్తున్నాం

» వృథాగా పోతున్న నీటిని వాడుకోకూడదంటే ఎలా: సీఎం

రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు గోదావరి వృథా జలాలను పోలవరం నుంచి బనకచర్లకు మళ్లించాలని నిర్ణయించామని సీఎం చంద్రబాబు తెలిపారు. 'సముద్రంలోకి వృథాగా పోయే నీటినే వినియోగిస్తాం. ఈ ప్రాజెక్టుతో ఏ రాష్ట్ర నీటి ప్రయోజనాలకు నష్టం వాటిల్లదు. ఎవరూ అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదు. వరదలు వచ్చినప్పుడు ఎగువ రాష్ట్రాలు నీటిని విడుదల చేస్తే.. దిగువ రాష్ట్రంగా ఆ నష్టాలను, కష్టాలను భరిస్తున్నాం. అదే వరద నీటిని వాడుకుంటామంటే అభ్యంతరాలు ఎందుకు? వరదను భరించాలే గానీ.. దాని నుంచి ప్రయోజనం పొందకూడదంటే ఎలా కుదురుతుంది' అని ప్రశ్నించారు. 2027 డిసెంబరునాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. ప్రకాశం జిల్లాను కరువు నుంచి బయటపడేసే వెలిగొండ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని.. వచ్చే జూలై కల్లా సాగునీరు ఇచ్చే దిశగా పనులు చేస్తున్నామని చెప్పారు.

డబుల్ ఇంజన్ సర్కారుతో..
చీకటి నుంచి వెలుగు వైపు!

ఒక రాష్ట్రం.. ఒకే రాజధాని.. అభివృద్ధి వికేంద్రీకరణ.. ఇదే మా ప్రభుత్వ నినాదం: లోకేశ్

» మోదీ, బాబు, పవనన్న కలిసి సుపరిపాలనలో తొలి అడుగు: మంత్రి

» గుంటూరులో జాతీయ జెండా ఆవిష్కరణ

గుంటూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): డబుల్ ఇంజన్ సర్కారుతో రాష్ట్రం చీకటి నుంచి వెలుగు వైపు తొలి అడుగు వేసిందని మంత్రి లోకేశ్ అన్నారు. 'ఒక రాష్ట్రం.. ఒకే రాజధాని.. అభివృద్ధి వికేంద్రీకరణ మా నినాదం. అందుకు అనుగుణంగానే రాష్ట్రం నలుమూలలకూ వివిధ రకాల పరిశ్రమలు రప్పిస్తున్నాం..' అని తెలిపారు. గుంటూరులోని పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రసంగిస్తూ.. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ దిశగా ఆర్సెలార్ మిట్టల్, ఏఎన్ఎస్ఆర్, సత్వ వంటి ప్రముఖ కంపెనీలను రాష్ట్రానికి రప్పించామన్నారు. 2019 నుంచి 2024 వరకూ ఆంధ్రప్రదేశ్‌లో చీకటి రోజులు చూశామని.. గత ప్రభుత్వం ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి నెట్టిందని ఆవేదన వ్యక్తంచేశారు. 2024 ఎన్నికల్లో ప్రజలు తమ తీర్పుతో చరిత్ర సృష్టించారు. 94 శాతం స్ట్రైక్ రేట్, 164 సీట్లలో ఎన్డీయేను గెలిపించి రికార్డులు బద్దలు కొట్టి ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవనన్న కలిసి సుపరిపాలనలో తొలి అడుగు వేశారు' అని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా విద్యా వ్యవస్థ ఉండాలని బలంగా నమ్ముతానని.. విద్యా మంత్రిగా బాధ్యతలు తీసుకున్న ఏడాదిలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చామని చెప్పారు. 'కేజీ నుంచి పీజీ వరకూ కరిక్యులం మార్చాం. పుస్తకాల్లో నా ఫొటోలు, సీఎం ఫొటోలు లేవు. గతంలో 1,200 మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఉంటే ఇప్పుడు 9,600 ఏర్పాటు చేశాం. మెగా పేరెంట్స్-టీచర్స్ మీట్ నిర్వహిస్తున్నాం. మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెట్టాం. స్టూడెంట్ కిట్‌కు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరు పెట్టాం. చాగంటి కోటేశ్వరరావు రూపొందించిన నైతిక విలువల పుస్తకాలు విద్యార్థులకు ఇస్తున్నాం. వర్సిటీలను ప్రక్షాళన చేస్తున్నాం. మంచి వ్యక్తులను వీసీలుగా నియమిస్తున్నాం' అని చెప్పారు.



గుంటూరులో జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న మంత్రి నారా లోకేశ్, కలెక్టర్ నాగలక్ష్మి, ఐజీ త్రిపాఠి

స్వాతంత్ర్య పోరాటంలో తెలుగునేలది ప్రత్యేక చరిత్ర

స్వాతంత్ర్య పోరాటంలో తెలుగు నేలకు ప్రత్యేక చరిత్ర ఉందని లోకేశ్ తెలిపారు. 'బ్రిటిష్ వాడి తుపాకీకి గుండె చూపిన యోధుడు ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు. జాతీయ జెండాను పింగళి వెంకయ్య రూపొందించారు. 'మాకొద్దీ తెల్లదొరతనం' అని నినదించారు గరిమెళ్ల సత్యనారాయణ. అమరజీవి పొట్టి శ్రీరాములు లాంటి ఎంతోమంది దేశభక్తులు, సమరయోధులు మన తెలుగు నేలపైనే పుట్టారు. గుంటూరు జిల్లా పెదనందిపాడులో సహాయ నిరాకరణ ఉద్యమం జరిగింది. సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా గుంటూరు, తెనాలిలో ఆందోళనలు జరిగాయి. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని తెనాలికి చెందిన ఏడుగురు ప్రాణత్యాగం చేశారు. మంగళగిరిలో స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు, ఆనాటి ఘట్టాలను గుర్తు చేస్తూ మ్యూజియం ఏర్పాటు చేయబోతున్నాం' అని ప్రకటించారు. మన దేశ పవర్ ఫుల్ మిస్సైల్ ప్రధాని మోదీ అని.. పాక్‌కు సరైన శిక్ష వేశారని చెప్పారు.

ఎక్సైజ్ అధికారులు, సిబ్బందికి అవార్డులు

అమరావతి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ పనితీరు కనబరిచిన ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా అవార్డులు అందజేశారు. మంగళగిరిలోని ఎక్సైజ్ కమిషనరేట్‌లో శుక్రవారం వేడుకలు నిర్వహించారు. ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ... నవోదయం-2.0 ద్వారా 50 శాతం జిల్లాలను నాటుసారా రహితంగా మార్చామన్నారు. తక్కువ ధరలకే నాణ్యమైన మద్యం అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ పాల్గొన్నారు.

హైకోర్టులో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు

» జాతీయ జెండాను ఆవిష్కరించిన సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్



హైకోర్టు ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్

అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ మువ్వన్నెల పతాకాన్ని ఆవిష్కరించి, వందనం చేశారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సీజే మాట్లాడుతూ... 'ప్రజాస్వామ్యానికి జ్యుడీషియరీ ఓ బలమైన స్తంభం. ఎన్నో సంక్లిష్ట సమస్యలను పరిష్కరించడమేకాక, రాజ్యాంగం ప్రసాదించిన ప్రజాస్వామ్య స్ఫూర్తిని న్యాయవ్యవస్థ కాపాడుతోంది. దేశాభివృద్ధికి ప్రజలందరూ పునరంకితం కావాలి' అని పిలుపునిచ్చారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఎన్.ద్వారకానాథ్‌రెడ్డి, అడ్వకేట్‌జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, అడిషనల్ సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమంలో న్యాయవాదులు కీలకపాత్ర పోషించారన్నారు. ప్రస్తుత సమాజంలో న్యాయవాదులపై దాడులు పెరిగిన నేపథ్యంలో అడ్వొకేట్ రక్షణ చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వేడుకలకు హైకోర్టు న్యాయమూర్తులు, వారి కుటుంబ సభ్యులు, విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ శ్యాంప్రసాద్, జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ దుప్పల వెంకటరమణ, అడిషనల్ అడ్వొకేట్ జనరల్ సాంబశివప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ, రిజిస్ట్రార్‌లు, న్యాయవాదులు పాల్గొన్నారు.



న్యాయసేవాధికార సంస్థలో..

సచివాలయం సమీప ఏపీ న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో జస్టిస్ రవినాథ్ తిల్హరి జాతీయ జెండాను ఎగురవేసి, వందనం సమర్పించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో..

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలోని పశుసంవర్ధకశాఖ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ దామోదర్‌నాయుడు, తాడేపల్లిలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్‌జైన్, గుంటూరు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వీసీ శారదా జయలక్ష్మి, మంగళగిరిలోని అటవీ శాఖ ప్రధాన కార్యాలయంలో పీసీసీఎఫ్ ఏకే నాయక్ మువ్వెన్నల జెండాను ఎగుర వేశారు.



విజయవాడలోని రాజ్‌భవన్‌లో నిర్వహించిన ఎట్ హోం కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

రాజ్‌భవన్‌లో ఘనంగా ఎట్ హోమ్

గవర్నర్ ఆహ్వానంతో సీఎం, డిప్యూటీ సీఎం దంపతులు హాజరు

హైకోర్టు చీఫ్ జస్టిస్, ఆయన భార్య కూడా.. తొలిసారి ఎట్ హోమ్‌కు పవన్ సతీమణి

అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రాజ్‌భవన్‌లో ఎట్ హోమ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆహ్వానం మేరకు సీఎం చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి.. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఆయన భార్య అనా లెజినోవా, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ఆయన సతీమణి గుడియా ఠాకూర్ తదితరులు విచ్చేశారు. సాయంత్రం 6.15 గంటలకు రాజ్‌భవన్‌కు చేరుకున్న చంద్రబాబు దంపతులు, పవన్ కల్యాణ్ దంపతులు.. గవర్నర్ దంపతులకు పుష్పగుచ్ఛాలు అందించి ప్రధాన వేదిక వద్దకు తీసుకొచ్చారు. అనంతరం జాతీయ గీతాలాపనతో ఎట్ హోమ్ కార్యక్రమం ప్రారంభమైంది. అతిథుల వద్దకు గవర్నర్ స్వయంగా వెళ్లి పలుకరించారు. అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం, సీజే.. కుటుంబ సమేతంగా అల్పాహారం స్వీకరించారు. అనా లెజినోవా తొలిసారి ఎట్‌హోమ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వీరిద్దరూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సాయంత్రం 6.45గంటలకు ఎట్ హోమ్ ముగిసింది. సీఎం, డిప్యూటీ సీఎం, సీజే మర్యాదపూర్వకంగా గవర్నర్‌ను రాజ్‌భవన్‌లోకి సాగనంపారు. టీడీపీ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ధరించిన చొక్కా, పై కండువా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. టీడీపీకి ప్రతీక అయినా పసుపు చొక్కా, జనసేనకు ప్రతీకగా మారిన ఎర్రకండువాను ధరించి ఆయన ఎట్ హోమ్‌కు హాజరయ్యారు. మంత్రి కొల్లు రవీంద్ర, సీఎస్ కె.విజయానంద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, సీఎం ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, హైకోర్టు న్యాయమూర్తులు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జనసేన ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, మండలి మాజీ డిప్యూటీ ఛైర్‌పర్సన్ జకియా ఖానం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ప్రజాప్రతినిధులు, పద్మ అవార్డు గ్రహీతలు, స్వాతంత్ర్య సమరయోధులు పాల్గొన్నారు.



ఎట్ హోం కార్యక్రమంలో సీఎం సతీమణి భువనేశ్వరి, డిప్యూటీ సీఎం సతీమణి అన్నా లెజినోవా



విజయవాడలో ఉచిత బస్సు ఎక్కిన మహిళల ఆనందోత్సాహం


విజయవాడలో ఉచిత బస్సుకు స్వాగతం పలుకుతూ కేరింతలు కొడుతున్న మహిళలు



మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రారంభోత్సవం సందర్భంగా బస్సులో ప్రయాణిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేస్తాం: పవన్



సూపర్ పథకాల అమలులో భాగంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిచూసి ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు సాధ్యమేనా.. అని ముఖ్యమంత్రి చంద్రబాబును అప్పట్లో అడిగానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. మనసుంటే మార్గం ఉంటుంది.. మాటిచ్చాం... అమలు చేసి తీరుతామని సీఎం అన్నారని, ఆయన అపారమైన అనుభవం, నిబద్ధతకు ఈ మాటలే నిదర్శనమన్నారు. "వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్త విధానాల వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. ఓ వైపు ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దుతూనే మరో వైపు సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. మహిళా సాధికారత కోసం, ఆర్థిక స్వావలంబన కోసం ఉచిత ప్రయాణం అమలు చేయడం సంతోషంగా ఉందని, మహిళల భద్రత కోసం పటిష్ఠ చర్యలు చేపడతామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో సీసీ కెమెరాలతోపాటు కండక్టర్లకు బాడీ కెమెరాలు ఉంటాయని తెలిపారు. "కూటమిగా ఏర్పడి ఓట్లు అడిగాం.. మీరు మమ్మల్ని గెలిపించి బాధ్యత అప్పగించారు.. ప్రధాని మోదీ సహకారంతో చంద్రబాబు నాయకత్వంలో సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేస్తాం." అని ధీమా వ్యక్తం చేశారు. ఉచిత బస్సు వల్ల ప్రతి నెలా రూ.1500నుంచి రెండు వేల వరకూ ప్రయాణ ఖర్చు మిగులుతుందని తనతోపాటు బస్సులో ప్రయాణించిన వారు చెబుతుంటే సంతోషం అనిపించిందన్నారు.

మహిళలు త్యాగమూర్తులు: మాధవ్



"ప్రతి కుటుంబంలోనూ మహిళలు ఇవ్వడమే తప్ప తీసుకోవడం తెలియని వారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. అలాంటి త్యాగమూర్తులకు కూటమి ప్రభుత్వం తల్లికి వందనం, ఉచిత ప్రయాణం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలు ఆనందంగా ఉంటే అదే పెద్దవరంగా సీఎం చంద్రబాబు భావిస్తారని, మహిళా సాధికారత కోసం ఉచిత ప్రయాణం ఎంతగానో ఉపయోగ పడుతుందని మాధవ్ ఆనందం వ్యక్తం చేశారు.

మహిళలకు నిజమైన స్వాతంత్ర్యం

ఫ్రీ బస్సుల్లో ఎక్కడికైనా ప్రయాణించండి.. పంద్రాగస్టు వేళ ఉచిత బస్సుకు సీఎం శ్రీకారం

అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆడబిడ్డలు ఇకనుంచి జీరో ఫేర్ టికెట్‌తో ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విజయవాడ బస్టాండ్‌లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం 'స్త్రీ శక్తి' ని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఉండవల్లి గుహల నుంచి విజయవాడ బస్టాండ్ వరకూ మహిళలతో కలిసి వారంతా ప్రయాణించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజు రాష్ట్ర మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం లభించిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని 2.62కోట్ల మంది మహిళలు లబ్ధి పొందే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళా కండక్టర్లను గతంలో తానే నియమించానని, త్వరలో మహిళా డ్రైవర్లు కూడా రాబోతున్నారని వెల్లడించారు. రాబోయే రోజుల్లో కొనేవన్నీ విద్యుత్ బస్సులేనని, మహిళలు ఆ బస్సుల్ని సులభంగా నడపవచ్చన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

"అత్తారింట్లో ఉన్న ఆడబిడ్డను చూసేందుకు వెళ్లే తల్లి.. అత్తతో కలిసి కూరగాయల మార్కెట్‌కు వెళ్లే కోడలు.. ఆలయాల దర్శనానికి వెళ్లే పెద్దావిడ, కళాశాలకు వెళ్లే యువతి, ఉద్యోగానికి వెళ్లే మహిళ.. ఇలా ఎవరైనా.. ఎక్కడి నుంచి ఎక్కడికైనా జిల్లాలు దాటి శ్రీకాకుళం నుంచి శ్రీశైలం వరకూ ఆర్టీసీ బస్సుల్లో ఆధార్ కార్డు చూపించి జీరో ఫేర్ టికెట్‌తో చక్కగా ప్రయాణించవచ్చు."

- సీఎం చంద్రబాబు

గొప్ప మైలురాయి..

"టీడీపీ మహిళల పక్షపాతి. ఆడబిడ్డలకు ఆస్తిలో వాటా ఎన్టీఆర్ కల్పించారు. ఆర్థిక స్వావలంబన కోసం డ్వాక్రా సంఘాలను నేను తెచ్చాను. మహిళలకు ప్రధాని మోదీ చట్ట సభల్లో 33శాతం రిజర్వేషన్ తీసుకు రావడం దేశంలోనే గొప్ప మైలురాయి. రాష్ట్రంలో ఐదేళ్లపాటు(2019-2024) మహిళలు ఆనందం, నవ్వు అన్నీ కోల్పోయారు. నాతోపాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుటుంబంలోని ఆడవాళ్లు సైతం గత ప్రభుత్వ బాధితులే. ఎన్నికల్లో మీరు నన్ను ఆశీర్వదించారు.. నేను మీకు స్త్రీ శక్తి పథకం అమలు చేసి మీలో సంతోషాన్ని చూస్తున్నా.."

ఆటోడ్రైవర్లకు ఇబ్బంది రానీయం

"ఆడ బిడ్డలపై అఘాయిత్యాలకు కారణమైన గంజాయి, మత్తు పదార్థాల కట్టడికి 'ఈగల్'ను రంగంలోకి దించా. గంజాయి అమ్మితే అదే వారికి ఆఖరి రోజు. ఆడబిడ్డల జోలికి ఎవరొచ్చినా, సోషల్ మీడియాలో కించపరుస్తూ పోస్టు పెట్టినా వదిలిపెట్టను. ఈ విషయంలో మంత్రి లోకేశ్ చేసిన సూచన (వెబ్ సిరీస్‌లో మహిళల్ని అవమానించే వ్యాఖ్యల కట్టడి చట్టం)ను కూడా పరిశీలిస్తాం. అవసరమైతే చట్టం తీసుకొస్తాం. నేను ఏ మంచి పనిచేసినా అడ్డుకునేందుకు కొందరు(వైసీపీ నేతలను ఉద్దేశించి) కుయుక్తులు పన్నుతున్నారు. అటువంటి వారికి మీరే(ప్రజలు) బుద్ధి చెప్పాలి. ఉచిత ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లకు ఇబ్బంది రానివ్వబోం. వారికి ఎలా న్యాయం చెయ్యాలనే విషయమై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశాం. నివేదిక అందగానే సముచిత నిర్ణయం తీసుకుంటాం."

పులివెందుల ఓటర్లకు 30ఏళ్ల తర్వాత స్వేచ్ఛ

"పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ముప్పై సంవత్సరాల తర్వాత ఓటేసినందుకు ఆనందం వ్యక్తం చేస్తూ ఒక ఓటరు 'అందరికీ దండాలు' అంటూ బ్యాలెట్ పేపర్‌తో పాటు చీటీ బాక్సులో వేశారు. దేశ ప్రజలకు 79ఏళ్ల క్రితం స్వాతంత్ర్యం వస్తే పులివెందుల ఓటర్లకు 30సం.తర్వాత ఓటేసే స్వాతంత్ర్యం ఇప్పుడు లభించింది. 'మా వివేకా సార్‌కు న్యాయం చేయండి' అంటూ మరో వ్యక్తి చీటీ రాసి వేశారు... వివేకా కుటుంబానికి న్యాయం చేయాలా వద్దా? (సభికుల్ని చంద్రబాబు ప్రశ్నించగా, చేయాలి.. చేయాలి.. అంటూ గట్టిగా మహిళలు గళం కలిపారు.)"

తల్లి, చెల్లికి న్యాయం చేశాకే మాట్లాడాలి: లోకేశ్

సొంత చెల్లితో రాఖీ కట్టించుకోలేని వ్యక్తులు టీడీపీని, ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తున్నారంటూ వైసీపీ అధినేత జగన్‌ను ఉద్దేశించి మంత్రి లోకేశ్ అన్నారు. "సొంత చెల్లితో రాఖీ కట్టించుకోరు కానీ మాటకు ముందు అక్క చెల్లెమ్మలు అంటారు. మమ్మల్ని ప్రశ్నించే ముందు తల్లి, చెల్లికి ఆయన సమాధానం చెప్పాలి. మా ఇంట్లో మహిళల్ని ఎంతగానో గౌరవిస్తాం. మా అమ్మను హెరిటేజ్ చూసుకోమని మా నాన్న చెప్పినప్పుడు ఆమె మొదట ఆఫీసులోకి వెళ్లలేక పోయారు.. ఎంత భయపడి వెనక్కి వచ్చినా ఆయన పదే పదే ప్రోత్సహించడంతో ఈ రోజు రూ. ఐదు వేల కోట్ల టర్నోవర్ కంపెనీని మా అమ్మ సమర్థవంతంగా నడుపుతున్నారు. నా భార్య బ్రాహ్మణి స్టాన్ ఫోర్డ్‌లో చదువుకొని వచ్చి ఇప్పుడు వ్యాపారాలతో పాటు ఇంటిని చూసుకొంటున్నారు.. మహిళల్ని కించపరిచేలా వెబ్ సిరీస్‌లలో వ్యాఖ్యలు ఉంటున్నాయి. వాటిని అరికట్టేందుకు ప్రత్యేక చట్టం అవసరం." అని లోకేశ్ సూచించారు.



మీ బస్సు టికెట్‌కు నేను డబ్బులిచ్చా!

» నా నియోజకవర్గానికి మీ నిధులు తీసుకుంటా!

» డిప్యూటీ సీఎం పవన్‌తో లోకేశ్ సరదా వ్యాఖ్యలు

విజయవాడ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): 'స్త్రీ శక్తి' పథకం ప్రారంభం సందర్భంగా ఉండవల్లి నుంచి విజయవాడ బస్టాండ్‌కు రావడానికి మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు ఎక్కే క్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ మధ్య ఆసక్తికర సంభాషణ చోటు చేసుకుంది. ముందుగా బస్సు ఎక్కిన సీఎం చంద్రబాబు కండక్టర్ కె. దుర్గాభవాని దగ్గర టికెట్ తీసుకున్నారు. తర్వాత ఎక్కిన పవన్ ముందుకు వెళ్లబోతుండగా కండక్టర్ 'టికెట్ సార్' అని అడిగారు. పవన్ తన జేబులోంచి డబ్బులు తీస్తుండగా వెనక వచ్చిన లోకేశ్ ఆయన్ను వారించారు. నలుగురికీ తానే టికెట్ తీసుకుంటానంటూ కండక్టర్‌కు డబ్బులు ఇచ్చారు. సీఎం దగ్గర తీసుకున్న డబ్బులు కూడా తిరిగి ఇచ్చేయాలని కోరారు. లోకేశ్ ఒత్తిడి చేయడంతో పవన్ నవ్వుకుంటూ ముందుకు కదిలారు. ఆ తర్వాత పవన్‌తో లోకేశ్ మాట్లాడారు. 'మంగళగిరిలో మీ బస్సు టికెట్‌కు డబ్బులు నేనిచ్చాను. నా నియోజకవర్గ అభివృద్ధికి మీ నుంచి నిధులు తీసుకుంటా' అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. దీంతో ఇద్దరి మధ్యా నవ్వులు పూశాయి.


నెల్లూరులో కదిలిన స్త్రీశక్తి బస్సు, లోపల మంత్రి నారాయణ

స్త్రీశక్తి.. ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించి, మహిళకు టికెట్ ఇస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



విజయవాడలో ఉచిత బస్సుకు స్వాగతం పలుకుతూ కేరింతలు కొడుతున్న జనం

'ఉచిత బస్సు'పై వైసీపీ విషం

» రోడ్డెక్కి అడ్డంకులు సృష్టించే యత్నం

» ఫ్రీ పరిధిలోకి రాని బస్సులెక్కి యాగీ

» కండక్టర్లతో తగువు..ఆ వీడియోలతో రాద్ధాంతం

» పేద మహిళల్లో వ్యతిరేకత రాజేసే ప్రయత్నం

» సోషల్‌మీడియాలో దుమారానికి తాడేపల్లి ప్యాలెస్ వ్యూహం

అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రోడ్డెక్కిన మహిళల ఉచిత బస్సులపై వైసీపీ రాద్ధాంతం మొదలుపెట్టేసింది. సూపర్ సిక్స్ పథకాలను అమలుచేయడం లేదంటూ ఇంతకాలం యాగీ చేశారు. తీరా.. 'స్త్రీశక్తి' ఉచిత బస్సు పథకానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టగానే.. రోడ్డెక్కి అడ్డంకులు సృష్టించడం మొదలుపెట్టారు. వైసీపీ నేతలు శుక్రవారం పలు చోట్ల ఉచితం పరిధిలోకి రాని బస్సులు ఎక్కి కండక్టర్లతో కావాలనే గొడవకు దిగారు. ఆ వీడియోలను వైసీపీ సోషల్ మీడియాలో పెట్టి హల్‌చల్‌కు ప్రయత్నించారు. మహిళల ఉచిత ప్రయాణానికి ఐదురకాల సర్వీసులను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఆర్టీసీలోని సింహభాగం బస్సులను 'స్త్రీ శక్తి' పథకానికే కేటాయించింది. అయితే, హైఎండ్, ఏసీ బస్సులు ఈ పథకం పరిధిలోకి రావని జగన్ పార్టీ నేతలకు తెలుసు. అయినా.. గొడవ కోసం గొడవ పెట్టుకుని హడావుడి చేయాలని చూస్తున్నారు. కూటమి పార్టీలు గత ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాలను రాష్ట్ర ప్రజలకు హామీ ఇచ్చాయి. అన్నట్టుగానే.. అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ఒక్కో పథకం అమలు చేస్తూ.. తాజాగా స్త్రీశక్తి పథకాన్ని కూడా ప్రారంభించాయి. దీంతో వైసీపీ మూకలకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో స్త్రీ శక్తి పథకంపై వైసీపీ కోర్ గ్రూప్ అంతర్గతంగా సమావేశమయినట్టు తెలిసింది. ఈ పథకంపై 'విషం' చిమ్మాలని నిర్ణయించారు. 70 కిలోమీటర్ల పరిధికే ఉచిత బస్సు పరిమితం అని, స్త్రీశక్తి పథకం ఆర్డినరీ బస్సులకే వర్తింపజేస్తున్నారంటూ..అబద్ధాలను, అర్ధ సత్యాలను విస్తృతంగా ప్రజల్లో వ్యాప్తిచేయాలని ఈ భేటీలో నిర్ణయించినట్టు తెలిసింది. 'పేదలు ఏపీ బస్సులు ఎక్కకూడదా?' అంటూ పొంతన లేని నినాదాలను ప్రచారంలో పెట్టేందుకు తాడేపల్లి ప్యాలెస్ సిద్ధమవుతున్నట్లు సమాచారం.

అట్టహాసంగా 'స్త్రీ శక్తి'

» రాష్ట్రవ్యాప్తంగా సందడిగా కార్యక్రమాలు

» ప్రారంభించిన మంత్రులు, ఎమ్మెల్యేలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రవ్యాప్తంగా అట్టహాసంగా స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించారు. జిల్లా కేంద్రాలు, నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు పండుగ వాతావరణంలో ఆర్టీసీ బస్సులకు జెండా ఊపి ఆరంభించారు. మహిళలకు స్వయంగా ఉచిత టికెట్లు అందజేశారు. మహిళలతో పాటు బస్సులలో ప్రయాణించారు. స్త్రీ శక్తి పథకాన్ని అనంతపురం ఆర్టీసీ బస్టాండులో మంత్రి పయ్యావుల కేశవ్, హిందూపురం ఆర్టీసీ బస్టాండులో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రారంభించారు. నెల్లూరు నగరంలోని ప్రధాన బస్టాండులో మంత్రి పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారు. కందుకూరులో స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, కావలిలో ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి, బుచ్చిరెడ్డిపాళెంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏలూరులో మంత్రి కొలుసు పార్థసారథి ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఏలూరు నుంచి వేగివాడ వరకు 25 కిలోమీటర్లు బస్సును స్వయంగా నడిపారు. ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు కూడా ఆర్టీసీ బస్సును నడిపారు. టి.నర్సాపురం మండలంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్‌లు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాలగ్రామంలో జరిగిన కార్యక్రమంలో నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. అనకాపల్లి ఆర్టీసీ డిపో వద్ద హోం మంత్రి వంగలపూడి అనిత ఈ పథకాన్ని ప్రారంభించి, బస్సులో ప్రయాణించారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ విశాఖపట్నంలోని మద్దిలపాలెం డిపోలో ఈ పథకాన్ని ప్రారంభించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మధురవాడ బస్సు డిపోలో, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు గోపాలపట్నంలో, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పెందుర్తి బస్టాండ్‌లో ఈ పథకాన్ని ప్రారంభించారు. రాయచోటి బస్టాండు ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. కడప నూతన ఆర్టీసీగ్యారేజీలో మంత్రి ఎండీ ఫరూక్, ఎమ్మెల్యే మాధవి జెండా ఊపి ప్రారంభించారు. కర్నూలులో మంత్రి టీజీ భరత్, నంద్యాలలో బీసీ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఈ పథకాన్ని ప్రారంభించారు. శ్రీకాకుళం మండలం సింగుపురంలో మంత్రి అచ్చెన్నాయుడు ఈ పథకాన్ని ప్రారంభించి, జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు బస్సులో ప్రయాణించారు. శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని ఆర్టీసీ బస్టాండులో జరిగిన కార్యక్రమంలో మంత్రి సవిత, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత బస్..జోష్

» ఉండవల్లి నుంచి విజయవాడకు బస్సులో ప్రయాణించి వచ్చి పథకాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు

విజయవాడ, మంగళగిరి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): బెజవాడ రోడ్లపై ఉచిత బస్ సందడి చేసింది. మహిళల్లో కొత్త జోష్‌ను నింపింది. బెజవాడలో జెండా ఊపి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అందించే స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించేందుకు సీఎం చంద్రబాబు ఉండవల్లి నుంచి బస్సులో ప్రయాణించి వచ్చారు. ఐదు రకాల బస్సులకు ఆయన జెండా ఊపారు. ఈ ఐదు బస్సులను మహిళల కోసం స్పెషల్‌గా నడిపారు. అంతకుముందు.. మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సును విజయవాడ నుంచి ముఖ్యమంత్రి రాక కోసం ఉండవల్లికి అధికారులు పంపించారు. ఈ బస్సుకు మహిళా కండక్టర్‌గా కె.దుర్గాభవాని వ్యవహరించారు. ఉండ వల్లిలో అప్పటికే బస్సు కోసం సీఎం, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు మంత్రి లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌లు వేచి ఉన్నారు. బస్సు కోసం ఎదురు చూస్తూ ఉండవల్లి సెంటర్‌లోని బల్లమీద కూర్చున్నారు. వీరితో పాటు బస్సులో ప్రయాణించాల్సిన మహిళలు కూడా వారితో పాటు కూర్చున్నారు. మధ్యాహ్నం 3.15 గంటలకు బస్ రాగానే ముందుగా మహిళలు ఎక్కారు. ఆ తర్వాత చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్, మాధవ్‌లు బస్సెక్కారు. బస్సెక్కిన సీఎం, డిప్యూటీ సీఎంలకు కండక్టర్ టికెట్లు కొట్టారు. మహిళలకు జీరో ఫేర్ టికెట్ ఇచ్చారు. ఆ టికెట్లను చంద్రబాబు బస్సులో ఎక్కిన మహిళలకు స్వయంగా అందించారు. పవన్‌కల్యాణ్ బస్సులో కొద్ది నిమిషాలు లేచి నుంచొని పలువురు మహిళలతో సరదాగా కరచాలనం చేసి వారిని ఉత్సాహపరిచారు. 50 నిమిషాలు సీఎం బస్సులోనే ప్రయాణించారు. ఈ విషయం తెలుసుకుని ప్రజలు పెద్ద ఎత్తున రోడ్డుపైకి వచ్చి అభివాదం చేశారు.


సాలూరులో ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించి, అందులో ప్రయాణిస్తున్న మంత్రి గుమ్మిడి సంధ్యారాణి


అనకాపల్లిలో బస్సులో ప్రయాణిస్తూ జీరో ఫేర్ టికెట్ చూపుతున్న హోంమంత్రి అనిత


ఎలమంచిలిలో జీరో ఫేర్ బస్ టికెట్లతోమహిళలు. చిత్రంలో ఎమ్మెల్యే విజయకుమార్


హిందూపురంలో బస్సు నడుపుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.